ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 31.12.2025 | సంపుటి : 12 సంచిక : 162 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# పెద్దధన్వాడ నై.. నెల్లూరు సై

## ఇథనాల్ ఫ్యాక్టరీకి తలూపిన కొడవలూరు
## ప్రజాభిప్రాయ సేకరణలో నెగ్గిన యాజమాన్యం

- అనుకూలంగా ఉన్నవారి అభిప్రాయాలతోనే నిర్ణయం
- వ్యతిరేకులు రాకుండా కంపెనీ నిర్వాహకుల జాగ్రత్తలు
- పలువురు రైతుల ఆవేదనకు సమాధానమిచ్చిన నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఐఏఎస్


రాచర్లపాడులో ఇథనాల్ కంపెనీ కోసం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న నెల్లూరు కలెక్టర్

### పెద్దధన్వాడ ప్రాంతానికి 'కాలుష్య' ముప్పు కనుమరుగైనట్టే..!

'కాలుష్యం' మమ్మల్ని కాటేయబోతోందని ముందుగానే పసిగట్టిన పెద్దధన్వాడ పెద్ద తిరుగుబాటే చేసింది. దాదాపు పది నెలల పాటు అన్నీ త్యాగం చేసి ఉద్యమాన్ని వీడకుండా పోరాడింది. ఫలితంగా ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం 'పీడ' ఆ గ్రామానికి తొలగిపోయింది. గుట్టుచప్పుడు కాకుండా ఎన్నోసార్లు పనులకు పూనుకున్నా.. ప్రజలంతా ఏకమై అడ్డుకుని చివరకు విజయం సాధించారు. ఒక్క ఇటుక కూడా పడనివ్వకుండా ఇతర ప్రాంతానికి తరిమికొట్టారు. అవును.. ఇది నిజం..! అదే కంపెనీ యాజమాన్యం పక్క రాష్ట్రంలో ఇథనాల్ పరిశ్రమను నెలకొల్పేందుకు సకల ఏర్పాట్లు చేసుకుంది. ప్రజాభిప్రాయ సేకరణలోనూ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అనుకున్న విధంగానే నెగ్గింది. ఫ్యాక్టరీ వ్యతిరేకించేవారిని రాకుండా ముందస్తు వ్యూహాలతో ముందుకెళ్లిన యాజమాన్యం.. కలెక్టర్ సమక్షంలోనే పరిమిత వ్యక్తులతో ఫ్యాక్టరీకి జై కొట్టించుకుంది. పలువురు రైతులు తమ ఆవేదనను వినిపించినా.. ప్రభుత్వ అధికారుల హామీతో కంటితుడుపు చర్యలతో స్థానికులను ఎట్టకేలకు ఒప్పించుకోగలిగింది.

రాచర్లపాడు ఇఫ్కో కిసాన్ సెజ్ నుంచి
(మిద్దెల సత్యనారాయణ, జనంసాక్షి ప్రత్యేక ప్రతినిధి)

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రాచర్లపాడు, రేగడిచెలిక, బొడ్డువారిపాలెం, దగదర్తి మండలంలోని చౌటపుత్తేడు, ఊచగుంటపాలెం, తడకలూరు, అల్లూరు మండలంలోని నార్త్ ఆములూరు గ్రామం 'ఇఫ్కో కిసాన్ సెజ్ వద్ద 1123.50 హెక్టార్లు (2776.23 ఎకరాలు) ఇండస్ట్రియల్ పార్కులో మిగిలిన అనుబంధ మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త పారిశ్రామిక రంగాల ఏర్పాటు ప్రతిపాదనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో పర్యావరణ మిగతా 2లో..

### రైతుల అనుమానాలివే..

- ఇథనాల్ పరిశ్రమ వస్తే ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయి.
- మూగజీవాలు చనిపోతాయి.
- భవిష్యత్తులో పుట్టబోయే పిల్లలకు కూడా ఇతర వ్యాధులొచ్చే ప్రమాదం ఉంది.
- సాయంత్రం కాగానే వ్యర్థాలు బయటకు రావడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతారు.
- దీనివల్ల వ్యవసాయ భూములు బీడువారుతాయి.
- మా గ్రామాల్లోకి కాలుష్యం, వాసన వస్తే శ్వాసకోశ సమస్యలు వస్తాయి.



పెద్దధన్వాడపై 'జనంసాక్షి' ప్రచురించిన కథనం..

నిన్న మోమిన్‌పేటలో ఇలా..



పబ్లిక్ హియరింగ్‌లో

## పెల్లుబికిన ప్రజాగ్రహం

రైతులు, ప్రజల వ్యతిరేకతకు తలొగ్గిన ఇథనాల్ యాజమాన్యం

### తోకముడిచిన మెస్సర్స్ సువీర బయో ఫ్యూయల్స్ కంపెనీ
### మోమిన్ పేటలో పరిశ్రమ ఏర్పాటు ఉపసంహరించుకున్నట్లు ప్రకటన
### 'జనంసాక్షి'కి కృతజ్ఞతలు చెప్పిన శాస్త్రవేత్తలు, జేఏసీ నాయకులు

*ఇథనాల్ పరిశ్రమ రాకను తీవ్రంగా వ్యతిరేకించి రైతులు దేశ చరిత్రలోనే తొలి విజయం సాధించారు. దేశవ్యాప్తంగా 30 పరిశ్రమలు మంజూరయితే రైతు ఉద్యమంతో మొదటిసారిగా ఒక కాలుష్య పరిశ్రమ రద్దయింది. కాలుష్య పరిశ్రమలు రద్దుచేసి రైతువాణి కేంద్రానికి వినిపించారని వక్తలు కొనియాడారు.*



వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 30 (జనంసాక్షి):
వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలంలో నిర్మాణం చేయనున్న మెస్సర్స్ బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంజూరైన ఇథనాల్ పరిశ్రమను యాజమాన్యం ఉపసంహరించుకుంది. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఈ పరిశ్రమ ఏర్పాటును మర్పల్లి మోమిన్ పేట మండలాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు విషయమై కార్యనిర్వాహక మిగతా 2లో..


గ్రూప్-1 కేసులో ముగిసిన వాదనలు..

## జనవరి 22న తీర్పు

హైదరాబాద్(జనంసాక్షి): గ్రూప్-1 ఫలితాలను రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ తో పాటు పలువురు ఉద్యోగులు దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరు వైపులా వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం జనవరి 22న తీర్పు వెల్లడిస్తామని తెలిపింది. టీజీపీఎస్సీ తరపున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరీక్షలు జరిగాయన్నారు. మూల్యాంకనంలో మిగతా 2లో..

# శాంతిభద్రతలు భేష్

## రాష్ట్రంలో 3 % తగ్గిన క్రైమ్‌రేట్

### త్వరలో పోలీస్ ఉద్యోగాల నియామకాలకై కసరత్తు

- పంచాయితీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాం
- ఫ్యూచర్ సిటీలో సమర్థంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ
- మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా సజావుగా నిర్వహించగలిగాం
- మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం
- 2025 వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ శివధర్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇటీవలి మూడు విడతల్లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కూడా శాంతి భద్రతలు కాపాడి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూశామని డీజీపీ అన్నారు. మంగళవారం నాడు 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండుగల బందోబస్తు పటిష్టంగా చేశామన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా దిగ్విజయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకున్నామని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించడం లో పోలీసులు సమర్థంగా పనిచేశారని అన్నారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా , తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా శిఖా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు మిగతా 2లో..



## కాలుష్య రహిత హైదరాబాద్
# మహానగరమే లక్ష్యం

### ఆ దిశగా పూర్తిస్థాయి ప్రక్షాళన

- ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి చేయాలి
- చెత్త, కాలుష్య నివారణ అతిపెద్ద టాస్క్
- చెత్త ఏరివేతకు వారినికి మూడ్రోజులు స్పెషల్ డ్రైవ్
- ప్లాస్టిక రహిత నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు
- నాలాలు, చెరువుల ఆక్రమణలు కాకుండా చూడాలి
- జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు
- గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్‌కు మారాలి
- జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్ దిశా నిర్దేశం

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ మహానగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయి ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. తెలంగాన రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకునేందుకు ఇటీవల గ్లోబల్ సమ్మిట్ వేదికగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే క్యూర్‌పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని, పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని సీఎం తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుందని, హైదరాబాద్ మిగతా 2లో..

## మోడీ సర్కార్ సోయిలోకి రండి..
# సోయాబీన్‌ను కొనండి



### ఆదిలాబాద్ జిల్లాలో రైతుల ఆందోళనలు

తిరస్కరిస్తున్న నాఫెడ్.. మార్కెట్ యార్డులు, ఇండ్లలోనే పంట
ప్రైవేటులో తక్కువ ధరకు అమ్ముకుంటున్నామని ఆవేదన

ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :
ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ రైతుల ఆందోళనలు రోజురోజుకూ ఉధృతం అవుతున్నాయి. తాజాగా సోయాబీన్ పంటను కొనుగోలు చేయాలంటూ ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్ నుండి రైతుల ఆందోళన చేపట్టారు. మార్కెట్ యార్డ్ గేటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. పత్తి వాహనాలు మార్కెట్ యార్డులోనికి వెళ్లకుండా రైతులు అడ్డుకున్నారు. రైతుల ఆందోళనతో పత్తి కొనుగోళ్లు సైతం నిలిచిపోయాయి.అకాల వర్షాల వల్ల సోయాబీన్ పంట నాణ్యత దెబ్బతిని, రంగు మారడంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు న్యాయం చేయాలని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ ద్వారా తక్షణమే కొనుగోళ్లు జరపాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. ఇటీవలే పర్యటనకు వెళ్లిన ఆయనకు రైతులు పెద్దఎత్తున మొరపెట్టుకోవడంతో కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డుల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారని, కొనుగోళ్లు నిలిచి ఇళ్లలోనే సోయా నిల్వలు ఉండిపోయాయని మంత్రి తెలిపారు. కేంద్రం చొరవ మిగతా 2లో..



## బీఆర్ఎస్ శాసనసభ ఉపనేతల నియామకం

డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితా, తలసాని
బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
ప్రకటన విడుదల చేసిన అగ్రనేత కేసీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. మిగతా 2లో..

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా

## కన్నుమూత

- ప్రధాని మోడీ సంతాపం
- నేడు అంత్యక్రియలకు జై శంకర్ హాజరు

9లో..



కంచె నిర్మాణానికి మమత

## మోకాలడ్డు

బెంగాల్ సీఎం వల్లే బంగ్లా నుంచి చొరబాట్లు
ఘాటు విమర్శలు చేసిన అమిత్ షా

2లో..

## బెంగాల్లో భూమి ఇవ్వడం వల్లనే ప్రాజెక్టులు వచ్చాయి

అమిత్‌షావి కుట్రపూరిత వ్యాఖ్యలు
మండిపడ్డ మమతా బెనర్జీ



## ఆన్‌లైన్‌లో అశ్లీల కంటెంట్ వెంటనే తొలగించండి

- సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం హెచ్చరిక
- లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆన్‌లైన్‌లో అశ్లీల, అభ్యంతరకర కంటెంట్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పిల్లలపై లైంగిక వేధింపులు, అసభ్యకర, అశ్లీల కంటెంట్‌పై కఠినంగా వ్యవహరించాలని సామాజిక మాధ్యమాలు, ఇతర ఆన్‌లైన్ వేదికలకు స్పష్టం చేసింది. మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
31.12.2025

# కుటుంబ సమేతంగా తిరుమలకు రేవంత్ రెడ్డి

## శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ సిఎం



**తిరుమల(జనంసాక్షి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలను సందర్శించారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీవారిని రేవంత్ రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు రేవంత్ కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న రేవంత్ కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భార్య, బిడ్డ అల్లుడు, మనవడితో కలసి ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నరు. అనంతరం వారికి పూజారులు శ్రీనివాసుడి తీర్థప్రసాదాలు అందజేశారు. మరోవైపు సాధారణ భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఏకాదశి సందర్భంగా ద్వార దర్శనం కోసం భారీగా తిరుమలకు చేరుకున్నారు. తండోపతండాలుగా వస్తున్న భక్తులతో తిరుమల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల తాకిడికి తగినట్లుగానే అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలూ కల్పించారు. పోలీసులు సైతం పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

**తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి**

తిరుమల ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకోవడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి 12:05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇప్పటికే శ్రీవారి కొండకు తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ, సినీ ప్రముఖులు ఉత్తర ద్వారం గుండా ఆ గోవిందుడిని దర్శించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. అనేక మంది రాజకీయ, సినీ ప్రముఖులు తెల్లవారుజామునే ఉత్తర ద్వారం గుండా శ్రీనివాసుడి దర్శనం చేసుకున్నారు.ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్య ప్రసాద్, కొల్లు రవీంద్ర, సవిత, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, బాలకృష్ణ సతీమణి వసుంధర, నటులు రాజేంద్ర ప్రసాద్, నారా రోహిత్, శివాజీ, హీరోయిన్ శ్రీలీల, నటి హేమ, నిర్మాతలు డి.వి.వి దానయ్య, బండ్ల గణేష్, ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్, చాముండేశ్వరి నాథ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, మాధురి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

# బీఆర్ఎస్ శాసనసభ ఉపనేతల నియామకం

డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేయనున్నారు. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారీని బీఆర్ఎస్ ఎ÷-లోర్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారీని కొనసాగించడం ద్వారా పార్టీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది. కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్‌లో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత కీలకంగా మారుతాయని గులాబీ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు.

# పెద్దధన్వాడ నై..నెల్లూరు సై



రాచర్లపాడులో ఇథనాల్ కంపెనీ కోసం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరైన ప్రజలు

సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ మంగళవారం భారీ బందోబస్తు నడుమ జరిగింది. ప్రజాభిప్రాయ సేకరణకు రైతులు ఎంతమంది వచ్చారో అంతకు రెండింతలు పోలీసులు బందోబస్తు నిర్వహించడం గమనార్హం. రాచర్లపాడు గ్రామంలో రోజుకు 370 కిలో లీటర్ల ఇథనాల్, 7.25 మెగావాట్ల సహ ఉత్పత్తి విద్యుత్ ప్లాంట్‌తో కూడిన ధాన్యం ఆధారిత డిస్టిల్లరీ పరిశ్రమ ఏర్పాటుకు జరిగిన ఈ ప్రజాభిప్రాయ సేకరణకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఐఏఎస్ హాజరుకా గా, ఇతర అధికారులు, పలువురు స్థానిక నాయకులు సహా మొత్తం వందమందిలోపే ఈ కార్యక్రమంలో కనిపించారు. ప్రజాసంఘాల నేతలను, పౌరహక్కుల నాయకులను ఒకరోజు ముందస్తుగానే అరెస్టు చేసి నిర్బంధించగా.. ఫ్యాక్టరీ అనుకూల వ్యక్తులను మాత్రమే అక్కడికి అనుమతించారు. పట్టుమని పది మంది రైతులు కూడా దర్శనమివ్వలేదు. వచ్చినవారిలో కొందరు అభ్యంతరం వ్యక్తం చేయగా.. కలెక్టర్ వెంటనే స్పందించారు. స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. దీనిపై యాజమాన్యానికి కూడా సూచనలు చేశారు. కాలుష్యంతో ఆరోగ్యాలు చెడిపోతాయని, పశుపక్ష్యాదులు కూడా తీవ్ర ప్రభావానికి లోనవుతాయని మరికొందరు సందేహించగా.. కంపెనీ నిర్వాహకులు అలాందేమీ లేదని, అందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ క్రమంలో ఆరోగ్యాలు చెడిపోతే పరిస్థితేం టని రైతులు ప్రశ్నించగా.. కలెక్టర్ సమాధానమిచ్చారు. హెల్త్ కార్డులు మంజూరు చేయించేలా చూస్తామని హామీనిచ్చారు.

**వ్యతిరేక నినాదాలు వినిపించకుండా..**

రాచర్లపాడులో నిర్మించతలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ 260 కోట్ల రూపాయల నిధులతో 27.5 ఎకరాల్లో నిర్మించనున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రజాభిప్రాయ సేకరణలో పలు వివరాలు వెల్లడించినవారు.. ఫ్యాక్టరీ పట్ల వ్యతిరేకంగా ఉన్నవారిని రాకుండా అడ్డుకున్నారు. కేవలం యాభై మందిలోపే స్థానికులు, రైతులు ఉన్నారు. అందులో అనుకూలంగా ఉన్నవారినే అనుమతించి ఈ అభిప్రాయ సేకరణ చేపట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభావిత గ్రామాల రైతులు కూడా పెద్దగా లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ప్రజాభిప్రాయ సేకరణకు 42 గంటల ముందే ఎక్కడికక్కడ ప్రజాసంఘాల, కమ్యూనిస్టు పార్టీల నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేసి, భారీ బందోబస్తు మధ్య ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు.అయితే ఉద్యోగ ఉపాధి అవకాశాలూ, స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా హెల్త్ కార్డులు ఇత్యాది సౌకర్యాలు కల్పిస్తామని హామీనివ్వడంతో ఫ్యాక్టరీకి మార్గం సుగమమైంది. రైతులు, స్థానికులు కొందరు వెలిబుచ్చిన అనుమానాలను నివృత్తి చేసిన నెల్లూరు జిల్లా కలెక్టర్ కూడా ప్రభుత్వం తరపున హామీనివ్వడంతో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థానిక జనం జైకొట్టారు. దీంతో పెద్ద ధన్వాడలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీకి ఇటుక పడకుండానే ఇతర ప్రాంతానికి తరలిపోయినట్టుగా స్పష్టమవుతోంది. రాచర్లపాడు వద్ద ఏర్పాటు కాబోయే ఇథనాల్ ఫ్యాక్టరీ చుట్టు పక్కల గ్రామాలను దత్తత తీసుకోవాలని, చుట్టూ అధికంగా చెట్లు నాటాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ కల్పించాలనే డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి.

# పబ్లిక్ హియరింగ్‌లో పెల్లుబికిన ప్రజాగ్రహం

సారాంశంను యాజమాన్యం చదివిన తర్వాత రైతులు ప్రజా సంఘాలు వివిధ పార్టీల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. మోమిన్ పేటలో ఈ పరిశ్రమ ఏర్పాటు చేస్తే జరిగే పరిణామాలపై తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ కన్నెగంటి రవి రైతులకు వివరించారు. దీంతో రైతులు ఒక్కసారిగా చేతులుపైకి ఎత్తి పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించారు. మోమినిపేటలో దాదాపు పది ఎకరాల 30 గుంటల భూమిలో 100 కోట్ల అంచనా వ్యయంతో మెర్సర్స్ సువీర బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల ప్రజాజీవన విధానంపై ప్రభావం చూపే విషయమై శాస్త్రవేత్తలు వక్తలు మారు వెంకట్ రెడ్డి, కిరణ్ కుమార్, కర్నేగంటి రవి, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ గీత, ఏఐకేఎం కన్వీనర్ మహేందర్, పిడిఎస్ నాయకులు శ్రీకాంత్ స్వరాజ్యం వేదిక కోఆర్డినేటర్ అమరేశ్వర్, కాలుష్యకర వ్యతిరేక పోరాట సంఘం కన్వీనర్ సురేష్ రైతులకు ప్రజలకు వివరించారు. ఈ పరిశ్రమ ఏర్పాటులో ఉన్న లోపాలను ఎత్తిచూపారు. ఈ పరిశ్రమ ఏర్పాటు చేస్తే క్యాన్సర్ దీర్ఘకాలిక వ్యాధులు గర్భ శిశువుపై ప్రభావం పుట్టిన పిల్లల్లో బరువు తగ్గడం గొంతు నొప్పి తల తిరగడం వాంతు విరోచనాలు కావడం ఆయాసం రావడం వంటివి జరుగుతాయని అన్నారు. గాలి నీరు భూమి కలుషితమైన కారణంగా మనిషి మనుగడకు ప్రమాదకరంగా మారుతుందని అన్నారు. పరిశ్రమకు 10 కిలోమీటర్ల దూరం వరకు పంటల దిగుబడి తగ్గుతుందని నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. ఒక పరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రభుత్వం నీటి ఒప్పందం లేబర్ లైసెన్స్ కాలుష్యం స్థానికులకు ఉపాధి అవకాశాలపై స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే పరిశ్రమ మంజూరు ఉంటుందని ఇవేవీ చూడకుండా నిబంధనలకు వ్యతిరేకంగా పరిశ్రమలు మంజూరు చేశారని అన్నారు. రోజుకు లక్ష లీటర్ల వరకు నీళ్లు అవసరం ఉంటాయని ఈ నీటిని చెరువులు వాగులు వంకల నుంచి వినియోగిస్తారని విషయమై స్పష్టత లేదని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా రోజుకు లక్షల లీటర్ల నీటిని వినియోగిస్తే భవిష్యత్తులో ఏర్పడి అవకాశం ఉందని అన్నారు. దీంతో ప్రభుత్వం పై అదరపు భారం పడుతుందని అన్నారు. ఇథనల్ పరిశ్రమలకు సరిపోను బియ్యం నూకలు మొక్కజొన్న గోధుమలు దేశంలో ఉత్పత్తి కావడం లేదని అన్నారు. ఇప్పుడే వీటి కొరత ఉంటే విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నా రని భవిష్యత్తులో ఇంకా తీవ్రంగా ఉంటుందని వ్యాఖ్యానించా రు. ఇప్పటికే పరిశ్రమలు పెట్రోలు ఉత్పత్తి చేసిన దేశంలో ఎక్కడ పెట్రోల్ ధర తగ్గలేదని 15 రూపాయలకు లీటర్ పెట్రోల్ అందిస్తామని కేంద్ర ప్రభుత్వ హామీ నెరవేరలేదని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య వికారాబాద్ ఆర్డిఓ తహసిల్దార్ తో పాటు మెస్సర్స్ సువీర యాజమాన్యంతో పాటు వేదిక దగ్గర ఎలాంటి సంఘటన జరగకుండా వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి సిఐ వెంకటేష్ మర్పల్లి మోహన్పేట ఎస్సైలు ప్రత్యేక పోలీసు బృందాలను దింపారు. మొత్తానికి ప్రజాభిప్రాయ సేకరణ ఎలాంటి గొడవ లేకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఆన్‌లైన్‌లో అశ్లీల కంటెంట్ వెంటనే తొలగించండి

లేదంటే చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ అడ్వైజరీ జారీ చేసింది.అసభ్యకర, అశ్లీల, అనుచిత, చట్టవిరుద్ధ కంటెంట్‌పై సామాజిక మాధ్యమ వేదికలు కఠినంగా వ్యవహరించడం లేదని ఐటీ శాఖ పేర్కొంది. ఈ క్రమంలో ఐటీ చట్టంలోని సెక్షన్ 79 ప్రకారం థర్డ్‌పార్టీ సమాచారాన్ని ఆయా వేదికల్లో అప్‌లోడ్, ప్రచురణ, లేదా వ్యాప్తి చేస్తే.. అందుకు సామాజిక మాధ్యమ సంస్థలు సహా ఆయా ప్రచురణ వేదికలదే బాధ్యత అని పేర్కొంది.

## గ్రూప్-1 కేసులో ముగిసిన వాదనలు.. జనవరి 22న తీర్పు

అవకతవకలు జరగకూడదన్న లక్ష్యంతో ఇద్దరి చేత చేయించారని తెలిపారు. పరీక్ష కేంద్రాల పెంపు, పరిపాలనాపరమైన సౌలభ్యం కోసం ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు హాల్‌టికెట్లను వేర్వేరుగా జారీ చేసిందని,పరీక్షల్లో కాపీయింగ్ జరిగిందని ఎలాంటి ఆరో పణలు లేవని వెల్లడించారు. అర్హత సాధించిన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్షల్లో అర్హత సాధించలేనివారు కోర్టును ఆశ్రయించారన్నారు. రెండు హాల్‌టికెట్లు ఉంటాయని పరీక్షలకు ముందే వెల్లడించినా అప్పుడు అభ్యంతరం చెప్పకుండా, ఫలితాలు విడుదలయ్యాక పిటిషన్ వేయ డం చెల్లదన్నారు.

## బంగ్లాదేశ్‌లో ఆగని నిరసనలు

### ఆందోళనల్లో మరో వ్యక్తి మృతి

**ఢాకా(జనంసాక్షి):**బంగ్లాదేశ్ లో హిందువుల హత్యలు కొనసాగుతున్నాయి. వరుసగా హిందువులే లక్ష్యంగా అక్కడి ముష్కర మూకలు కాల్పులకు తెగిస్తున్నాయి. మరో హిందువు హత్యకు గురయ్యాడు. మయమన్‌సింగ్ జిల్లాలోని ఒక కర్మాగారంలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న బజేంద్ర బిశ్వాస్ (42)ను అతడి సహోద్యోగి కాల్చి చంపినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. సోమవారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాము ఇద్దరం ఫ్యాక్టరీ బారక్‌లో సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో భద్రత కోసం ఉప యోగించే తుపాకీని బిశ్వాస్ వైపు గురిపె ట్టానని.. అనుకోకుండా చేయి ట్రిగర్‌కు తాకడంతో తుపాకీ పేలి, బుల్లెట్ అతడికి తగిలిందని నోమన్ మియా పేర్కొన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపాడు.

# కాలుష్య రహిత హైదరాబాద్ మహానగరమే లక్ష్యం



నగరంలో అత్యంత సంక్లిష్టమైన చెత్త నిర్వహణ సమస్యను సమర్థవంతంగా అధిగమించాలన్నారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని, సిటీలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించామన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని సూచించారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ బస్సులు, ఆటోలను తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్ లో ఉండాల్సిందేనని, జోన్ ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్ లదేనని స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడా, రోడ్లపై గుంతలు కనిపించకుండా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్ కుకోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలను అందించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. జనన మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువ పత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. ఆన్ లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని తెలిపారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్ మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. సుపరిపాలనతో పాటు స్మార్ట్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ ఏరియాలో విభాగాల అధికారులను బాధ్యత స్పెషల్ సీఎస్ సమన్వయం చేసుకుంటారని తెలిపారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ చర్యలు చేపట్టాలని, ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని జోనల్ కమిషనర్లకు సీఎం సూచించారు. ప్రతీ నెలకు ఒకసారి స్వయంగా సమీక్షకోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని హోటల్స్ లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. క్యూర్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు అందుబాటులో ఉన్న స్థలాన్ని కేటాయించి భవనాలు నిర్మించాలన్నారు. అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు కార్యాలయాలను తరలించాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని 12 జోన్లలో చెరువులు, కుంటలు, నాలాలను పూర్తిగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఆక్రమణలను తొలగించి వర్షాకాలంలో వరదలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద చెరువులను గుర్తించి వాటిని పునరుద్ధరించి యాక్టివిటీ జోన్స్ గా అభివృద్ధి చేయాలని సూచించారు. జనవరి నుంచి ప్రతీ ఒక్కరూ ఫీల్డ్ ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే నగరం భవిష్యత్ మారుతుందన్నారు. ప్రతీ నెలకు ఒకసారి జోనల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రెటరీ మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కర్ణన్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎండీ అశోక్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎఫ్ సీ డీఏ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలు భేష్

తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33 శాతం క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 4 కేసులో మరణ శిక్షలు ఖరారు అయ్యాయని.. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పండిందని తెలిపారు. ఫోక్సో కేసుల్లో 144 కేసుల్లో 154 మందికి శిక్షలు ఖరారు అయ్యాయని.. అందులో ముగ్గురికి మరణ శిక్ష, 48 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడ్డాయని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. తెలంగాణలో 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్ గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారన్నారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంత ర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించుకున్నామని తెలి పారు. ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొ చ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు. ప్రైవేటు సంస్థల్లో మహిళల కోసం కమిటీలు ఏర్పాటు చేశామని.. పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఈ ఏడాది ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయబోతున్నామని.. ఇందులో 18 నుంచి 35 ఏళ్ళు లోపు ఉన్న వారు హాజరువుతారని తెలిపారు. టీజీ ఆర్టీసీ డ్రైవర్లను ఈ ఏడాది పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా పరీక్ష నిర్వహించామన్నారు. నయీమ్ కేసు సీఐడీ విచారణలో ఉందన్నారు. నయీమ్ కేసులో సీజ్ అయిన ల్యాండ్స్, చాలా మంది అమ్మాలని ప్రయత్నం చేశారని తెలిపారు. నయీమ్ లాండ్స్‌పై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఆ ల్యాండ్ ఎవరూ కొనవద్దని, అమ్మవద్దని ఆదేశాలు ఉన్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో డ్రగ్స్ కేసులు భారీగా పెరిగాయని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 30 శాతం డ్రగ్స్ కేసులు పెరిగినట్లు చెప్పారు. వేరే రాష్ట్రాల్లో ఉన్న నిందితులను ఈగల్ టీమ్ పట్టుకొస్తోందన్నారు. ఈగల్ టీమ్ ఈ ఏడాది రూ.173 కోట్ల డ్రగ్స్ సీజ్ చేసిందని అన్నారు.

## మోడీ సర్కార్ సోయిలోకి రండి.. సోయాబిన్‌ను కొనండి

తీసుకుంటేనే రైతులకు మద్దతు ధర దక్కుతుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే బేల మార్కెట్ యార్డులో మోకాళ్లపై కూర్చొని రైతులు వినూత్న నిరసన చేపట్టారు. 15 రోజులుగా పంట అమ్మడానికి రైతులు పడిగాపులు కాయగా.. మార్క్ ఫెడ్ అధికారులు ఇటీవల కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన పంటను అధికారులు నాఫెడ్ గోదాములకు తరలించగా అక్కడ అధికారులు పంటను తిరస్కరించారు. దీంతో రైతులు తమ పంటను తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నామాత్రంగా కొనుగోళ్లు చేస్తుందని, నిబంధనల పేరుతో రైతులను వేధింపులకు గురిచేస్తుందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోయాబీన్ పంటను కొనుగోలు చేయాలంటూ ఆందోళనలు చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు పంటను విక్రయించి నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. యాసంగి పెట్టుబడుల కోసం దళారులకు విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని జిల్లావ్యాప్తంగా రైతులు ఆవేదనకు లోనవుతున్నారు.

## కంచె నిర్మాణానికి మమత మోకాలడ్డు

**కోల్‌కతా(జనంసాక్షి):** భారత్ బంగ్లా సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి మమతా సర్కార్ అడ్డం పడుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల ప్రయోజనం కోసం టీఎంసీ పార్టీ బంగ్లాదేశీయుల చొరబాట్లను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేక పోతోందని ఆరోపించారు. సరిహద్దుల్లో చొరబాట్లు కేవలం బెంగాల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని.. మొత్తం దేశానికి సంబంధించిన సమస్యని అన్నారు. వీటివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమి కొడతామని హామీ ఇచ్చారు. హింసాత్మక రాజకీయాలను సృష్టించడంలో వామపక్షాలను టీఎంసీ అధిగమించిందని అమిత్‌షా న్నారు.

## బెంగాల్లో భూమి ఇవ్వడం వల్లనే ప్రాజెక్టులు వచ్చాయి

- అమిత్‌షావి కుట్రపూరిత వ్యాఖ్యలు
- మండిపడ్డ మమతా బెనర్జీ

**కోల్‌కతా(జనంసాక్షి):**బెంగాల్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతుండడంతో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయని అమిత్ షా అన్నారని మమత పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఇక్కడ ఉంటే పహల్గాం, దిల్లీలో ఉగ్రదాడులు చేసింది ఎవరని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మించలేకపోతున్నామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను మమత ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం భూమిని ఇచ్చిందన్నారు. తాము స్థలాన్ని ఇవ్వడం వల్లే రాష్ట్రంలో అన్ని రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్నారు. భాజపా నేతలు చెప్పే అబద్ధపు మాటలను బెంగాల్ ప్రజలు నమ్మరన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కేంద్రం 'ఎస్ఐఆర్' పేరుతో కుట్ర పన్నుతోందని వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియను ఇంత హడావిడిగా చేయడం కుట్ర కాదా అని అన్నారు.

# కెసిఆర్ అసెంబ్లీ చర్చకు వస్తారా?

- పాలమూరు-రంగారెడ్డిపై మాట్లాడుతారా
- రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఇదే చర్చ
- 2న తిరిగి ప్రారంభం కానున్న అసెంబ్లీ




**హైదరాబాద్, డిసెంబరు 30 (జనంసాక్షి) :** కెసిఆర్ తొలిరోజు అసెంబ్లీకి వచ్చారు. మళ్లీ వస్తారా అని అందరి అభిప్రాయంగా ఉంది. అసెంబ్లీలో ఆయన మాట్లాడితే చూడాలని కూడా చాలాంది అభిప్రాయంగా ఉంది. కెసిఆర్ మీడియా ముందుకన్నా, అసెంబ్లీలో తన వాణి వినిపించి ఆరోపణలకు సమాధానం చెప్పాలని కోరుకుంటున్నారు. 2న తిరిగి అసెంబ్లీ సమావేశం కానుంది. అయితే కెసిఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా లేదా అంటూ గత కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో జరుగుతున్న వేళ, సోమవారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. కేవలం కొద్దిసేపు మాత్రమే ఉండి వెళ్లిపోయారు. ఆయనకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. సోమవారం ఎట్టకేలకు శాసనసభలో వచ్చి కూర్చున్నారు. సభలోకి వచ్చిన కొద్ది నిమిషాలకే బయటకు వెళ్లిపోయారు. అయితే, ఆయన చర్య గులాబీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహాన్ని నింపింది. వెంటనే ఇలా వచ్చి అలా వెళ్లిపోయిన కేసీఆర్ తిరిగి కొత్త సంవత్సరం రెండో రోజు నుంచి జరిగే సమావేశాలకు వస్తారా? లేదా? అనే కొత్త చర్చ రాజకీయ వర్గాల్లో, సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. కేసీఆర్ తప్పకుండా సభకు వస్తారని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై మాట్లాడతారని బీఆర్ఎస్ శ్రేణులు గట్టిగా నమ్ముతున్నాయి. ఎందుకంటే కెసిఆర్ వస్తారని, మాట్లాడుతారని గతకొంత కాలంగా హరీష్ రావు, కెటిఆర్ఉ చెబుతూ వచ్చారు. సోమవారం కేసీఆర్ శాసనసభకు రావడం ఖరారు కావడంతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉదయమే పార్టీ ఎమ్మెల్యేలు ఆయనకు స్వాగతం పలికేందుకు వేచి ఉన్నారు. దాంతో అక్కడంతా హడావుడి కనిపించింది. బీఆర్ఎస్ ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ఆయన మొదట అసెంబ్లీ లాబీలో తనకు కేటాయించిన ప్రతిపక్ష నేత ఛాంబర్‌లోకి వెళ్లారు. అక్కడే సభకు సంబంధించిన హాజరు నమోదు పత్రంలో సంతకం చేశారు. తర్వాత అసెంబ్లీ హాల్లోకి వెళ్లి కూర్చున్నారు. కొద్ది నిమిషాల్లోనే తన నివాసానికి బయలుదేరి వెళ్లారు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై చర్చ జరుపుదామని, కేసీఆర్ సభకు రావాలంటూ ఈ మధ్యకాలంలో అధికార పార్టీ నేతలు సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలోనే జనవరి రెండు లేదా మూడో తేదీన కేసీఆర్ శాసనసభకు వస్తారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీలో చర్చించే అంశాలపై స్పష్టత వచ్చాక, చర్చించే అంశాలను బట్టి కేసీఆర్ పాల్గొనే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా, గత ప్రభుత్వాల ప్రతిపాదనలు, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తీసుకున్న నిర్ణయాలపై కేసీఆర్ మాట్లాడతారని సమాచారం. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న వైఖరి వల్ల రెండు జిల్లాల రైతులకు ఎలాంటి నష్టం జరగనుందో కేసీఆర్ ప్రస్తావిస్తారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల తర్వాత ఇదే అంశంపై క్షేత్రస్థాయి కార్యాచరణ సిద్ధం చేసి, ప్రజల్లోకి వెళ్తారని అంటున్నారు. రెండు అంశాలపై అసెంబ్లీ వేదికగా ఏం చెప్పాలి? ఇప్పటివరకు ఎదురైన ఇబ్బందులు, భవిష్యత్‌లో ఏర్పడే ప్రమాదాలు వంటి వాటిపై కేసీఆర్ సంబంధిత నిపుణులతో చర్చలు జరుపుతూ సన్నద్ధం అవుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఒకరు తెలిపారు. అయితే విపక్షనేతగా ఈ రెండేళ్ల కాలంలో అసెంబ్లీలో కెసిఆర్ ఎక్కడా కనిపించలేదు. కేవలం సంతకం పెట్టి వెళ్లిపోయారు. కనీసం ఇప్పుడైనా రాకుటే ఇక బిఆర్ఎస్‌పై ప్రజల్లో నమ్మకం కూడా కానరాదు.

# నూతన వేడుకల్లో క్యాబ్ సర్వీసులపై పోలీసుల నజర్

- ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు
- ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్న పోలీసులు

**హైదరాబాద్, డిసెంబరు 30 (జనంసాక్షి):** నూతన సంవత్సర వేడుకలకు భాగ్యనగరం సిద్ధమవుతున్న నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు కీలక విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకల అనంతరం ప్రజలు ఇంటికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పలు సూచనలు చేశారు. ముఖ్యంగా క్యాబ్, ఆటో, బైక్ సేవల విషయంలో ప్రయాణికులు ఏమైన సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గజరావ్ భూపాల్ విజ్ఞప్తి చేశారు.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబరు 31వ తేదీ రాత్రి నగరంలో రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాబ్‌లు రాకపోవడం, ఆటో లేదా బైక్ డ్రైవర్లు చెప్పిన ప్రాంతానికి రావడానికి నిరాకరించడం, లేదా సాధారణం కంటే అధికంగా డబ్బు డిమాండ్ చేయడం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని జాయింట్ సీపీ వ్యాఖ్యానించారు. టువంటి పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. ఆటో, క్యాబ్, బైక్ డ్రైవర్లు అధిక చార్జీలు అడిగినా, లేదా బుక్ చేసిన క్యాబ్ రావడంలో నిర్లక్ష్యం చూపినా వెంటనే ఈ 94906 17346 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని గజరావ్ భూపాల్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకల అనంతరం రాత్రి వేళ ఒంటరిగా ప్రయాణించే వారు, మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని కోరారు. న్యూ ఇయర్ సందర్భంగా నగరమంతా ట్రాఫిక్ పోలీసులు, పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. రోడ్లపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సురక్షిత ప్రయాణానికి అన్ని చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. నూతన సంవత్సరం ఆనందంగా జరుపుకోవాలని, కానీ భద్రత విషయంలో రాజీపడవద్దని సూచించారు. వేడుకల అనంతరం మద్యం సేవించి వాహనం నడపకుండా క్యాబ్ లేదా ఇతర రవాణా సేవలను వినియోగించాలని కోరారు. అదే సమయంలో, రవాణా సేవల పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల నిర్ణయంతో ప్రయాణికులకు భరోసా కలిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమస్య ఎదురైనప్పుడు నేరుగా పోలీసులను సంప్రదించవచ్చనే అవగాహన ప్రజల్లో పెరిగితే అక్రమ వసూళ్లకు పాల్పడే క్యాబ్ నిర్వాహకులకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో ప్రజలు సురక్షితంగా ఇంటికి చేరేందుకు సైబరాబాద్ పోలీసులు తీసుకున్న ఈ చర్యలు అభినందనీయమని భాగ్యనగరవాసులు అంటున్నారు.

# స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఉప్పల కుటుంబం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వైకుంఠ ఏకాదశి పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని భువనగిరిలోని ప్రసిద్ధ స్వర్ణ గిరి దేవాలయాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుఖసమృద్ధులు కలగాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి వైకుంఠ ఏకాదశి విశిష్టతను వివరించారు. శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి హిందువులకు అత్యంత పవిత్రమైన పర్వదినమని, ఈ రోజున స్వామివారి దర్శనం చేయడం వల్ల ఆధ్యాత్మిక శాంతి కలుగుతుందని తెలిపారు. సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేద పండితుల ఆశీర్వాదం అందించిన మానేపల్లీ గోపి, మానే పల్లి మురళికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న, కుమారుడు ఉప్పల సాయి కిరణ్ చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ అలాగే ఉప్పల శ్రీనివాస్ గుప్త బావ బచ్చ సతీష్ , సోదరీమణి ఉదయ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దాలి

- దేశానికి దిక్సూచిగా మార్చాలి
- పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు




**హైదరాబాద్, డిసెంబరు 30 (జనంసాక్షి) :** తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశానికే దిక్సూచిగా తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వినూత్న మార్పులు అవసరమని పేర్కొన్నారు. మంగళవారం తారామతి బరాదరిలో 'టూరిజం అండ్ ఇట్స్ విజన్ 2026' మేధోమథన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీటీడీసీ రూపొందించిన టేబుల్ క్యాలెండర్ 2026ను ఆవిష్కరించారు. అనంతరం టూరిజం అండ్ ఇట్స్ విజన్ 2026 వర్క్‌షాప్‌లో అధికారుల కు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడారు మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ప్రకృతి, వారసత్వ సంపదే తెలంగాణ బలమని చెప్పుకొచ్చారు. కొత్త అద్భుతాలు కాదని.. ఉన్న వనరులకు మెరుగులు పరిస్తే చాలని తెలిపారు. దేశీ, విదేశీ పర్యాటకులు తెలంగాణ వైపు చూసేలా తాము ప్రణాళికలు రచిస్తున్నామని వివరించారు. గ్రామీణ అద్భుతాలను నగరవాసులకు చేరవేయాలని సూచించారు. పర్యాటక రంగంలో నూతన ఒరవడి రావాలని కోరారు. పర్యాటక అద్భుతాలను ప్రపంచానికి చూపాలని అన్నారు. తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదామని తెలిపారు. వినూత్న ఆవిష్కరణలతో పర్యాటకులను ఆకర్షించాలని చెప్పుకొచ్చారు. వసతులు, హాస్పిటాలిటీలో రాజీ పడొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే

- సీఐటీయూ నాయకులు డిమాండ్

**హనుమకొండ, డిసెంబర్30 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ ఎదుట కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు కేయూ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ యూనివర్సిటీస్ ఉపాధ్యక్షుడు పుల్లా శ్రీనివాస్, యూనివర్సిటీస్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి మాట్లాడుతూ.. విద్యుత్ సవరణ చట్టం 2025ను, విత్తన సవరణ చట్టం, విబిజీ రాంజీ స్కీమును రద్దు చేయాలని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

# దుర్గం చెరువులో ఆక్రమణలు

- మట్టితో పూడ్చి పార్కింగ్ దందా
- రంగంలోకి దిగి ఆక్రమణలు తొలగించిన హైడ్రా

**హైదరాబాద్, డిసెంబరు 30 (జనంసాక్షి) :** నగరంలోని దుర్గం చెరువు ఆక్రమణలకు హైడ్రా అధికారులు చెక్ పెట్టారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దుర్గం చెరువులో దాదాపు 5 ఎకరాల మేర ఉన్న ఆక్రమణలను హైడ్రా సిబ్బంది మంగళవారం తొలగించారు. చెరువులో మట్టితో నింపి వాహనాల పెయిడ్ పార్కింగ్ కోసం వినియోగించి ప్రతి నెలా రూ.50 లక్షల వరకూ అద్దెలు వసూలు చేస్తున్న దందాకు తెరదించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని ఆక్రమణలను తొలగించారు. అక్కడి వాహనాలను ఖాళీ చేయించి ప్రస్తుతానికి ఫెన్సింగ్ వేశారు. తర్వాత మట్టిని తొలగిస్తామని అధికారులు తెలిపారు. కబ్జాల పర్వంపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. ఐటీ కారిడార్‌లో ఒకప్పుడు 160 ఎకరాల మేర ఉన్న ఈ చెరువు ప్రస్తుతం 116 ఎకరాలుగా మిగిలిపోయింది. చెరువుకు ఉత్తర దిశ మినహా.. మూడువైపులా ఆక్రమణలకు గురైంది. కబ్జాల పర్వం ఎలా సాగిందో ఎన్ఆర్ఎస్‌సీ అందించిన శాటిలైట్ చిత్రాలు కళ్లకు కడుతున్నాయి.

# సింగరేణి బకాయిలపై శ్వేతపత్రం విడుదల

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్



**గోదావరిఖని, డిసెంబర్30 (జనంసాక్షి) :** సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు ఇప్పటివరకు ట్రాన్స్‌కో, జెన్‌కోల నుంచి బొగ్గు అమ్మకాల ద్వారా బకాయిలు రూ. 47 వేల కోట్లకు చేరుకున్నాయని వీటిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే 24 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని విమర్శించారు. పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడంతో సింగరేణి సంస్థ కార్మికులకు జీతాలు చెల్లించడానికి ఓవర్ డ్రాఫ్ట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీనికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో సింగరేణి సంస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని..ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తీవ్రమైన రాజకీయ జోక్యంతో తమ ఇష్టం వచ్చిన రీతిలో సింగరేణి సొమ్మును వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోతున్న.. ఆ విషయంలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్టీయూసీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సింగరేణి నిధుల దుర్వినియోగంపై సంస్థకు రావాల్సిన బకాయిలపై సింగరేణి సంస్థ ద్వారా పూర్తి వివరాలతో కూడిన శ్వేత పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు గడిచిన రెండు సంవత్సరాల కాలంలో కార్మికులకు సంబంధించిన ఎలాంటి సమస్యలు పరిష్కారం చేయలేదని సింగరేణి సంస్థ నిర్వీర్యం అవుతున్న పట్టించుకోవడంలేదన్నారు. ఇవి చాలదన్నట్లు టీబీజీకేఎస్ పై నోరు పారేసుకుంటూ విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, నాయకులు నూనె కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రేలుడు పదార్థాల కేసులో నిందితుల అరెస్ట్

- రిమాండ్ కు తరలింపు

**శాయంపేట, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** శాయంపేట ఎస్సై పరమేశ్వర్ తన సిబ్బందితో డిసెంబర్ 29 న పెట్రోలింగ్ చేస్తుండగా పత్తిపాక గ్రామంలో గల చిన్న బ్రిడ్జి వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానస్పందంగా ఉండగా వెంటనే వారిని విచారించగ వారి వద్ద ప్రేలుడు పదార్ధాలు ఉన్నవని తెలుపగా ,వెంటనే పంచుల సమక్షంలో వాటిని అదుపులోకి తీసుకొని వారిని విచారించగ బొంత శ్రీను యాదాద్రి జిల్లా కు చెందిన వ్యక్తి తన బంధువులు అయిన ఇరుగదిండ్ల శివశంకర్ ,బొంత అజయ్ తో కలిసి ఆత్మకూర్ గ్రామస్తుడు అయిన తంగేళ్ల బ్రహ్మం వద్ద ప్రేలుడు పదార్దాలు తక్కువ ధరకి కొని ఎక్కువ ధరకి అమ్ముకునే వాడు, అదే విదంగా 11000/- రుపాయలకి ప్రేలుడు పదార్దాలు బ్రహ్మం దగ్గర కొని వసంతాపూర్ గ్రామస్థులు అయిన చల్ల రాజిరెడ్డి కు ఇవ్వడానికి వెళ్తుండగా పోలీసులు పట్టుకొని అదుపులోకి తీసుకొని డిసెంబర్ 30నపరకాల జడ్జ్ ముందు రిమాండ్ కొరకు హాజరు పరచగా 14 రోజుల జ్యూడిషల్ రిమాండ్ విధించడం జరిగినది అని ఎస్సై పరమేశ్వర్ తెలిపారు.

# విద్యార్థిని కొట్టిన వార్డెన్ సస్పెన్షన్

- వేటు వేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థిని కొట్టిన ఘటనపై వార్డెన్ ను సస్పెండ్ చేసి, పోలీస్ కేసు కూడా నమోదు చేయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్సి హాస్టల్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖీ అయ్యి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిగ్రీ చదువుతున్న హాస్టల్ విద్యార్థినీని కొట్టడం చాలా బాధాకరమని, తక్షణమే ఎస్సి అభివృద్ధి అధికారి ద్వారా విచారణ నిర్వహించి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వార్డెన్ పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హాస్టల్‌లో జరిగిన ఈ ఘటనపై ప్రాథమిక విచారణ అనంతరం, విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకు వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు బాధ్యురాలిపై శాఖాపరమైన చర్యలే కాకుండా, క్రిమినల్ కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంక్షేమ అధికారిని ఈ ఘటనపై ప్రత్యేక విచారణాధికారిగా నియమించామని, ఇప్పటికే హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించామన్నారు. బాధిత విద్యార్థినికి, హాస్టల్‌లోని ఇతర విద్యార్థినులకు తగిన కౌన్సెలింగ్ ఇచ్చి, వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. హాస్టల్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. విద్యార్థుల భద్రత ప్రధమ ప్రాధాన్యతని, చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్ట పరంగా కఠినంగా శిక్షించబడతారని ఆయన స్పష్టం చేశారు. హాస్టల్ లో ప్రవేశించిన వ్యక్తి ఎవరు అనేది విచారణ జరుగుతున్నదని, విచారణ నివేదిక రాగానే సంబంధిత వ్యక్తిపై పోలీస్ కేసు నమోదుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎస్సీ అభివృద్ధి అధికారి ఇందిర, సంక్షేమ అధికారి మల్లేశ్వరి, డీఈఓ రాజేందర్, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# అర్చక ఉద్యోగుల సమస్యలపై చట్టసవరణ అవసరం

- తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ..



**భీమదేవరపల్లి డిసెంబర్ 30(జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం అర్చక ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. దేవాలయ ఉప ప్రధాన అర్చకుడు కంచనపల్లి రాజయ్య శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ.. దూప-దీప-నైవేద్య అర్చకుల కోసం చట్ట సవరణ చేసి, వారిని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖకు రక్షణ కవచంగా మారిన 30/87,2007 చట్టాలు,అలాగే 888 జీఓలను సవరించాల్సిన అవసరం ఉంద న్నారు. 6ఏ, 6బి, 6సి కేటగిరీల దేవాలయాల్లో పని చేస్తున్న అర్చక ఉద్యోగులు ఔట్‌సోర్స్ సిబ్బంది నాలుగో తరగతి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మూడు కేటగిరీల దేవాలయాల్లో పనిచేస్తూ ఇప్పటికీ రెగ్యులర్ కాని అర్చక ఉద్యోగులు సుమారు 8 వేల మంది ఉన్నారని తెలిపారు.వారి హక్కుల కోసం ఈ పోరాటం కొనసాగుతుందన్నారు. 121 జీఓ రద్దు కారణంగా దేవాలయాల్లో ఐదేళ్ల సేవ పూర్తి చేసిన తాత్కాలిక అర్చక ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ చట్ట సవరణ కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చొరవ తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కాలయాపన చేయకుండా దేవాదాయ శాఖ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.దీని వల్ల రాష్ట్రంలోని 16 వేల దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చక ఉద్యోగులు దూప-దీప-నైవేద్య అర్చకులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 2న మడికొండలో నిర్వహించనున్న వరంగల్ ఉమ్మడి జిల్లా అర్చక ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ మాట్లాడుతూ. తెలంగాణ దేవాదాయ శాఖలో నూతన చట్ట సవరణ ద్వారా అధికారులకు ఒక విధమైన వేతన విధానం, అర్చక ఉద్యోగులకు మరో విధమైన వేతన విధానం అమలులో ఉందని,ఈ అసమానతలను తొలగించి ఒకే శాఖ ఒకే వేతన విధానం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ముఖ్య అర్చకులు మొగిలి పాలెం రాంబాబు, గుడ్ల శ్రీకాంత శర్మ, అర్చకులు తాటికొండ వినయ్ శర్మ, నందనం సందీప్ శర్మ, తాటికొండ రమేష్ శర్మ, జానకీపురం రవి శర్మ, శరత్ చంద్ర, శివకుమార్, శ్రావణ్ కుమార్, సిబ్బంది రవి, శ్రీధర్, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్సీ విఠల్



**కౌటాల డిసెంబర్ 30 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం పడుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు.కౌటాల మండలం సాండ్ గాం సర్పంచ్ దడ్డి సత్తయ్య మంగళవారం రోజున ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అవుతుందని ఆయన అన్నారు.సాండ్గాం గ్రామ అభివృద్ధికి 50 లక్షల నిధులు మంజూరు చేస్తామని. గ్రామాలు అభివృద్ధి ప్రజా ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు ఈ అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇందిరా, జానకి రాం, గంగారాం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమగ్రతకు చిరునామాగా తెలుగు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**Where the world has not been broken up into small fragments by narrow domestic walls... Rabindranath Tagore**

గోడలు మనుషులను వేరుచేస్తున్న నేటి కాలంలో, అక్షరం నేర్పిన సంస్కారంతో ఆ గోడలను బద్ధలు కొట్టారు హుగ్లీ తెలుగు విద్యార్థులు. బెంగాల్ గడ్డపై తెలుగు భాషా పరిమళాలను వెదజల్లుతూ, జాతీయ సమగ్రతకు కొత్త భాష్యాన్ని చెబుతూ, హుగ్లీలోని తెలుగు మీడియం హైస్కూల్ పూర్వ విద్యార్థులు నిర్వహించిన 'సంస్మృతి' మెగా అల్యూమ్నీ మీట్ ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. నూతన సంవత్సర వేళ, మహేష్ తెలుగు స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎంటీఎస్ఏ) ఆధ్వర్యంలో డిసెంబర్ 27, 28 తేదీలలో జరిగిన ఈ వేడుక కేవలం పాత మిత్రుల కలయిక మాత్రమే కాదు, అది తెలుగు వాడి ఆత్మగౌరవ ప్రతీక. జాతీయ సమగ్రతకు ఒక పాఠం. మతాలు ఎన్ని ఉన్నా, జాతులు ఎన్ని ఉన్నా, రాష్ట్రాలు ఎన్ని ఉన్నా మన ఐడెంటిటీ భారతీయత మాత్రమే. ఇంకేమీ కాదు. మనం ఒక్కటే. అందరం ఒక్కటే అనే సందేశం నూతన సంవత్సరానికి ముందు దేశానికి విడిచి పెడుతూ చిన్నవారు పెద్దవారికి పాఠాలు నేర్పే ఒక అద్భుతమైన నాట్య ప్రదర్శనతో ముగించిన పూర్వ విద్యార్థుల మేళవింపు ఇది. మేలు కలయిక ఇది. అభివృద్ధికి నాంది ఇది. డిజిటల్ గ్యాడ్జెట్ ల మధ్య ఇరుక్కుపోయిన ఒక తరానికి విశాల విశ్వాన్ని పరిచయం చేసి, అందులోని అద్వితీయమైన ఆనందాన్ని విప్పి చూపిన కదలిక ఇది.

తొలిరోజు: నెహ్రూ నగర్ మైదానంలో జ్ఞాపకాలు

మొదటి రోజు నెహ్రూ నగర్ క్రీడా మైదానం ఒక ఉద్వేగభరితమైన వేదికగా మారింది. కాలం వెనక్కి వెళ్లిందా అన్నట్టు అనిపించింది. ఆటల అనంతరం సాగిన ర్యాలీ పట్టణ వీధుల్లో హోరెత్తింది. తమ చిన్ననాటి కలలకు ఊపిరిపోసిన పాఠశాల ప్రాంగణం, ఆ తరగతి గదులు, పుస్తకాల సువాసనలు నిండిన లైబ్రరీలను చూసి పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. పాటలు పాడారు. ఉపన్యాసాలు నడిచాయి. నవ్వులు పువ్వులతో కాలం గడిచింది. విద్యాలయం కొత్త వైభవాన్ని అందుకుంది. గత కొన్ని సంవత్సరాలుగా తగ్గిన విద్యార్థులతో కలకలం తగ్గిన విద్యాలయ వాతావరణంలో ఒక్కసారిగా వసంతం చిరునవ్వులు చిందించిది.

**రెండో రోజు: మహేష్ కాలనీలో సాంస్కృతిక అక్షరయజ్ఞం**

మహేష్ కాలనీ గ్రౌండ్ వేదికగా రెండో రోజు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఒక మహా యజ్ఞంలా సాగాయి. ఉదయం 11 నుండి అర్ధరాత్రి వరకు సాగిన ఈ సాంస్కృతిక కార్యక్రమం, క్రమశిక్షణతో కూడిన నిర్వహణ స్థానిక బెంగాలీ ప్రజలను సైతం ఆశ్చర్యపరిచాయి. 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లోని తెలుగు చరిత్రలో ఇదొక



మైలురాయి.

ప్రస్తుతం హైదరాబాదులో ఉంటూ,?కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన పూర్వ విద్యార్థి ఉట్ల రమేష్ తన కవితా హృదయంతో కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగించారు. సంప్రదాయానికి ప్రతీకగా విశ్రాంత మరియు ప్రస్తుత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఎంటీఎస్ఏ అధ్యక్షులు ఆనిమి జనార్దన రావు, కార్యదర్శి తూతికి సుధీర్ మాట్లాడుతూ, సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. హెడ్ మాస్టర్ ఎం.వి.కె. మోహన్ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అత్యవసరమని గుర్తుచేశారు. హుగ్లీ జిల్లాలో తెలుగు ఉన్నత పాఠశాల ఒక్కటే అనీ, దీన్ని నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు.

అనంతరం, పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు, రచయిత , 'జాగృతి సమీక్ష' సంపాదకులు ఎం. కేశవరావు తనదైన హాస్య చలోక్తులతో సభను నవ్వుల్లో ముంచెత్తుతూనే, ఒక గంభీరమైన ఆలోచనను రేకెత్తించారు. మా టీచర్లకు హోం టాస్క్ ఇవ్వడం గొప్ప సరదా అని చలోక్తులు విసురుతూ పూర్వ విద్యార్థులందరికీ ఆయన "2026 హోమ్ టాస్క్" ఇచ్చారు. " ఆర్థికంగా సర్దుకున్న పూర్వ విద్యార్థులు చందాలు ఇస్తూ, ఉపాధ్యాయుల కొరతతో ఉన్న మన పాఠశాల కోసం శాశ్వత నియామకాలు జరిగే వరకు, ఆన్‌లైన్ ద్వారా విద్యాబోధన చేస్తూ మన బిడ్డల భవిష్యత్తును తీర్చిదిద్దాలి" అని ఆయన పిలుపునిచ్చారు. రచయిత, సామాజిక కార్యకర్త గౌరవ్ స్వాతంత్ర్య సమరయోధుడు దరిశి చెంచయ్య మీద అనేక రచనలను సంకలనం చేసిన పుస్తకం కూడా సినీ విశ్లేషకులు బాలాజీ గారి ప్రయత్నంతో బ్యాక్ వర్డ్ కమిషన్ వైస్ చైర్మన్ ఇద్దుము వీర్రాజు గారి చేతుల మీదుగా ఆవిష్కరణ జరగడం కార్యక్రమానికి సాహితీ సుగంధం అందించింది. ఇందులో ఇదే ప్రాంతాల్లో నివసిస్తూ సాహితీ పరంగా అభివృద్ధి చెందిన రచయితలు, సినీ విశ్లేషకులు, ఆర్థిక సామాజిక విశ్లేషకులు బాలాజీ, కేశవ్ లు వేదికను అలంకరించడం పూర్వ విద్యార్థులకు ప్రోత్సాహం కలిగించింది.

ముగింపు వేళ, సంస్మృతి కేవలం ఒక వేడుకగా మిగిలిపోలేదు. అది ఒక సామాజిక బాధ్యతగా, తెలుగు సంస్కృతిని బెంగాల్ గడ్డపై సుస్థిరం చేసిన ఒక చారిత్రాత్మక విజయంగా నిలిచిపోయింది. వందల కొలది పూర్వ విద్యార్థుల లోకాన్ని ఆనంద భాష్పాలతో ముంచెత్తింది. అలానే జనం సాక్షి సృష్టించిన కాలమిస్ట్, కేశవ్ అందించిన 2026 హోమ్ టాస్క్ కోసం కూడా మెల్లమెల్లగా సన్నద్ధం అవుతున్నారు. ఈ హోమ్ టాస్క్ లో భాగంగానే పశ్చిమ బెంగాల్ బ్యాక్వర్డ్ కమిషన్ వైస్ చైర్మన్, విశ్రాంత అధ్యాపకులు, వీర్రాజు గారు విద్యాలయానికి తమ ఆఫీసు నుండి ఇంతకుముందు అందిన దరఖాస్తుకు స్పందనగా దాదాపు 7 లక్షల రూపాయలు విద్యాలయం అభివృద్ధి కోసం అందించబోతున్నామని వేదిక మీద కేశవ్ ద్వారా ప్రకటించారు. ఇది మరో విజయం. 24 పర్గణాలు జిల్లాలోని జ్యోతిర్మయ యువజన విద్యా కేంద్రం మరో తెలుగు మీడియం హై స్కూల్ కు కూడా ఐదు లక్షలు తమ ఆఫీసు నుండి అందించబోతున్నామని హర్షధ్వానాల మధ్య కేశవ్ ద్వారా ప్రకటించారు. శ్రీరాంపూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్ కుమారి తియాస ముఖర్జీ గారు కూడా విద్యాలయం రిపేరింగ్ ల కోసం సుమారు మూడు లక్షల రూపాయలు ఎమ్మెల్యే గ్రాంట్ ద్వారా తెలుగు వారి మీద ప్రేమతో, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తో తనకున్న మంచి అనుబంధాన్ని తెలుగువారి వైపు పయనింపజేసి ఈ మధ్యనే అందించారని కేశవ్ తెలియజేశారు. పూజలకు అతీతంగా, మతాలకు అతీతంగా,తెలుగువారి ఐక్యతకు ప్రేరణగా తెలుగు భాషలందరినీ ఒక దగ్గరకు చేర్చి నిర్వహించే ఈ రకమైన కార్యక్రమాలు భారతదేశం యొక్క సెక్యులర్ సందేశాలను మరింత పరిపుష్టం చేస్తాయి. దేశం ముందుకు నడిచేలా ఒక మంచి యువతరాన్ని దేశానికి అందిస్తాయి. విద్యాలయం కూడా ఇలాంటి విలువలు ఉన్న ఒక తరాన్ని సృష్టించడం విద్యాలయ పూర్వ అధ్యాపకులకు, ప్రస్తుత అధ్యాపకులకు కూడా ఈ సంవత్సరం చివర అందిన ఒక మంచి జీవితకాలం హృదయంలో పదిల పరుచుకోదగ్గ ప్రోగ్రెస్ రిపోర్ట్ అని చెప్పవచ్చు.



**కేశవ్**
kesavkesav11@gmail.com
హుగ్లీ, పశ్చిమ బెంగాల్
**9831314213**

---

### ఉన్నావ్ అత్యాచారం, ఆరావళి పర్యావరణ పరిరక్షణ కేసుల్లో..

# ప్రజాభిప్రాయ ఒత్తిడికి తలొగ్గిన సుప్రీం స్టే ఆర్డర్లు



భారతీయ న్యాయవ్యవస్థ ఎప్పుడూ ప్రజాభిప్రాయానికి అతీతమని చెప్పుకుంటుంది. కానీ ఇటీవలి రెండు కీలక తీర్పులు..." ఉన్నావ్ అత్యాచార కేసు" మరియు "ఆరావళి పర్వత శ్రేణి తవ్వకాలు" ఈ మాటలను ప్రశ్నిస్తున్నాయి. సుప్రీంకోర్టు తన స్వంత తీర్పులను సమీక్షించి, స్టే ఇవ్వడం వెనుక ప్రజా ఒత్తిడి కనిపిస్తోంది. ఇది న్యాయవ్యవస్థ స్వతంత్రతకు సవాలా? లేదా ప్రజాస్వామ్యంలో అవసరమైన సమతుల్యతా? ఈ వ్యాసం ఈ అంశాలను విశ్లేషిస్తూ, విమర్శిస్తుంది.

మొదట ఉన్నావ్ అత్యాచార కేసును చూద్దాం. 2017లో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో జరిగిన ఈ ఘటనలో, అప్పటి బీజేపీ ఎమ్మెల్యే కులదీప్ సింగ్ సెంగార్ ప్రధాన నిందితుడు. బాధితురాలు మైనర్ అమ్మాయి, మరియు ఈ కేసు దేశవ్యాప్తంగా ఆందోళనలు రేపింది. 2019లో ఢిల్లీ కోర్టు సెంగార్‌కు జీవిత ఖైదు విధించింది. కానీ 2024 డిసెంబర్ 23న ఢిల్లీ హైకోర్టు ఆయన శిక్షను సస్పెండ్ చేసి, బెయిల్ మంజూరు చేసింది. ఇది ఎమ్మెల్యే 'పబ్లిక్ సర్వెంట్' కాదా అనే ప్రశ్నపై ఆధారపడింది, పోక్సో చట్టం కింద 'అగ్రవేటెడ్' అత్యాచారం కాదని నిర్ధారించింది. ఈ తీర్పు తర్వాత దేశవ్యాప్తంగా ఆందోళనలు మొదలయ్యాయి. మీడియా, సామాజిక మాధ్యమాలు, మహిళా సంఘాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించాయి. 'పీపుల్స్ పవర్' అని పిలిచే ఈ ఒత్తిడి వల్లే సుప్రీంకోర్టు డిసెంబర్ 29, 2025న ఢిల్లీ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. సెంగార్ జైలులోనే ఉండాలని ఆదేశించింది, పోక్సో చట్టం కింద 'పబ్లిక్ సర్వెంట్' నిర్వచనాన్ని ప్రశ్నించింది. ఇది బాధితురాలి న్యాయానికి తాత్కాలిక ఊరటనిచ్చినా, విశ్లేషిస్తే ఇక్కడ ప్రజాభిప్రాయం న్యాయప్రక్రియను ప్రభావితం చేసినట్టు కనిపిస్తుంది. ఢిల్లీ హైకోర్టు తీర్పు తర్వాత మాత్రమే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది, ఇది న్యాయవ్యవస్థ యొక్క స్వతంత్రతపై ప్రశ్నలు లేవనెత్తుతుంది. విమర్శకులు ఇలాంటి కేసుల్లో రాజకీయ(బీజేపీ రాజకీయ ప్రభావం నేపథ్యంలో), శక్తివంతుల రక్షణను చూస్తున్నారు. సెంగార్ బీజేపీ నేత కావడం వల్ల ఈ కేసు మరింత సంక్లిష్టమైంది. ప్రజాఒత్తిడి లేకుండా ఇలాంటి సమీక్ష జరిగేదా? ఇది న్యాయవ్యవస్థ బలహీనతను సూచిస్తుంది.

**ఇక ఆరావళి పర్వత శ్రేణి తవ్వకాల విషయం**

ఆరావళి శ్రేణి రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, గుజరాత్‌లలో విస్తరించి ఉంది. ఇది పర్యావరణ పరిరక్షణకు కీలకం. దశాబ్దాలుగా మైనింగ్ ఆపాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. నవంబర్ 20, 2025న సుప్రీంకోర్టు ఒక నిపుణుల కమిటీ సిఫార్సులను అంగీకరించి, ఆరావళి నిర్వచనాన్ని మార్చింది. ఇది భౌగోళిక లక్షణాల ఆధారంగా ఉండాలని, కొన్ని ప్రాంతాలను మినహాయించాలని చెప్పింది. దీంతో మైనింగ్ కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది గాలి కాలుష్యం, నీటి వనరులు, జీవవైవిధ్యాన్ని ప్రభావితం చేస్తుందని వారు హెచ్చరించారు. ఈ తీర్పు తర్వాత పర్యావరణ సంఘాలు, రాజకీయ పార్టీలు, స్థానికులు తీవ్ర ఆందోళనలు చేశారు. రాజకీయాలకు అతీతంగా ఈ విషయంలో ఒత్తిడి పెరిగింది. మీడియా పెద్ద ఎత్తున ప్రజల సంక్షేమం,పర్యావరణ పరిరక్షణ కోసం గగ్గోలు పెట్టింది. ఫలితంగా, డిసెంబర్ 29, 2025న సుప్రీంకోర్టు తన నవంబర్ 20 తీర్పు పై స్టే విధించింది. కొత్త నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, మళ్లీ సమీక్షించాలని ఆదేశించింది. మైనింగ్ కార్యకలాపాలు నిలిపివేయాలని చెప్పింది.

ఇది పర్యావరణ పరిరక్షణకు విజయమని అనేకమంది స్వాగతించారు. కానీ, ఇక్కడ విశ్లేషణాత్మకంగా చూస్తే, ఇక్కడ కూడా ప్రజాఒత్తిడి కీలక పాత్ర పోషించింది. సుప్రీంకోర్టు తన స్వంత తీర్పును సమీక్షించడం అరుదు. కానీ ఆందోళనలు, ప్రదర్శనలు దీనిని సాధ్యం చేశాయి. విమర్శకంగా చూస్తే, ఇది న్యాయవ్యవస్థ యొక్క అస్థిరతను సూచిస్తుంది. మైనింగ్ లాబీల (బీజేపీ ప్రభావం) వల్ల మొదటి తీర్పు వచ్చిందా? పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ఆర్థిక ప్రయోజనాలు ప్రభావితం చేస్తున్నాయా? రెండు కేసుల్లోనూ ప్రజాభిప్రాయ ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తుంది. ఉన్నావ్ కేసులో మహిళల హక్కులు, లైంగిక హింసపై ఆందోళనలుబీ ఆరావళి విషయంలో పర్యావరణ సమస్యలు. సామాజిక మాధ్యమాలు, మీడియా ఈ ఒత్తిడిని పెంచాయి. ఇది ప్రజాస్వామ్యంలో సానుకూలమా? అవును, ఎందుకంటే న్యాయవ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. కానీ విమర్శనాత్మకంగా, ఇది న్యాయప్రక్రియను రాజకీయాకరిస్తుంది. శక్తివంతులు, మీడియా ప్రభావం లేని సాధారణ కేసుల్లో ఇలాంటి సమీక్షలు జరగవు. ఇది అసమానతలను పెంచుతుంది. మరోవైపు, ఈ ఘటనలు న్యాయవ్యవస్థలో సంస్కరణల అవసరతను చూపుతున్నాయి. పోక్సో చట్టం నిర్వచనాలు స్పష్టంగా ఉండాలి, పర్యావరణ చట్టాలు దృఢంగా అమలు కావాలి. చివరిగా, ఈ రెండు తీర్పులు ప్రజాశక్తి యొక్క బలాన్ని చూపుతున్నాయి. కానీ న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవాలి. ప్రజాఒత్తిడి సానుకూల మార్పులకు ఉపయోగపడాలి, కానీ అది న్యాయప్రక్రియను బలహీనపరచ కూడదు. భవిష్యత్తులో ఇలాంటి కేసులు న్యాయవ్యవస్థకు పాఠాలు నేర్పుతాయి.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

---

# పంచాయతీ ఎన్నికల్లో బహుజనుల నిశబ్ద విప్లవం

ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు కేంద్ర బిందువు గ్రామపంచాయతీ ఎన్నికలు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు తమ కేటాయించిన రిజర్వేషన్ శాతం కంటే అధికంగా ఎన్నిక కావడం అందరిని ఆశ్చర్యపరిచింది. రిజర్వ్ కాని సీట్లలో కూడా గెలవడం గ్రామ స్థాయి రాజకీయాల్లో చైతన్యం, స్వాభిమానానికి సూచిక. రాష్ట్ర రాజకీయ చరిత్రలో సామాజిక మార్పుకు సంకేతంగా, బహుజన వాదానికి ప్రతీకగా చెప్పవచ్చు. భారతదేశ సగటు కన్నా తెలంగాణలో అత్యధిక శాతం బీసీ జనాభా ఉంది, వారి రాజకీయ ప్రాతినిధ్యం దశాబ్దాలుగా అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం బీసీల కోసం'డెడికేటెడ్ కమిషన్' నియమించారు. సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ సర్వే జరిపింది. అనంతరం బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్ విద్య ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ఇవ్వడానికి బిల్లు ఆమోదించి రాష్ట్రపతికి పంపారు. దీనికి ఆమోదం లభించకపోవడంతో తక్షణం స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్స్ అమలుచేయడానికి జీవో 9 ను జారీచేసింది. దీన్ని ఆధిపత్య కులాలు హైకోర్టులో సవాలు చేయడంతో బ్రేక్ పడింది. దీనికి ప్రధాన కారణం అగ్రకుల కుల రాజకీయ పార్టీల చట్టబద్ధం చేయకపోవడమే. బీసీల్లో ఉద్యమానికి దారితీసాయి. ఆ ఉద్యమ ప్రభావంతో ఎన్నడులేని లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో బీసీ, దళిత వర్గాల మధ్య ఒక కొత్త రాజకీయ చైతన్యం పెరిగి, పల్లె పోరులో అగ్రకులాలకు అభిముఖంగా స్థానిక రాజకీయ పోరు జరిగింది. బహుజనుల సామాజిక చైతన్యం ఒక నిశబ్ద రాజకీయ విప్లవానికి పునాది వేసింది.

**చరిత్రలో బహుజనుల అరుదైన గెలుపు**

పంచాయతీ రిజర్వేషన్లు మొత్తం 50 శాతం వరకే పరిమితం చేయాలనే సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లను కొత్తగా కేటాయిస్తూ జీఓ 46 జారీ చేసింది. ఇందులో కూడా గతంలో కన్నా ప్రత్యేకించి సర్పంచ్ కోటాను 17 శాతానికి తగ్గించడంపై బీసీ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఒక వైపు చట్టపరమైన 50 శాతం పరిమితి విధింపు, మరో వైపు గతంలో కన్నా బీసీల రిజర్వేషన్ శాతం తగ్గించినప్పటికీ...జనరల్ స్థానాల్లో బీసీ ఎస్సీ ఎస్టీలు పోటీచేసి తమ రిజర్వేషన్లకు అతీతంగా విజయకేతనం ఎగరవేశారు. గణాంకాల పరంగా పరిశీలించినట్లయితే రాష్ట్రంలో ఈ సర్పంచి ఎన్నికల్లో 86.4 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారే విజయం సాధించారు. 13.6 శాతం మంది మాత్రమే జనరల్ అభ్యర్థులు గెలిచారని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. విజేతలైన 12,702 మందికిగానూ 36.9 శాతం మంది బీసీలు కాగా, ఎస్టీలు 29.3 శాతం, ఎస్సీలు 18.2 శాతం మంది కాగా 13.6 శాతం మంది జనరల్? కేటగిరీ నుంచి ఎన్నికయ్యారనీ ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. తమకు రిజర్వ్? అయిన వాటి కంటే అధికంగా 166 స్థానాల్లో మహిళలు గెలిచినట్లు, యువత అత్యధిక స్థానాల్లో గెలిచారనీ రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ ఎన్నికల్లో ముఖ్యంగా జనరల్ స్థానంలో బీసీలు 50 శాతంపైగా గెలవడం బీసీ వర్గాలల్లో స్పష్టమైన మార్పుకు నిదర్శనం. ఈ ఎన్నికల్లో వచ్చిన ప్రధాన మార్పులను పరిశీలిస్తే... డబ్బు పెట్టిన అగ్రకుల నాయకులు ఓడిపోయారు. ఇన్నాళ్లు రాజకీయంగా దూరంగా ఉన్న బీసీ, ఎస్సీ కులాలు ఉమ్మడిగా తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రయత్నం చేశారు. జగిత్యాల జిల్లా,బుగ్గారం మండలం, సిరికొండ గ్రామంలో బీసీ కులానికి చెందిన స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన పంచిత ధర్మరాజు అత్యధిక డబ్బులు పంపిణీ చేసిన అగ్రకుల ఓ పార్టీ నాయకునిపై ఒక ఓటు తేడాతో గెలుపొంది చరిత్ర సృష్టించాడు. తెలంగాణ ఓ గ్రామంలో గ్రామ పంచాయతీలో వార్డు మెంబర్లు మరియు సర్పంచ్ మొత్తంగా ఎస్సీలకు గెలుపొంది రికార్డు సృష్టించారు. బీసీ ఎస్సీ ఎస్టీలలో ఇలాంటి అరుదైన గెలుపు తెలంగాణ రాజకీయ సామాజిక ఒక చిత్రాన్ని మార్చింది. వేల కోట్లు డబ్బులు ఖర్చుపెట్టిన అగ్రకుల పార్టీలకు అభిముఖంగా గెలుపొందడం తెలంగాణ చరిత్రలో ఇది మొదటిసారి.

**ఉమ్మడి పోరాటాలతో ముందుకెళ్లాలి**

కుల గణన, బీసీ రిజర్వేషన్స్ కు అంశాలు సామాజిక సమీకరణకు దారితీసాయి. ఈ మార్పుకు ప్రధాన కారణం తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న నికార్సైన బహుజన ఉద్యమాలు కొనసాగడమే. తెలంగాణ రాష్ట్రంలో బహుజన వర్గాలంతా తరతరాలుగా అగ్రకుల పాలకుల దోపిడికి గురయ్యారు. ఈ క్రమంలో 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీ బలగాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలిగించాలి. ఇందుకై వారిని పూలే, అంబేద్కర్, కాన్సిరాం దారిలో నడిపించడానికి డాక్టర్ విశారదన్ మహారాజ్ గారి ఆలోచన నుంచీ మార్చు 31, 2025న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బిసి,ఎస్సీ,ఎస్టీల ఐక్య కార్యాచరణ సమితి(జాక్) ఆవిర్భవించింది. దీనికి బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు టి.చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ పలు హాజరై దిశా నిర్దేశమిచ్చారు. వీరి ఆధ్వర్యంలోనే 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఏర్పడింది. బీసీ రిజర్వేషన్లను పార్లమెంట్ లో చట్టం చేసి, 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేసింది. బావాజాలవ్యాప్తికి రాజ్యాంగబద్ధంగా పలు కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా అక్టోబర్ 24న జరిగింది. ఈ ధర్నా బీసీ ఉద్యమానికి ఆరంభ సంకేతంగా నిలిచింది. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో కామారెడ్డి వేదికగానే చారిత్రకమైన బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. అదే వేదికగా నవంబర్ 15న బీసీల ఆక్రోష సభ జరిగింది. ఈ కార్యక్రమాలలో బీసీ ఎస్సీ ఎస్టీలు ఉమ్మడిగా కలిసిరావడంతో ఆ వర్గాల్లో రాజకీయ చైతన్యం ప్రారంభమైనవి. ఈ సమితి ఆధ్వర్యంలో భాగమైన డాక్టర్ విశారదన్ మహారాజ్ జాక్ వేదికగా లక్ష కిలో మీటర్ల రథయాత్ర అట్టడుగు వర్గాల రాజ్యాంగ హక్కుల కోసం పోరాడుతూనే...రాజ్యాధికారం కోసం ధర్మ యుద్ధం సాగింది. ప్రజా సమస్యలపై సింహ గర్జన చేశాడు. గతంలో డాక్టర్ విశారదన్ మహారాజ్ గారు దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో పదివేల కిలోమీటర్లు బీసీ ఎస్సీ ఎస్టీల స్వరాజ్య పాదయాత్ర చేశారు. ఆయా కులాల వాటానడుగుతూ రాజ్యాధికార స్పృహ రగిలించాడు. నేటి బీసీల రాజకీయ స్పృహకు కారణం కూడా ఇదే. ఒకవైపు జాక్ రథ యాత్ర, మరొకవైపు బీసీ రిజర్వేషన్ల సాధన సమితి పోరాటం నేటి స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజనుల విజయానికి కారణమైనది. ఈ వాస్తవాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు అర్థం చేసుకొని భవిష్యత్తు రాజ్యాధికార పోరాటాలకు కలిసి రావాల్సిన అవసరం ఉంది. అప్పుడే పీడిత వర్గాలకు విముక్తి లభిస్తుంది.



**సంపతి రమేష్ మహారాజ్**
**సామాజిక విశ్లేషకులు**
**7989579428**

---

# ఆధిపత్యం - ప్రత్యాధిపత్యం మధ్య పోరాటమే మానవ చరిత్ర

ఆదిపత్యం- ప్రత్యధిపత్యం మధ్య సాగుతున్న పోరాటమే మానవ సమాజ చరిత్రకు కేంద్రబిందువు. నాగరికత ఆరంభం నుంచి ఆధునిక ప్రజాస్వామ్య దశ వరకు అధికారాన్ని ఎవరు నియంత్రిస్తున్నారు, ఆ అధికారం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తోంది అనే ప్రశ్నల చుట్టూనే రాజకీయ వ్యవస్థలు, రాజ్య నిర్మాణాలు, సామాజిక మార్పులు రూపుదిద్దుకున్నాయి. ఒక వర్గం తన శక్తిని శాశ్వతంగా నిలుపుకోవాలని ప్రయత్నిస్తే, ఆ శక్తికి లోబడి జీవించే వర్గాల నుంచి ప్రతిఘటన తప్పనిసరిగా పుడుతుంది. ఈ నిరంతర సంఘర్షణే ఆదిపత్య భావనకు, ప్రత్యధిపత్య ఆలోచనకు ప్రాణం పోస్తుంది.

ఆదిపత్యం కేవలం బలవంతపు పాలన కాదు. ప్రజల సమ్మతిని తయారుచేసుకునే ఒక సున్నితమైన రాజకీయ ప్రక్రియ అది. చట్టాలు, రాజ్యాంగ వ్యవస్థ, ఎన్నికల విధానం, మీడియా ప్రభావం, విద్యా నిర్మాణం, సాంస్కృతిక ఆచారాలు, మత విశ్వాసాలు వంటి అనేక సాధనాల ద్వారా రాజ్యం తన ఆధిపత్యాన్ని ప్రజల మనస్సుల్లో నాటుతుంది. ప్రజలు ఆ వ్యవస్థను సహజమైనదిగా, ప్రశ్నించలేని నిజంగా అంగీకరించే స్థితి ఏర్పడినప్పుడే రాజకీయ ఆధిపత్యం పూర్తిస్థాయిలో పనిచేస్తుంది. ఈ సందర్భంలో ఆంటోనియో గ్రాంశీ ప్రతిపాదించిన హెజిమనీ సిద్ధాంతం కీలకంగా మారుతుంది. రాజ్యం కేవలం పోలీసు యంత్రాంగం కాదుబీ అది ఆలోచనలను నియంత్రించే శక్తివంతమైన వ్యవస్థ.


భారతదేశంలో 1950 తర్వాత ఏర్పడిన రాజ్యం తనను తాను సంక్షేమ రాజ్యంగా ప్రజలకు పరిచయం చేసింది. విద్య, వైద్యం, ఉపాధి, ఆహార భద్రత వంటి అంశాలు ప్రధాన అజెండాగా నిలిచాయి. 1951 నుంచి 1975 మధ్యకాలంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థిక వ్యవస్థలో సుమారు 70 శాతం వరకు వాటాను కలిగి ఉండేవి. ప్రజా వ్యయం బడ్జెట్‌లో 40 నుంచి 45 శాతం వరకు ఉండేది. ఈ దశలో రాజ్యం పట్ల ప్రజల విశ్వాసం 65 నుంచి 70 శాతం వరకు ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే ఈ సంక్షేమ రూపకల్పన వెనుక అధికార కేంద్రీకరణ మాత్రం కొద్ది రాజకీయ ఎలైట్ వర్గాల చేతుల్లోనే కొనసాగింది.

1970ల చివరినాటికి ఈ నమూనాలో స్పష్టమైన పగుళు కనిపించాయి. పేదరికం తగ్గకపోవడం, నిరుద్యోగం పెరగడం, ప్రాంతీయ అసమానతలు తీవ్రమవడం వల్ల ప్రజా అసంతృప్తి విస్తరించింది. 1977 నాటికి దేశ జనాభాలో సుమారు 55 నుంచి 60 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవించారు. కార్మిక ఉద్యమాలు, రైతు పోరాటాలు, సామాజిక నిరసనలు ప్రత్యధిపత్య స్వరాలుగా రాజ్యం ఆధిపత్యాన్ని బహిరంగంగా ప్రశ్నించాయి.

1991 తర్వాత భారత రాజ్యం తన స్వభావాన్ని మౌలికంగా మార్చుకుంది. నూతన ఉదారవాద విధానాల ప్రవేశంతో ప్రభుత్వ రంగ పాత్ర 70 శాతం నుంచి క్రమంగా 35 శాతానికి పడిపోయింది. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, గ్లోబలైజేషన్ వంటి భావజాలాలు కొత్త రాజకీయ ఆధిపత్యానికి పునాది వేశాయి. 2000 నాటికి దేశ సంపదలో పై 10 శాతం ప్రజలు దాదాపు 60 శాతం సంపదను నియంత్రించగా, దిగువ 50 శాతం ప్రజల వాటా కేవలం 15 శాతానికి పరిమితమైంది. ఈ దశలో ఆర్థిక ఆధిపత్యం రాజకీయ ఆధిపత్యంగా మారింది. ప్రజాస్వామ్య వ్యవస్థ కొనసాగుతున్నప్పటికీ ప్రజల రాజకీయ భాగస్వామ్యం క్రమంగా తగ్గింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో 70 శాతం మందికి పైగా సంపన్న వర్గాలకు చెందినవారే. మీడియా యాజమాన్యంలో సుమారు 80 శాతం వరకు కార్పొరేట్ నియంత్రణ ఏర్పడింది. ప్రజా సమస్యల స్థానంలో భావోద్వేగ అజెండాలు, ప్రచార రాజకీయాలు ఆధిపత్యంగా మారాయి. ఫలితంగా ప్రజాస్వామ్య రూపంలో కొనసాగుతున్న ఒక ఆధునిక రాజకీయ ఆధిపత్యం స్థిరపడింది. ఈ పరిస్థితుల్లో ప్రత్యధిపత్యం కొత్త రూపాల్లో వ్యక్తమవుతోంది. దళిత ఉద్యమాలు, మహిళా చైతన్యం, ఆదివాసీ పోరాటాలు, విద్యార్థి నిరసనలు, పర్యావరణ ఉద్యమాలు రాజ్యం ఆధిపత్య ధోరణిని ప్రశ్నిస్తున్నాయి. 1990లో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం 10 శాతం మాత్రమే ఉండగా, 2020 నాటికి అది సుమారు 33 శాతానికి చేరింది. సామాజిక న్యాయంపై ప్రజా అవగాహన 30 శాతం నుంచి 55 శాతానికి పెరిగింది. డిజిటల్ మాధ్యమాలు ప్రత్యధిపత్యానికి కొత్త వేదికలుగా మారాయి.

రాజ్యం ఆధిపత్యం రాజకీయ రంగానికే పరిమితం కాదు. విద్యా పాఠ్యాంశాలు, చరిత్ర రచనలు, జాతీయత భావనలు, సాంస్కృతిక ప్రతీకలు ద్వారా కూడా ప్రజల ఆలోచనలపై నియంత్రణ కొనసాగుతోంది. ప్రశ్నించే బుద్ధిని తగ్గించడం, విమర్శాత్మక ఆలోచనలను అణచివేయడం ఈ ప్రక్రియలో భాగంగా మారాయి. ఈ విధంగా ఒక సమ్మతి ఆధిపత్యం నిర్మితమవుతోంది. మొత్తానికి ఆదిపత్యం – ప్రత్యధిపత్యం మధ్య సాగుతున్న ఈ సంఘర్షణ ఒక కాలానికి, ఒక ప్రభుత్వానికి, ఒక దేశానికి పరిమితం కాదు. అధికారాన్ని శాశ్వతంగా నిలుపుకోవాలని ప్రయత్నించే వర్గాలు కొత్త రూపాల్లో ఆధిపత్యాన్ని నిర్మిస్తూనే ఉంటాయి. ఆ అధికారానికి లోబడి జీవించే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పనిసరిగా పుడుతుంది. రాజ్యం ప్రజల ప్రతినిధిగా కాకుండా పాలక వర్గాల రక్షకుడిగా మారినప్పుడు ప్రజాస్వామ్యం ఖాళీ వ్యవస్థగా మిగులుతుంది. ఎన్నికలు ఉన్నా న్యాయం అందుబాటులో ఉండదు. ఈ పరిస్థితుల్లో ప్రశ్నించే పౌరుడు, విమర్శించే మేధావి, ప్రతిఘటించే ఉద్యమమే ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తాయి. ప్రజలు మౌనంగా ఉన్నంతకాలం ఆదిపత్యం బలపడుతుంది. ప్రజలు మాట్లాడటం ప్రారంభించిన క్షణమే అది బలహీనపడుతుంది. ఈ సత్యాన్ని గుర్తించినప్పుడే సమాజం నిజమైన ప్రజాస్వామ్య దిశగా ముందుకు సాగగలదు. ఈ సమకాలీన పరిస్థితుల్లో రాజ్యం తన అధికార స్వభావాన్ని పునఃపరిశీలించుకోవాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజల జీవన అనుభవాలకు దూరంగా తీసుకునే నిర్ణయాలు ఎంత కాలం నిలుస్తాయో చరిత్ర ఇప్పటికే తీర్పు చెప్పింది. అధికారానికి నైతికత లేకపోతే అది భయంగా మారుతుంది. భయంపై నిలబడిన పాలన ఎప్పటికైనా కూలిపోతుంది. ప్రజల ప్రశ్నలను దేశద్రోహంగా చిత్రీకరించే ధోరణి ప్రజాస్వామ్యాన్ని లోపల నుంచే ఖాళీ చేస్తుంది. ఆలోచనలపై నియంత్రణ పెరిగిన కొద్దీ ప్రతిఘటన మరింత లోతుగా విస్తరిస్తుంది. ప్రజల సహనాన్ని బలహీనతగా భావించిన ప్రతి రాజ్యం చివరికి ప్రజల చేతిలోనే పరాజయం పాలైంది. ఈ సత్యం మారదు. ప్రత్యధిపత్యం అంటే గందరగోళం కాదు. అది సమాజ ఆత్మరక్షణ. అది ప్రశ్నించే ధైర్యం, అన్యాయాన్ని తిరస్కరించే స్పృహ. ప్రజల స్వరం మూగబోయిన క్షణమే ప్రజాస్వామ్యం మరణిస్తుంది. ప్రజలు మాట్లాడే స్థలాలు మూసివేయబడినప్పుడు ఆ స్వరం కొత్త మార్గాలు వెతుక్కుంటుంది. ఆపలేని ఆ చైతన్యమే మార్పుకు విత్తనం వేస్తుంది. రాజ్యం ప్రజలతో సంభాషించగలిగినప్పుడే దాని న్యాయబద్ధత నిలుస్తుంది. అధికారానికి అర్థం ప్రజల సేవలోనే దాగి ఉంది. ఈ మౌలిక సత్యాన్ని గుర్తించిన రోజే సమాజం సమానత్వ దిశగా నిజమైన అడుగు వేస్తుంది. అప్పుడే ప్రజాస్వామ్యం కేవలం వ్యవస్థగా కాక జీవించే విలువగా మారుతుంది.

ఇప్పటి రాజకీయ వాతావరణంలో గమనించాల్సిన మరో కీలక అంశం రాజ్యం తనను తాను ఎలా నిర్వచించుకుంటుందన్నదే. ప్రజల హక్కులను పరిరక్షించే సంస్థగా కాకుండా కేవలం నియంత్రణ యంత్రంగా మారినప్పుడు రాజ్యం తన నైతిక ఆధారాన్ని కోల్పోతుంది. చట్టం పేరుతో జరిగే అన్యాయం కూడా అన్యాయమేనని ప్రజలు గుర్తించడం మొదలుపెట్టిన దశలో ప్రత్యధిపత్యం మరింత బలపడుతుంది. అభివృద్ధి గణాంకాలు పెరుగుతున్నాయని చెప్పుకునే పాలనలు ప్రజల జీవన వాస్తవాలను విస్మరించినప్పుడు ఆ గణాంకాలే ప్రశ్నార్థకంగా మారతాయి. ఉపాధి లేని వృద్ధి, భద్రత లేని జీవితం, స్వేచ్ఛ లేని ప్రజాస్వామ్యం ఇవన్నీ కలసి ఒక నిశ్శబ్ద అణచివేతను నిర్మిస్తాయి. ఈ అణచివేతకు వ్యతిరేకంగా పుట్టే ప్రతి ప్రశ్న రాజకీయమే. రైతు భూమి కోసం చేసే పోరాటం రాజకీయమే. విద్యార్థి ఫీజులపై అడిగే ప్రశ్న రాజకీయమే. మహిళ తన భద్రత కోసం చేసే డిమాండ్ రాజకీయమే. ఈ సాధారణ అనుభవాలన్నీ కలిసినప్పుడే ప్రత్యధిపత్యం సామాజిక శక్తిగా మారుతుంది. రాజ్యం ఈ స్వరాలను వినకుండా అణచివేయాలని ప్రయత్నించిన ప్రతీసారి ప్రజాస్వామ్య దూరం మరింత పెరుగుతుంది. ప్రజల నమ్మకం కోల్పోయిన రాజ్యం కేవలం అధికార భవనాలకే పరిమితం అవుతుంది. చివరికి చెప్పాల్సిన సత్యం స్పష్టం. అధికారం ప్రజల నుంచి పుడుతుంది. ప్రజల నుంచి దూరమైన అధికారం నిలవదు. ప్రశ్నించే పౌరుడు ఉన్న సమాజమే చైతన్యవంతమైన సమాజం. ప్రత్యధిపత్యం ఉన్న చోట మార్పు సాధ్యమవుతుంది. ఈ మార్పే సమానత్వానికి దారి చూపుతుంది. ఈ దారిలోనే ప్రజాస్వామ్యానికి భవిష్యత్తు ఉంది.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

---

## .. పరాకు కాకు..

**పాత ఒక రోతను సామెత**
**కొత్త ఒక వింత ఘనత**
**గతకాలపు వెతల చేరిత**
**మన నొసట వెలసిన రాత**

**నోరు మంచి తలంచితే**
**ఊరు మంచిదౌతుంది**
**మాట తేటగా వినిపిస్తే**
**తూటా పేలనంటుంది**

**మూట గొప్పదని భావిస్తే**
**చేటు కాపు కాస్తుంది**
**కాటు వేయ ప్రయత్నిస్తే**
**వేటు చేరువ వుతుంది**

**నీకు నీవే మురిసి మెరువుకు**
**సాటి వారి తోడు వీడకు**
**పబ్బుల్లో చిందులేయకు**
**జబ్బులను కొని తెచ్చుకోకు**

**ఆశ పెంపక శునకమైతే**
**దురాశ. నెత్తిన స్థిర మౌతుంది**

**ఆశయం మది గదిలో అంకురిస్తే**
**విశ్వమే నిను పిలిచి కొలుస్తుంది**

**పేరులోనే కలదు పెన్నిధి**
**మంచి లోనే కలదు సన్నిధి**
**ఆత్మ నేర మనిషి కొలువది**
**శరీరమొక కవచ వేది**

**25 కు వీడ్కోలు చిలుకు**
**26 కు స్వాగతం పలుకు**
**తలుకు బెలుకులజోలి పోకు**
**పోరు మరచి పరాకు కాకు**

రచన
నమిలకొండ నాగేశ్వర్ రావు
మేడ్చల్, 8688553470

# జీవితం మారాలంటే ఆలోచన విధానం మారాలి

- మహేశ్వర మహా పిరమిడ్‌లో దిగ్విజయంగా 10వ రోజు పత్రీజీ ధ్యాన మహాయాగం..
- అన్నిరోగాలకు మూలం భవరోగం-బ్రహ్మర్షి పత్రీజీ





**కడ్తాల్, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** ధ్యానం సర్వరోగనివారిణి,ధ్యానం సకలభోగకారిణి,ధ్యానం సత్యజ్ఞాన ప్రసాదిని అని బ్రహ్మర్షి పత్రీజీ తెలిపారు.అన్నిరోగాలకు మూలం భవరోగమని స్పష్టం చేసారు.నాకు దేహం కావాలి,నేను బతకాలి అనే రోగం భవరోగమన్నారు.ఈ భవరోగంతోనే మిగతా రోగాలు వస్తాయని, దీనిని విడిచిపెడితేనే ముక్తి. నిర్వాణం, పరమపదసోపానం పొందుతామని తెలిపారు.తాను ఆత్మపదార్థాన్ని అన్న విషయం ఎప్పుడైతే తెలుసుకుంటాడో భవరోగం మాయమవుతుందని స్పష్టం చేసారు. మరో సందేశంలో నాలుగు రకాల ఆలోచన విధానాలైన వినాశకరమైన ఆలోచనలు, వ్యతిరేక ఆలోచనలు,సానుకూల ఆలోచనలు, అధ్భుత ఆలోచనల గురించి వివరించారు.కొత్తగా స్కూటీ కొన్న వ్యక్తి నేను కిందపడుతానేమో అనే భయపడతే నిజంగానే యాక్సిడెంట్ జరుగుతోందని,దానిని వినాశకర ఆలోచనలంటారని, కింద పడుతానో లేదో అనే ఆలోచిస్తే వ్యతిరేక ఆలోచనలని, సురక్షితంగా వెళ్లి వస్తా అనే ఆలోచిస్తే సానుకూల ఆలోచనలను తెలిపారు.అయితే నేను 30 నిమిషాల్లో సురక్షితంగా వెళ్లి తిరిగి వస్తా అనే లక్ష్యం పెట్టుకుంటే అధ్బుత ఆలోచనలను వివరించారు.ఎలాంటి ఆలోచనలను విడుదల చేస్తామో ఆదే జరుగుతోందని,మన జీవితం మారాలంటే ఆలోచన విధానం మారాలని సూచించారు.పీఎస్ఎస్ఎం ప్రాజెక్ట్ లో భాగంగా నంద్యాల జిల్లా మంగనపల్లిలో గల సదానంద గురూ ఆశ్రమం నందవరం ఏవీని ప్రదర్శించారు.

### ధ్యానం చేస్తే సరైన జీవనవిధానం తెలుస్తుంది

బ్రహ్మర్షి పత్రీజీ ధ్యానులు పాటించాల్సిన 18 ఆదర్శసూత్రాలు, 13 వ్యక్తి గత సూచనలు,ఆరు లక్ష్యాలను రూపొందించారని పీఎస్ఎస్ఎం నేషనల్ కోఆర్డినేటర్ మాధవి తెలిపారు. ప్రతి పిరమిడ్ మాస్టర్ వీటిని ఆచరిస్తున్నారా లేదా అనేది చెక్ చేసుకోవాలని సూచించారు. ధ్యానం చేస్తే సరైన జీవనవిధానం తెలుస్తుందన్నారు. ధ్యానం ద్వారా జీవిత లక్ష్యం తెలుసుకోవాలన్నారు.ప్రతి పిరమిడ్ మాస్టర్ రోజు మూడు గంటలు ధ్యానం,ఒక గంట స్వాధ్యాయం,సేవాతత్పురులతో సజ్జన సాంగత్యం చేసి వారికి ధ్యానం నేర్పించాలని సూచించారు.ఎవరితే ఎక్కువ కష్టాలు,అవమానాలను భరిస్తారో వారే జ్ఞానోదయమైన మాస్టర్స్ అని తెలిపారు.ధ్యానంతో మనసు శూన్యమవుతుందని వివరించారు.ఎప్పుడు వర్తమానంలోనే జీవించాలని,మనసులో ఎలాంటి సంశయాలను పెట్టుకోకూడదని సూచించారు.ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్టు సభ్యులు మాధవి,దామోదర్ రెడ్డి,నిర్మల,హన్మంత రావు,భాస్కర నంద, లక్ష్మి,జ్యోతి, సుమంగళి, సృజన, ధ్యానులు, తదితరులు ఉన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి పల్నాటి యాదయ్య

మహేశ్వరం, డిసెంబర్ 30 (జనంసాక్షి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్వో సంగీతకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పల్నాటి యాదయ్య మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర శాసనసభ చట్టాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు.బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపించి 8 నెలలు గడుస్తుందన్నారు.కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లును 9వ షెడ్యూల్ లో చేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.బీసీ రిజర్వేషన్ల అమలు చేసే వరకు కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి ఒత్తిడి తేవాలన్నారు.వినతిపత్రంలో ఇచ్చిన వారిలో మారబోయిన నరేందర్,తవిటి చంద్రయ్య, సూరంగంటి రంజిత్ కుమార్,రాములు తదితరులు పాల్గొన్నారు.



## నూతన సర్పంచులను సన్మానించిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**మహేశ్వరం, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే గ్రామ పంచాయతీలు నడుస్తున్నాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగారం గ్రామంలో కుండే వెంకటేష్ ఫామ్ హౌస్‌లో మహేశ్వరం మండలం బీజేపీ అధ్యక్షుడు యాదిష్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి 25 లక్షల నుంచి కోటి రూపాయల వరకు నిధులను త్వరలోనే విడుదల చేస్తుందన్నారు. రాబోయే జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలకు బీజేపీ నాయకులు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ రెడ్డి,నాయకులు పాపయ్య గౌడ్,కడారి జంగయ్య యాదవ్,అనంతయ్య గౌడ్,మిద్దె సుదర్శన్ రెడ్డి, యాదయ్య గౌడ్, మాధవ చారి,కుండే వెంకటేష్,దేశ్యా నాయక్, పోతర్ల సుదర్శన్ యాదవ్, వనంపల్లి శ్రావణ్,ఉపేందర్,పలు గ్రామాల సర్పంచులు,పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**మెదక్, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, బిల్లులు ఇవ్వకుండా ఎరువుల అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. మెదక్ జిల్లాలోని కొల్చారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం మరియు సహకార సంఘం ఎరువుల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, అమ్మకాలు, రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికలను కలెక్టర్ పరిశీలించారు.రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలన్నారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రైతుకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చూడాలని, కృత్రిమ కొరత సృష్టించకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.. అలాగే షాప్ ముందు ఎరువుల నిల్వల వివరాలు, ధరల పట్టిక, జిల్లా, రాష్ట్ర టోల్‌ఫ్రీ నంబర్లను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువుల పంపిణీ సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో యూరియా నిల్వలు గురించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పుష్కలంగా యూరియా అందుబాటులో ఉందని అక్టోబర్ 2025 నుండి జనవరి 2026 వరకు జిల్లాకు 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటే ఇప్పటికే 12,673 యూరియా జిల్లాకు వచ్చి ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో అక్టోబర్ నెల నుండి 28 డిసెంబర్ వరకు 7,3 43 మెట్రిక్ టన్నుల యూరియా కొనుగోలు జరగగా ఇంకా జిల్లాలో 5,146 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్చారం తహసిల్దార్ శ్రీనివాస్ చారి, కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, సొసైటీ మాజీ చైర్మన్ నాగూరు మనోహర్, ఏఈవోలు స్రవంతి, రాజశేఖర్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తర ద్వార దర్శనం ఎంతో పుణ్యఫలం



**తాండూరు, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని తాండూరు పట్టణం అంతారం గ్రామ సమీపంలో కొలువుదిరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా బివిజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ తో కలిసి ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి సేవలు పాల్గొని తరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఉత్తర ద్వారా దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకోవడం అత్యంత పుణ్యఫలం అన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ముక్కోటి దేవతలు దివి నుండి భూమికి వచ్చిన రోజును ముక్కోటి ఏకాదశిగా పరిగణించబడుతుందని తెలిపారు. ఈరోజు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిస్తే సకల శు భాలు చేకూర్తాయని తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ తలపెట్టిన కార్యక్రమాల్లో విజయం చేకూరాలని ఆశీర్వదిస్తూ తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆహార విక్రయశాలలపై పర్యవేక్షణ పెంచాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఆహార పదార్థాలు విక్రయించే హోటల్స్,ఇతర కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షణ పెంచాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 1278 ఆహార విక్రయశాలలు సంబంధిత శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోగా,కొత్తగా ఏర్పాటు చేసిన ఆహార విక్రయ కేంద్రాలపై కూడా సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు.ప్రతి నెల 25 హోటల్స్ లో మాత్రమే ఫుడ్ శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపుతున్నారని, వీటి సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు.కల్తీ ఆహారం తయారు చేసిన హోటల్స్ పై 2022 నుంచి ఇప్పటిదాకా 26 కేసులు నమోదయి, రూ.1.50 లక్షలు జరిమానా విధించారన్నారు.పెద్ద హోటల్స్ తో పాటు మెస్లు, తోపుడు బండ్లు, బేకరీలు, ఇతర విధానాల్లో ఆహార పదార్థాలను విక్రయించే వారందరిపై నిఘా పెంచాలని,ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే కాక తరచు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జనవరి మొదటి వారంలో ఎంపిక చేసిన కొన్ని సంక్షేమ వసతి గృహాల్లో ఆహారంతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాల ఆహార శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపించాలన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలోగా వీటి శాంపిల్స్ ఫలితాల నివేదికను తమకు అందజేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, ఫుడ్ సేఫ్టీ అధికారి కరుణాకర్, విద్యా,సంక్షేమ,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో పట్నం మహేందర్ రెడ్డి కుటుంబం



**తాండూరు, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తిరుమలలో మంగళవారం తెల్లవారుజామున శ్రీవారిని తెలంగాణ శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి,పట్నం సునీతమ్మ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో కొలువుదీరిన శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజు శ్రీవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని వెల్లడించారు. మహేందర్ రెడ్డితో వియ్యంకులు రమణారెడ్డి తదితరులు ఆయనతో ఉన్నారు.

## మేడిపల్లిలో మూడు కొత్త కోర్టు హాళ్ల ప్రారంభం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లిలో ఉన్న అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ ఆవరణలో మూడు నూతన కోర్టు హాళ్లను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు. కోర్టుల మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా నిర్మించిన ఈ కొత్త కోర్టు హాళ్లు న్యాయ వ్యవస్థను మరింత ప్రజలకు చేరువ చేయనున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. న్యాయ పరిపాలన వేగవంతం కావడంతో పాటు, ప్రజలకు న్యాయం త్వరగా అందించేందుకు ఈ కోర్టు హాళ్లు ఉపయోగపడతాయని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి అనుకూల వాతావరణం కల్పించేలా ఈ హాళ్లను సౌకర్యవంతంగా నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరేందర్ రెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుల సంక్షేమమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు

- మార్వాడి యువ మంచ్ ఆద్వర్యంలో దుప్పట్లు పంపిణీ
- ఆల్ ఇండియా మార్వాడి యువ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్ సార్డా



**తాండూరు, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** చలికాలం దృష్టిలో పెట్టుకొని వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కందనెల్లి గ్రామంలో చలికాలాన్ని దృష్టిలో పెట్టుకొని 65 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మార్వాడి యువ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా మార్వాడి యువ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్ సార్డా మాట్లాడుతూ, వృద్ధుల సంక్షేమమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. గత 40 సంవత్సరాల నుండి పాఠశాలలకు వివిధ గ్రామాలకు తండాలకు విద్యా, వైద్యము తోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్వాడి యువ మంచ్ అధ్యక్షుడు అనిల్ సార్డా, కోశాధికారి అరుణ్ సార్డా, రాష్ట్ర ఉపాధ్యకులు కిషన్ రాతి, పవన్ సోనీ.రమాకాంత్ పండిట్, నితిన్ సార్డా, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామస్థులు ఈ సేవా కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ వాజిద్,మాజీ వైస్ ఎంపీపీమధులత, మాజీ సర్పంచ్ లక్ష్మీ,వార్డ్ సభ్యులు, న్యాయవాది కిరణ్.సోషల్ వర్కర్ కేవిఎం వెంకట్, పాత్రికేయులు శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు అక్రమాలపై విచారణ చేపట్టిన అధికారులు



**వీపనగండ్ల, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల గోపల్ దీన్నే గ్రామంలో వడ్ల కొనుగోలు గోల్మాల్ అంశంపై మంగళవారం గొపల్ దీన్నే గ్రామానికి చేరుకున్న అధికారులు విచారణ చేపట్టారు. డిఆర్డిఏ అధికారులు గోపల్ దీన్నే గ్రామ రైతు వేదికలో విచారణ చేపట్టారు. రైతుల సమక్షంలో దాదాపు 14,9735 రూపాయలు అవకతవకలు జరిగినట్లుగా అధికారుల విచారణలో తేలినట్లు స్థానికులు అన్నారు. సంబంధించి డాటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్‌ను రైతుల ఎదుట విచారణ డిఆర్డిడిఓ సరోజ, ప్రభాకర్ రాంబాబు వీపనగండ్ల ఏపీఎం మద్దిలేటి సమక్షంలో విచారణ జరిపారు. వడ్ల కొనుగోలు కేంద్రంలో ఉన్న అధికారులను పలు ప్రశ్నలు అడిగారు. మహిళా సంఘానికి పంపించినటువంటి గన్ని బ్యాగులు తీసుకుపోకుండా బ్యాగులు ఎక్కడ తెచ్చారు అనే విషయాలపై ఆరా తీశారు. ఇమామ్ రైస్ మిల్‌కు గద్వాల పంపించినటువంటి వరి ధాన్యానికి ఆ రైస్ మిల్ వ్యక్తి ఏ విధంగా క్వాంటిటీ ఇస్తాడు అనే అంశాలపై విచారణ చేపట్టారు. రైతు రంగవరం గ్రామ చెందిన వ్యక్తిని చలమారెడ్డిని విచారించగా తాను ప్రైవేటుగా, బ్యాగులు కొనుగోలు చేసి ధాన్యం లారీ గద్వాల ఇమామ్ రైస్ మిల్ కు పంపించామని అధికారులకు చెప్పారు. గోపల్ దీన్నే గ్రామానికి చెందిన రైతు దేవయ్యతో విచారించగా నేను గోపల్దిన్నె సెంటర్‌లనే నాకు ఇప్పుడు వచ్చినటువంటి 31,534 కాక అంతకన్నా ముందు ఐదు ఎకరాలనరకు సంబంధించి ఇదే సెంటర్లో వడ్లను అమ్మడం జరిగిందని దానికి నాకు డబ్బులు వచ్చాయని ఆయన తెలిపారు. ఇతర రైతులకు సంబంధించిన 33 బాగుల డబ్బులు నా అకౌంట్‌లో జమ చేసుకున్నానని తెలిపారు. ఆ డబ్బులను వెంటనే ఫోన్పే ద్వారా జగదీష్ ఖాతాలోకి వేయడం జరిగిందని ఆయన తెలిపారు. జగదీషను విచారించగా తాను బుక్ కీపర్ ను అడిగే చేశానని అధికారులకు వివరించారు.ఐదు మంది రైతు ఖాతాలలో 14 లక్షల 97,35 రూపాయలు పై విచారణ చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్ రెడ్డి, వెంకట్ నరసింహారెడ్డి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
31 డిసెంబర్ 2025

# వార్డుల మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** త్వరలో జరుగబోయే పురపాలికల ఎన్నికల నిర్వహణకు వార్డుల మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్లో పురపాలికల ఎన్నికలపై మున్సిపల్ కమిషనర్లు, మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పురపాలికల్లో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీస్ విడుదల చేసిందని దానికి అనుగుణంగా జనవరి 1వ తేది నాడు మున్సిపల్ వార్డు వారిగా ముసాయిదా ఎలక్టరల్ రోల్ జాబితా విడుదల చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. అసెంబ్లీ నియోజకవర్గం వారిగా ఉన్న ఎలక్టరల్ రోల్ ను పార్ట్ వారిగా ఒక్కో మున్సిపల్ వార్డులో ఎన్ని పార్టులు వస్తున్నాయి, అందుకొని ఇంటి నెంబర్లు, ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. జనవరి ఒకటవ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితా, వార్డులో అసెంబ్లీ ఉప విభాగాల వివరాల ఆధారంగా ప్రజల నుండి వచ్చే అభ్యంతరాలను జనవరి 5 నుంచి స్వీకరించి పరిష్కరించిన, తప్పులు లేని తుది ఓటరు జాబితాను జనవరి 10వ తేదీన ప్రకటించాలని సూచించారు. జనవరి 10న ప్రకటించే తుది ఓటరు జాబితా ఆధారంగా మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. జనవరి, 5వ తేదీన ప్రముఖ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మున్సిపల్ కమిషనర్లు సమావేశాలు నిర్వహించి వారికి వార్డుల వివరాలు తెలిపి అభ్యంతరాలను తీసుకోవాలని, జనవరి 6వ తేదీన కలెక్టర్ స్థాయిలో కలెక్టరేట్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.వార్డుల మ్యాపింగ్ తప్పులు లేకుండా పకడ్బందీగా సిద్ధం చేస్తే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవచ్చని తెలియజేశారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం,




మున్సిపల్ కమిషనర్లు, మేనేజర్లు, సి సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం తప్పక ఉండాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం తప్పక ఉండాలని, లేని పాఠశాలల్లో నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో శౌచాలయాలు, అంగన్వాడీల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం అంశాలపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మరుగుదొడ్ల సౌకర్యం లేని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన నివేదికను విద్యాశాఖ అధికారుల ద్వారా తెప్పించుకుని కలెక్టర్ పరిశీలించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్ల సౌకర్యం లేని పాఠశాలల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద టాయిలెట్స్ మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు త్వరిత చేపట్టాలని, మార్చ్ 31వ తేదీ లోపు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా జిల్లాలోని 35 అంగన్వాడీ కేంద్రాల్లో ఈ డబ్ల్యూ ఐ డి సి ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో తాగునీటి వసతి కోసం చేపట్టిన పనులపై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు కేవలం 9 అంగన్వాడీల్లో మాత్రమే తాగునీటి వసతికి పనులు పూర్తి చేసినట్లు, ఇంకా 26 అంగన్వాడీల్లో పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పగా ఆయా పనులని జనవరి మొదటి వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా అంగన్వాడీల్లో టాయిలెట్లు నిర్మాణం కోసం మంజూరైన పనులను కూడా జనవరి మొదటి వారంలోపు పూర్తి చేయాలని ఈడబ్ల్యుఐడీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంతేకాకుండా, ప్రభుత్వానికి చెందిన పలు శాఖల పరిధిలో గత పదిహేళ్లుగా క్లైమ్ చేయని బ్యాంకు అకౌంట్లు ఉంటే వాటి సమాచారం తెలుసుకొని వెంటనే వాటిని ఆక్టివేట్ చేసుకోవాలని సూచించారు. తద్వారా ఆయా క్లైమ్ చేయని అకౌంట్లో ఉన్న నగదును ప్రజాప్రయోజనార్థం పనులకు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా అన్ని పాఠశాలల్లో కలెక్టర్ నిధుల నుంచి గ్యాస్ కనెక్షన్లు ఇప్పించడం జరిగిందని, ఇప్పుడు ఆయా పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్ వినియోగిస్తున్నారా ఇంకా కట్టెల పొయ్యి మాత్రమే వాడుతున్నారా..? అన్ని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆరా తీశారు. తప్పనిసరిగా అన్ని పాఠశాలల్లో గ్యాస్ సిలిండర్ ద్వారా మాత్రమే వంట చేయాలని కట్టేల పోయి వినియోగించడం జరగవద్దని ఆదేశించారు.సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిని ఉమాదేవి, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సదాశివపేట, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దేవస్థానంలోని ఉత్తర ద్వారం గుండా వెళ్లి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి పవిత్ర దినాన ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడం ఎంతో శుభప్రదం అని పేర్కొన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు.

## కుల వివక్షకు తావివ్వద్దు



**చిన్నశంకరంపేట, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** మండలంలోనిగజగట్లపల్లి గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎస్సై నారాయణ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ, గ్రామంలో ప్రజలు అందరూ కలిసిమెలసి కులపరమైన ఇబ్బందులు,అంటరానితనం ,వివక్ష, గుడిలో ప్రవేశం విషయంలో యువక్షత ఉండకుండా కలిసిమెలిసి ఉండకుండా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు,సర్పంచ్ బండారి నాగభూషణం, ఎస్సీ హాస్టల్ వార్డెన్ బిక్షపతి, హెడ్మాస్టర్ గాలయ్య, ఏఈఓ నాగేంద్ర, అంగన్వాడి టీచర్లు,ఏఎన్ఎం ప్రియాంక, ఆయాలు వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి సంతోష్ గ్రామస్తులు పాలక వర్గ సభ్యులు, గ్రామ అధికారులు, ప్రజలు గ్రామస్తులు తదితరులుపాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



**ఉప్పునుంతల, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** దుందుభి వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక రావని తక్షణమే అరికట్టాలని మొల్గర పెద్దాపూర్ సర్పంచులు తాసిల్దార్ అద్దంకి సునీతకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా ఈ ప్రాంతం నుంచి విచ్చలవిడిగా ఇసుక దోపిడీ జరుగుతుందని రాత్రికి రాత్రే ట్రాక్టర్లా ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తూ కొందరు అక్రమ సంపాదనకు తెర తీస్తున్నారని వారు ఆరోపించారు ఈ అక్రమ తవ్వకాల వల్ల దుందిబి వాగు తీవ్రంగా నాశనం అవుతుండటమే కాకుండా పరిసర గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంతేకాకుండా ఈ ప్రాంత ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని ముఖ్యంగా దుందుభి వాగు పై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు జీవనాధారం ప్రమాదంలో పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోని అక్రమ ఇసుక రవణను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు ఇసుక మాఫియా పై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వారన్నారు ఈ కార్యక్రమంలో మొల్గర గ్రామ సర్పంచ్ సులోచనమ్మ పెద్దాపూర్ సర్పంచ్ వంగ సాయిబాబు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొత్త రవీందర్ రావు గ్రామస్తులు ఎం, రమేష్,ఎన్,ఎల్ల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణంలో పక్షపాత ధోరణి



**పెబ్బేరు, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** పెబ్బేరు పురపాలక పరిధిలో వనపర్తి రోడ్ లో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం పనుల్లో పక్షపాత ధోరణి వ్యవహరిస్తున్నారని స్థానికులు శ్రీధర్ రెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారు. సుభాష్ చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ వరకు 40 ఫీట్లు రోడ్డు తీసుకోగా పోలీస్ స్టేషన్ నుండి అవతలి పిజెపి కెనాల్ వరకు 35 నుండి 37 ఫీట్లు తీసుకోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యాన్ని వీడాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు. అవకాశం ఉన్న కేవలం రాజకీయ కోణాలతో ఆలోచిస్తున్నారని ఇది సరైన విధానం కాదని మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. స్థానికులు వివి గౌడ్ ,నరసింహ గౌడ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా భద్రతకు సమర్థంగా పని చేయాలి




**వెల్దండ, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** న్యాయం కోసం పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదు దారులకు, బాధితులకు పోలీసులు న్యాయం చేస్తారని భరోసా కల్పించాలని డీఎస్పీ సైరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. వెల్దండ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి ఎస్సై కురుమూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు. ప్రజా భద్రతకు సంబంధించిన అంశాల్లో సవాళ్లను ఎదుర్కొంటూ పోలీస్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

# మౌళిక అంశాలపై పట్టు - ఉద్యోగానికి తొలి మెట్టు

● గూగుల్ ఇంజనీర్ రోహిత్ కీర్తాంకర్

**పటాన్‌చెరు, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** సాంకేతిక ఇంటర్వ్యూలలో విజయం సాధించడానికి డేటా నిర్మాణాల పనితీరుపై అవగాహనతో పాటు మౌళిక అంశాలపై పట్టు తప్పనిసరని గూగుల్ ఏడీఎస్ సొల్యూషన్స్ ఇంజనీర్ కీర్తాంకర్ స్పష్టీకరించారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'గూగుల్ స్పీకర్ సెషన్: జాబితా, మ్యాప్, మ్యాజిక్' అనే అంశంపై మంగళవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. గీతంలోని గూగుల్ డెవలపర్ గ్రూప్ ఆన్ క్యాంపస్ (జీడీజీసీ) నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోహిత్ పనితీరు ఆధారిత ఇంజనీరింగ్, డేటా నిర్మాణాలపై లోతైన అవగాహన కల్పించారు. సమయం, స్థల సంక్లిష్టత, సేకరణల



ప్రాముఖ్యత, సరైన పనితీరును సాధించడానికి జాబితాలు, మ్యాపులు, సెట్ల ప్రభావవంతమైన ఉపయోగంపై రోహిత్ ప్రధానంగా దృష్టి సారించారు. బిగ్-ఓ సంజ్ఞామనం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, స్కేలబుల్ అప్లికేషన్లను నిర్మించడానికి మౌళిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఆచరణాత్మక ఇంటర్వ్యూ వ్యూహాలను పంచుకున్నారు. విద్యార్థులు ప్రాథమిక పరిష్కారాలతో ప్రారంభించి, క్రమంగా వాటిని మెరుగుపరచాలని, తమ ఆలోచనా ప్రక్రియను స్పష్టంగా తెలియజేయాలని ప్రోత్సహించారు. ఇంటర్వ్యూ కోసం సన్నద్ధత, ప్లాట్ ఫామ్ ఆధారిత అభ్యాసం, వైఫల్యాల నుంచి నేర్చుకోవడంపై విద్యార్థులకు రోహిత్ మార్గదర్శనం చేశారు. జీడీజీసీ అధ్యక్షురాలు ఆశ్వికా ఖురానా, అతిథిని పరిచయం చేసి, ఇతర బృంద సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



**మాగనూర్, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** మండలంలోని నేరాడగం గ్రామం మీదుగా ఉజ్జెలి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం నారాయణ పేట బస్సు డిపో మేనేజర్ నేరాడగం, ఉజ్జెల్లి ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉజ్జెల్లి ఉప సర్పంచ్ రాజు మాట్లాడుతూ ఉజ్జలి గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడం ద్వారా ప్రతి సంవత్సరం మక్తల్ లాంటి ప్రాంతాలకు వచ్చి చదువుకునే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందనీ ప్రైవేట్ వెహికల్స్‌లో పరిమితికి మించి కూర్చోపెట్టుకోవటం ద్వారా ప్రమాదానికి గురయే అవకాశం ఉందని అన్నారు. అధికారులు తక్షణమే చొరవ చూపించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి. ప్రకాష్. సోంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ నరేందర్ సేవలు వెలకట్టలేనివి

● సీపీఐ డివిజన్ నాయకుడు వలబోజు నరసింహాచారి



**చేర్యాల, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ నరేందర్ మరణం అత్యంత బాధాకరమని ఆయన సేవలు వెలకట్టలేనివని సిపిఐ చేర్యాల డివిజన్ నాయకుడు వలబోజు నరసింహాచారి అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని ఆయన స్వగృహంలో సిపిఐ నాయకులతో కలిసి పార్థివ దేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగ వృత్తితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, పేద ప్రజలకు ఏ ఆపద వచ్చినా తన వంతు సహాయంగా ఆదుకొని అండగా నిలిచిన గొప్ప మనసున్న మానవతావాది నరేందర్ అని ఆయన సేవలను కొనియాడారు. ఆయన మృతి కుటుంబానికి, సమాజానికి తీటని లోటని అన్నారు.

# సరిహద్దు నేరాలను సమిష్టిగా నివారిద్దాం

**నారాయణపేట, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** తెలంగాణ,కర్ణాటక సరిహద్దు నేరాలను సమిష్టిగా నివారిద్దామని నారాయణపేట సి ఐ.శివశంకర్ అన్నారు. నారాయణపేట జిల్లా సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు లు కర్ణాటక పోలీసు అధికారులు, కొడంగల్ ,తాండూరు పోలీసు అధికారులతో కలిసి కర్ణాటక రాష్ట్రం కలబుర్గి జిల్లా చించోలి పట్టణంలో మంగళవారం సరిహద్దు నేరాల నియంత్రణ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, అక్రమ వ్యాపారాలు నివారించేం దుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించడం జరిగింది. రెండు రాష్ట్రాల పోలీస్ శాఖల మధ్య సమన్వయం పెంచుకొని, సమాచార మార్పిడిని వేగవంతం చేయడం




ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవు తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.ప్రజల భద్రత దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో సంయుక్త గస్తీ, వాహనాల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా కొనసాగించాలని నిర్ణయించారు.

# తుది దశకి చేరుకున్న ధాన్యం కొనుగోళ్లు

**మహబూబ్ నగర్ బ్యూరో, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** ధాన్యం సేకరణ వేగవంతం చేసి పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఖరీఫ్ 2025-26 ధాన్య సేకరణపై మంగళవారం పౌర సరఫరాల శాఖ అధికారులతో రెవిన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, మొత్తం సేకరణ ప్రక్రియను అత్యంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్లర్ల నుండి పొందిన బ్యాంక్ గ్యారంటీలను పరిశీలించగా, మిల్లర్లకు అందజేసిన పాడికి సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ గ్యారంటీలను మూడు (03) రోజుల్లో ఖచ్చితంగా సేకరించాలని సంబంధిత పౌర సరఫరాల శాఖ డి.టి.లను ఆదేశించారు. అదేవిధంగా రబీ 2024-25 సీజన్‌కు సంబంధించిన సి. ఎం.ఆర్ డెలివరీ పై సమీక్ష నిర్వహించారు. మిల్లింగ్ సామర్థ్యానికి అనుగుణంగా మిల్లులను రెండు (02) షిఫ్టుల్లో నిర్వహిస్తూ సి. ఎం.ఆర్ డెలివరీలను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. డిసెంబర్ 29 నాటికి జిల్లాలో 26,015 మంది రైతుల నుంచి మొత్తం 1,30,459 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. మొత్తం రూ. 312 కోట్ల మద్దతు ధర కు గాను, 24,072 మంది రైతులకు రూ. 295 కోట్లు చెల్లించగా, మిగిలిన రూ. 17 కోట్లు రెండు (02) రోజుల్లో విడుదల చేయబడతాయని అధికారులు వివరించారు. బోనస్ మొత్తానికి సంబంధించి, మొత్తం 36.24 కోట్ల రూ.లకు గాను, 7,971 మంది రైతులకు 21.95 కోట్లు రూ.లు చెల్లించబడినట్లు తెలిపారు. మిగిలిన 14.29 కోట్ల రూ.లు ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుండగా, అందుకు సంబంధించిన అన్ని వివరాలు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేయబడినట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణ ,సి.ఎం.ఆర్ డెలివరీ ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అన్ని సంబంధిత అధికారులు



సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్,పౌర సరఫరాల శాఖ డి.ఎం. రవి నాయక్,పౌర సరఫరాల డి.టి.లు పాల్గొన్నారు.

# అందుబాటులో సరిపడా ఎరువులు

* వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 30 (జనంసాక్షి):** జిల్లాలో యాసంగి అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. యూరియా ఎరువుల పంపిణీపై జిల్లా రైతన్న గారకి సరిపడా ఎరువుల నిల్వలు గోదాముల్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఈ యాసంగి 2025- 26 సంవత్సరం లో జిల్లావ్యాప్తంగా, అన్ని పంటలు కలిపి 1,12,345 ఎకరాలు నేటి వరకు సాగులో ఉన్నాయని. గత యాసంగిలో ఇప్పటికే 12,543 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందించడం జరిగిందని అన్నారు. ఈ యాసంగిలో ఇప్పటివరకు 14375 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందజేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో డీలర్ల షాపులలో 434 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, మార్క్ఫెడ్, వరంగల్ జిల్లాలో 5700 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం 1,65,000 మెట్రిక్ టన్నుల యూరియా నిలువలు ఉన్నాయని, రైతులకు అవసరమున్న మేరకు, పంట దశలకు అనుకూలంగా, పంటల విస్తీర్ణం వారిగా నిరంతరముగా ఎలాంటి కొరత లేకుండా యూరియా సరఫరా చేయబడునని అన్నారు. రైతుల కొరకు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి, అన్ని యూరియా విక్రయ కేంద్రాలు, షాపులు తెరిచి ఉంటాయని, అదనపు యూరియా కౌంటర్లు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ సత్య శారద తెలిపారు.

# నాగోబా జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి

* ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** నాగోబా జాతర ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే చారిత్రక కేస్లాపూర్ నాగోబా జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సౌకర్యాలు ఉండే విదంగా చూడాలని అధికారులను ఆదేశించారు.మంగళవారం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా దేవాలయం దర్బార్ సమావేశ మందిరంలో జాతర ముందస్తు ఏర్పాట్లపై ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే జనవరి 18న మహా పూజతో జాతర ప్రారంభమవుతుందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తారని అంచనా వేస్తూ, భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. తదుపరి సమీక్షా సమావేశంలోగా ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో హైమాస్ట్ విద్యుత్ దీపాలు అమర్చాలని, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్లు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు, అత్యవసర వసతులకు సంబంధించిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ నాగోబా జాతరకు వచ్చే గిరిజనులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామన్నారు. మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వస్తున్నందున ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బారికేడ్లు, గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్ మాట్లాడుతూ, ముత్నూరు, హార్కాపూర్ తదితర రహదారులను సరిచేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు కలెక్టర్, ఎస్పీ, పీఓలు నాగోబా ఆలయంలో ప్రతిమను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర ప్రాంగణం, దర్బార్, కోనేరు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, శిక్షణ ఐపీఎస్ రాహుల్ పంత్, ఆలయ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యూరియా అధిక రేట్లకు అమ్మితే చర్యలు

* జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**స్టేషన్ ఘన్ పూర్, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** యూరియా అధిక రేట్లకు అమ్మితే చర్యలు తప్పవని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని పిఎసిఎస్ ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సందర్శించి ఫర్టిలైజర్ బుక్కింగ్ యాప్ పని తీరును స్వయంగా పరిశీలించా రు.యూరియా యాప్ ద్వారా జరుగుతున్న అమ్మకాల ను కలెక్టర్ మంగళవారం యాప్ పైన రైతుల అభిప్రాయాలను అడిగితెలుసుకున్నారు.యాప్ వల్ల యూరి యా కొనుగోలు సులభమయ్యిందని రైతులుసంతోషం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ యూరియా బుకింగ్ యాప్ రైతులకు సులభంగా, పారదర్శకంగా,అవసరానికి అనుగుణంగా యూరియా పంపిణీచేయడంలో అత్యంత ఫలప్రదంగా నిలుస్తోంద ని అన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు తమకు సమీ పంలోని ఏ అధికారిక ఎరువుల విక్రయ కేంద్రం నుండై నా యూరియాను సులభంగా బుక్ చేసుకునే సౌకర్యం కల్పించబడిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు లోనుకాకుండా యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మండల వ్యవసాయ అధికారులు (ఎం ఏ ఓ లు), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ లు) ఎరువుల డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవో వెంకన్న, ఏవో చంద్రన్ కుమార్, ఆర్ ఐలు శ్రీకాంత్, సతీష్, సీఈఓ మగ్దుం అలీ, రెవెన్యూ అధికా రులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాటికల్లులో ఎలుక కలకలం!

* కల్లు తాగిన పలువురికి అస్వస్థత



**ఆత్మకూర్, డిసెంబర్ 30 (జనం సాక్షి):** ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామం తాటివనంలో తాటికల్లు విక్రయిస్తున్న మండువాలో జరిగిన దారుణ ఘటన ప్రజలను తీవ్రంగా కలవరపెట్టింది. తాగుతున్న తాటికల్లులో ఎలుక మరణించి కనిపించింది. గౌడ్ లా ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ఈ కేంద్రంలో తాటికల్లు తాగిన నీరుకుళ్ళ గ్రామానికి చెందిన పలువురు అస్వస్థతకు గురయ్యారని స్థానికులు తెలిపారు. వాంతులు, తలనొప్పి, కడుపు నొప్పులతో బాధపడిన వారు చికిత్స కోసం స్థానిక ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చిందని సమాచారం. ప్రజల ఆరోగ్యాలతో బహిరంగంగా చెలగాటం ఆడినట్టేనని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరుకుళ్ళ గ్రామంలోని తాటివనంలో కల్లు విక్రయిస్తున్న గౌడ్ లు కనీస పరిశుభ్రత కూడా పాటించకుండా తాటికల్లును విక్రయిస్తున్నార ని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజూ వందల మంది వినియోగించే తాటికల్లును ఇలాంటి అపరిశుభ్ర పరిస్థితుల్లో ఉంచడం ఘోర నిర్లక్ష్యమని స్థానికులు మండిపడుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు చేయకపోవడం, ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం అని మండిపడుతున్నారు. నీరుకుళ్ళ గ్రామంలోని తాటికల్లు కేంద్రాలు ఇష్టారాజ్యంగా మారాయని విమర్శిస్తున్నారు. ఈగలు, ఎలుకలు పడిన కల్లు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్నారని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నీరుకుళ్ళ గ్రామంలోని తాటికల్లు విక్రయ కేంద్రాలపై క్రమం తప్పని తనిఖీలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# సోయా పంటను కొనుగోలు చేయండి

* ఆగ్రహించిన రైతులు కొనుగోలు చేయాలని రాస్తారోకో

**బోథ్, డిసెంబర్ 30(జనంసాక్షి) :** అయ్యా బాంచన్ మా సోయ,మొక్క జొన్న పంటను కొనుగోలు చేయాలని రైతులు మంగళవారం రహదారిపై బైఠాయించారు. దాదాపు రెండు గంటల పాటు రైతులు బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆరుంగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్లో అమ్ముకునేందుకు తీసుకొచ్చి నెలరోజులుగా కష్టాలు పడుతున్నామన్నారు. కోత దశలో భారీ వర్షాలు కురవడంతో పంట పూర్తిగా దెబ్బతిని గింజలు రంగు మారాయని, కొనుగోలు చేయకపోవడంతో గింజలు మరింత ముక్కిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.. స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ధర్నా విరమింప చేసే ప్రసక్తే లేదని ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సిఐ గురుస్వామి ఎస్ఐ శ్రీ సాయిలు రైతుల వద్దకు చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింప చేశారు. అనంతరం రహదారిపై వాహనాల రాకపోకలను ప్రారంభించారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

* మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాల పరిధిలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలిం చారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, వంటశాల, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తుంద న్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియ మించి నాణ్యమైన విద్య బోధన అందిస్తామన్నారు. అభివృద్ధి పనులలో భాగంగా చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకో వాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీలో పరిశుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పాఠశాలలోని వంటశాల, తరగతిగదులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మండలంలోని చిత్తాపూర్ లో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్య బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# ఇబ్బందుల్లేకుండా యూరియా పకడ్బందీ పంపిణీ

* అదనపు యూరియా అమ్మకాల కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
* జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్ ప్రతినిధి, డిసెంబర్ 30 (జనం సాక్షి):** జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియాను పకడ్బందీగా పంపిణీ చేయాలని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అదనపు యూరియా అమ్మకాల కేంద్రాల ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె. అనిల్ కుమార్‌లతో కలిసి వ్యవసాయ శాఖ అధికారులతో యూరియా పంపిణీపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులకు సకాలంలో అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు కొనుగోలు కేంద్రాల్లో నిత్యం స్టాక్‌ను తనిఖీ చేస్తూ, రైతుల అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో యూరియా సరఫరా చేయాలన్నారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలు, ఓడిఎస్సి, హెచ్‌వైడి సొసైటీలు, ప్రైవేటు రిటైల్ సెంటర్ల ద్వారా యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో అధికారులు ముందుకు సాగాలని సూచించారు. ఇప్పటికే అన్ని కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ జరుగుతోందని, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, సహకార శాఖల సమన్వయంతో ప్రత్యేక అధికారులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ మాట్లాడుతూ యూరియా పంపిణీలో పోలీస్ యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు సూచించబడిన రైతులను మాత్రమే క్రమబద్ధమైన క్యూ లైన్లలో పంపేలా ముందస్తు సమాచారం ఇవ్వాలని, తద్వారా ఎలాంటి అవాంతరాలు లేకుండా అమ్మకాలు సజావుగా కొనసాగుతాయని తెలిపారు. కేంద్రాల వద్ద టెంట్లు, త్రాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలని, యూరియా కృత్రిమ కొరతపై తప్పుడు ప్రచారాలు సృష్టించవద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో తొర్రూరు ఆర్‌డీఓ గణేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, డీఎస్పీ తిరుపతిరావు, ఏడీఏలు శ్రీనివాసరావు, మురళి, విజయ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్రంపేట మినీ మేడారం జాతర నిర్వహణకు టెండర్లు పూర్తి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మండలం గుర్రంపేట మినీ జాతర టెండర్లు మంగళవారం ఉత్సవ కమిటీ చైర్మన్ కొండపర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ మట్టేవాడ నవీన్, సర్పంచ్ కోడూరు రమేష్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షులు జీడి రాజు ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముఖ్యుల సమక్షంలో టెండర్లను నిర్వహించారు. అందులో కొబ్బరికాయలు అమ్ముటకు రూ. 66,000లు, బెల్లం రూ. 55000లు, పుట్నాలు రూ.3500లు, పుట్టు వెంట్రుకలు రూ.1,00,500లకు టెండర్ ల ద్వారా హక్కులను పొందారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది అవినాష్, సంతోష్, పూజారులు గాజా సమ్మయ్య, పెరుమల్ల సమ్మయ్య, కిష్టయ్య, రవికుమార్, సారయ్య, సురేష్, నర్సయ్య, దేవర పూజారులు గంటా మారి లక్మయ్య, సమ్మయ్య, సారయ్య, పంచాయతీ కార్యదర్శి సదానందం, డైరెక్టర్ లు మహేష్, సాంబయ్య, గ్రామ ఉప సర్పంచ్ దామరుప్పుల సుధాకర్, మార్క చీరాల గౌడ్, ముక్కర సాయిలు, పోరిక అమృనాయక్, గాజుల రమాదేవి, ఎలకపల్లి రమేష్, అగయ్య, సదయ్య, ఇమామ్ బాబా తదితరులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతల్లో జిల్లా పోలీసులు అద్భుత ప్రగతి

* వార్షిక రౌండప్ 2025..ఎస్పీ జానకీ షర్మిల

**నిర్మల్ బ్యూరో, డిసెంబర్30 (జనంసాక్షి) :** జిల్లాలో 2025 సంవత్సరానికి గాను శాంతి భద్రతలు, నేర నియంత్రణ, ప్రజా భద్రత చర్యల్లో సాధించిన ప్రగతిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల వెల్లడించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వార్షిక ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడుతూ, పండుగలు, ఎన్నికలు, జాతరలు ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్, అక్రమ పశువుల రవాణా, డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 2025లో 4162 నేరాలు నమోదు కాగా, తీవ్ర నేరాలపై ప్రత్యేక దృష్టితో నిందితులను వేగంగా అరెస్ట్ చేశామని చెప్పారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ?2.16 కోట్ల విలువైన 1806 మొబైల్ ఫోన్లు బాధితులకు తిరిగి అందించామని, 909 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి స్మార్ట్ పోలీసింగ్‌ను బలోపేతం చేశామని వివరించారు. గంజాయి సాగు 99 శాతం నిర్మూలనతో పాటు సైబర్ నేరాల్లో బాధితులకు రూ.30 లక్షలకు పైగా నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. వరదలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల తక్షణ స్పందనతో ప్రజలకు భద్రత కల్పించామని, 'పోలీస్ అక్క', శివంగి టీం, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. 2026లో కూడా ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ రాజేష్ మీన ఐపీఎస్, నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సదర్మాట్ బ్యారేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

* నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, డిసెంబర్30 (జనంసాక్షి) :** మిగిలి ఉన్న సదర్మాట్ బ్యారేజీ నిర్మాణ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మామడ మండలం పొన్కల్ గ్రామంలో నిర్మిస్తున్న సదర్మాట్ బ్యారేజీ నిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యారేజీ నిర్మాణ పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం దాదాపు పూర్తి అయిపోయిందని తెలిపారు. మిగిలి ఉన్న చిన్న చిన్న పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ బ్యారేజీ వినియోగంలోకి వస్తే దాదాపు 18 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. రైతులకు ఎంతో ఉపయోగకరం అని వివరించారు. ఆయకట్టు రైతులకు అధికారులు బ్యారేజీ నిర్మాణం, ఆయకట్టు వివరాలు మ్యాపుల ద్వారా వివరించారు. పలువురు స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ బ్యారేజీ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్, ఇంజనీరింగ్, నీటిపారుదల శాఖల అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక దోపిడీకి అడ్డే లేదా?

* ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ఇసుక దోపిడి మాఫియా
* అధికారుల నిర్లక్ష్యంతో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



**సారంగాపూర్, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక దోపిడి జోరుగా కొనసాగుతుంది.ఆలూరు, బీరవెల్లి, యాకర్పల్లి,కంకేట,వైకుంఠపూర్,చించోలి,గొడిసెర వెళ్ళే మార్గమధ్యలో ఉన్న శివారులోని స్వర్ణ వాగులో నుండి ఇసుకను రెవెన్యూ అధికారుల ద్వారా ఎటువంటి అనుమతి లేకుండా దర్జాగా ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుకను రవాణా చేస్తున్నారు. గ్రామ శివారులో ఇసుకను డబ్బులుగా చేసి ప్రజల ధనాన్ని దోపిడి చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. అధికారులు శ్రద్ధ చూపకపోవడం వల్ల ప్రజలు అధికారులపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనుమతులు తీసుకోకుండా ఇసుక దోపిడీ కొనసాగిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పలుమార్లు విన్నవించిన నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. ఇసుక మాఫియా రెచ్చిపోకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు వాపుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అంటూ పరిమితికి మించి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఇసుక మాఫియా ధనాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకొని ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాలని జనాలు అభిప్రాయపడుతున్నారు.

# మద్ది మేడారంలో బహిరంగ వేలం

**నల్లబెల్లి, డిసెంబర్ 30 (జనంసాక్షి):** నాగరాజు పల్లె గ్రామ శివారు మద్ది మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో దుకాణాల ఏర్పాటు కొరకు బహిరంగ వేలం పాటను ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ ప్రధాన పూజారి దురిశెట్టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ జనవరి 28, 29, 30వ తేదీలలో జరిగే మద్ది మేడారం జాతరలో దుకాణాల ఏర్పాటు కొరకు జనవరి రెండో తేదీన బహిరంగ వేలం పాటను పెడుతున్నామని తెలిపారు. జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలనుకునే వ్యాపారస్తులు ఈ వేలం పాటలో పాల్గొనాలని తెలియజేశారు.

# ఏదులాపురం మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తాం...

- రూ. 61 లక్షల అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీకారం
- 56 మందికి డబుల్ బెడ్ రూమ్ పట్టాల పంపిణీ

**ఖమ్మం రూరల్, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** ఏదులాపురం మున్సిపాలిటీని అన్ని హంగులతో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన (రోల్ మోడల్) పట్టణంగా తీర్చిదిద్దుతామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఏదులాపురంలో పర్యటించి సుమారు రూ. 61 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశారు.



### మౌలిక వసతులే లక్ష్యం

మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం చెరువు నాలాపై రూ. 20.25 లక్షలు, సాయి గణేష్ నగర్ ఎన్ఎస్పీ కాల్వపై రూ. 15.70 లక్షలతో నిర్మించనున్న కల్వర్టు పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం పోలేపల్లి డబుల్ బెడ్ రూం కాలనీలో రూ. 25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ప్రతి వీధినీ సిమెంటు రోడ్డుగా మారుస్తామని, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

### అర్హులైన పేదలకు 'ఇందిరమ్మ' గూడు

ప్రజా ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. "ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. ప్రతి సోమవారం లబ్ధిదారులు కట్టుకున్న ఇంటి దశను బట్టి నేరుగా నిధులు జమ చేస్తున్నాం" అని వివరించారు. రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం సరఫరా వంటి హామీలను అమలు చేశామని గుర్తుచేశారు. అనంతరం పోలేపల్లి డబుల్ బెడ్ రూంల లబ్ధిదారులు 56 మందికి మంత్రి ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో నర్సింహారావు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖ విస్తృత దాడులు



**దేవరకొండ, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** అక్రమంగా నల్ల బెల్లం, పట్టిక, గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని, ఎవరైనా అక్రమంగా వ్యాపారం చేస్తే పోలీసు వారికి తెలియపరచాలని దేవరకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.నూతన సంవత్సరం, డిసెంబర్ 31 వేడుకలో భాగంగా దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ ఎన్ఫోర్స్మెంట్ టీం, టాస్కోఫోర్స్ టీం, నరసరావుపేట టీం, మాచర్ల స్టేషన్ టీం లతో కలిసి దేవరకొండ స్టేషన్ టీం, టాస్కోఫోర్స్ టీం, ఎన్ఫోర్స్మెంట్ టీం అన్ని బృందాలు కలిసి చందంపేట మండలంలోని కృష్ణపట్టే ప్రాంతంలో నాటు సారాయి, బెల్లం అమ్మకాలపై మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు.ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. నాటు సారాయిపై, బెల్లం రవాణా, అమ్మకాలపై నిరంతరం నిఘా ఉంటుందని అన్ని టీమ్ లు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉంటాయని తెలిపారు. నాటు సారాయి తయారీ, నల్ల బెల్లం రవాణా అమ్మకాలపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు . ఏదైనా సమాచారం ఉంటే సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.

## వీధి కుక్కల బెడదకు నివారణ చర్యలు

**కొండమల్లేపల్లి, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** కొండమల్లేపల్లి గ్రామపంచాయతీలో ప్రజలకు వ్యాపారస్తులకు విద్యార్థులకు ఎదురవుతున్న వీధి కుక్కల నివారణ చర్యలు చేపట్టామని ఏడవ వార్డు సభ్యులు నజీర్ మౌలానా ఖాస్మి అన్నారు. గ్రామ సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి ఆదేశాలతో మంగళవారం ఏడవ వార్డులో సుమారు 100 కుక్కలను జంతు సంక్షేమ సంస్థల సహకారంతో ఇతర ప్రదేశాలకు తరలించమన్నారు. ఈ సందర్భంగా ఏడవ వార్డు సభ్యులు నజీర్ మౌలానా ఖాస్మి మాట్లాడుతూ ఏడో వార్డులో ప్రజలకు కావలసినన్ని సౌకర్యాలను నెరవేరుస్తామని ఏడో వార్డులో ఉన్న అంతర్గత డ్రైనేజీ, నూతన విద్యుత్ స్తంభాలు, సిసి రోడ్లపై వీధిలైట్లపై దృష్టి పెట్టామన్నారు. త్వరలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని ఏడో వార్డును సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రచిస్తున్నామన్నారు. ఏడో వార్డును ప్రజల సూచనలు సలహాలతో మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తానన్నారు. పెంపుడు కుక్కలపై జాగ్రత్తగా ఉండాలని పెంపుడు కుక్కలను వీధుల వెంట వదిలేస్తే చర్యలు తప్ప ఉన్నారు. పెంపుడు కుక్కల యజమానులు తమ పెంపుడు కుక్కలను రెబీస్ టీకాలతో పాటు ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలన్నారు.



## వైభవంగా ముక్కోటి ఏకాదశి



**మల్కాజిగిరి, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** ఆనంద్‌బాగ్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుండే ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు భారీగా క్యూలైన్లలో వేచి ఉన్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి మూడు గంటల సమయం పట్టింది. స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలను తిలకించేందుకు భక్తులు పోటీ పడ్డారు.ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మారుమోగిపోయింది. భక్తుల రాకతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రవీందర్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వయోవృద్ధులకు, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ దర్శన ఏర్పాట్లు సాఫీగా సాగేలా పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు, తులసి రమణాచార్యులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** ఈ సంవత్సరం ఖరీఫ్ ధాన్యం సేకరణలో భాగంగా సూర్యాపేట జిల్లాలో 62887 మంది రైతుల నుండి 327579.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ 2025-26 ఖరీఫ్ సీజన్ లో ధాన్యం సేకరణకు గాను జిల్లా వ్యాప్తంగా ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మెప్మా, ఎఫ్పీఓల ఆధ్వర్యంలో 348 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 62887 మంది రైతుల ద్వారా 227320.560 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 100258.720 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం మొత్తం కలిపి 327579.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.ఇందుకుగాను రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కింద 782.59 కోట్ల రూపాయలను చెల్లించడం జరిగిందని, బోనస్ కింద మరో 113.65 కోట్ల రూపాయలు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు.జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేసినందుకు గాను సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది,ఎస్ హెచ్ జీ,మెప్మా,పిఏసిఎస్ సిబ్బందిని అభినందించారు.



## యూరియా కొరత లేదు



**బోనకల్, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** ప్రస్తుతం యాసంగి సీజన్లో మధిర డివిజన్లో మొక్కజొన్న పంట అధికంగా సుమారు 73000 ఎకరాల్లో, 26 వేల ఎకరాల్లో వరి పండిస్తున్నారు అని మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్ విజయ్ చంద్ర , మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్ కుమార్ తో కలిసి మాట్లాడుతూ అన్నారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన యూరియా ఎప్పటికప్పుడు సొసైటీల ద్వారా ప్రైవేట్ డీలర్స్ ద్వారా సరఫరా చేయటం జరుగుతుంది. జిల్లాలో యూరియా నిల్వలు సరిపడినంత ఉన్నాయి. ఎప్పటికప్పుడు అవసరాన్ని బట్టి సొసైటీలకు మరియు ప్రైవేటు డీలర్స్ కు జిల్లా వ్యవసాయ అధికారి , జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సరఫరా చేస్తున్నారు. కాబట్టి రైతులు ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైతులు సిఫారసు చేసినంత యూరియా మాత్రమే వాడవలెను. అధికంగా యూరియా వాడిన వాడటం వలన ఎన్నో దుష్ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా భూ కాలుష్యం, వాతావరణ కాలుష్యం పెరిగి అలాగే పంటలకు రోగాలు అధికంగా వచ్చి రైతులకు సాగు ఖర్చు పెరిగే అవకాశం ఉంది కాబట్టి సిఫారసు చేసిన మోతాదు మాత్రమే యూరియాని పంటలకు వాడాలని సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ మహిళల పక్షపాతి ప్రభుత్వం

**తలకొండపల్లి, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ,మహిళ పక్షపాతిగా నిలుస్తుందని వీరన్న పల్లి గ్రామ సర్పంచ్ కడారి రామకృష్ణ యాదవ్ అన్నారు.మంగళవారం తలకొండపల్లి మండలం వీరన్నపల్లి గ్రామంలో నాయకులతో కలిసి డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీన్నాల వెంకటయ్య,మాజీ సర్పంచ్ గుడ్రాతి లింగం గౌడ్,వార్డు సభ్యులు మిన్నాల ఇదమయ్య,బెక్కరి రామకృష్ణారెడ్డి,ఇందిరమ్మ కమిటీ మెంబర్ కడారి లక్ష్మణ్ యాదవ్,గ్రామ కార్యదర్శి డి.వినోద్ కుమార్, నరసింహా, యాదయ్య తదితరులు ఉన్నారు.




# పని ప్రదేశాల్లో మహిళల రక్షణే ధ్యేయం

- అడిషనల్ కలెక్టర్ కె.సీతారామారావు

**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** స్త్రీలు పని చేసే ప్రదేశాల్లో గౌరవించడం మన సంప్రదాయమని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అన్నారు.మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టంపై జరిగిన అవగాహన, శిక్షణ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.పని చేసే చోట మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం, వారి గౌరవానికి భంగం కలగకుండా చూడటం ప్రతి సంస్థ బాధ్యత అని అన్నారు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న మహిళలు తమ హక్కుల పట్ల, చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.10 మంది కంటే ఎక్కువ సిబ్బంది ఉన్న ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలు ఏదైనా వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని కోరారు.2013 చట్టం ప్రకారం వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, మహిళలకు పని ప్రదేశాల్లో ఆత్మగౌరవంతో కూడిన వాతావరణాన్ని అందించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశమని వివరించారు.తదుపరి పోక్స్ యాక్ట్ -2013 చట్టం కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఈవో శిరీష మాట్లాడుతూ మహిళ ఉద్యోగుల పట్ల గౌరవంగా ఉండాలని మహిళలను తక్కువగా, చులకనగా చూడటం, సైగలు చేయటం, అసభ్యకరంగా తాకటం, సెల్ ఫోన్ లో అసభ్య మేసెజ్ లు పంపిస్తే ఇబ్బంది పడకుండా మానసికంగా లోపల కుమిలిపోకుండా ధైర్యంగా కమిటీ ముందుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఆ ఫిర్యాదులను స్వీకరించి రహస్యంగా దర్యాప్తు జరిపించి బాధితులకు న్యాయం చేయటం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, కమిటీ సభ్యులు దయానంద రాణి, శంకర్ నాయక్, జిల్లా ట్రెజరరీ అధికారి రవికుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, టీఎన్జీవోస్ జనరల్ సెక్రటరీ దున్న శ్యామ్,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అక్షాంశ్ యాదవ్



**భువనగిరి, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీగా అక్షాంశ్ యాదవ్ మంగళవారం భాద్యతలు స్వీకరించారు. ఇన్ని రోజులు రాచకొండ కమీషనరేట్ పరిధిలో ఉన్న యాదాద్రి భువనగిరి జోన్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా యాదాద్రి భువనగిరి జిల్లాగా ఏర్పాటు అయింది. ఈ మేరకు ఇప్పటి వరకు డీసీపీగా భాద్యతలు నిర్వర్తించిన అక్షాంశ్ యాదవ్ ఎస్పీగా భాద్యతలను స్వీకరించారు.

## ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి



**దమ్మపేట, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** దమ్మపేట మండల ప్రజలకు ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని మద్యం డ్రగ్స్ నిషేధిత మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడుపుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకొన పడతాయని,బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తూ పట్టుపడితే కేసు నమోదు చేస్తామని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే పనిచేస్తు నమోదు చేస్తామని నూతన సంవత్సర వేడుకలు ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు.

## హద్దు మీరితే కఠిన చర్యలు



**బోనకల్, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** బోనకల్ మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకొను వారికి బోనకల్ ఎస్ఐ వదిన వెంకన్న పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డీజే సిస్టంకు ఎలాంటి అనుమతులు లేవు కావున డీజే యజమానులు గమనించాలన్నారు. మండలంలోని కొంతమంది ప్రజలు గ్రామపంచాయతీ ఎలక్షన్స్ నుండి ఇంకా బయటకు రాలేదు కాబట్టి ఈ వేడుకల సందర్భంగా ఏమైనా చిన్న చిన్న గొడవలు జరిగి గ్రూపుల మధ్య తగాదాలుగా మారితే వాళ్లతో పాటు ఆ కార్యక్రమం ఎవరైతే ఏర్పాటు చేశారో వాళ్లపై ఖచ్చితంగా కేసులు నమోదు చేయబడతాయి అని అన్నారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మండల పరిధిలో స్థానిక పోలీసులతో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకల పేరుతో జరిగే కార్యక్రమాల వల్ల పరిసర ప్రాంతాల్లోని ఇండ్లవారికి ఇబ్బందులు కలగకుడదు, అలాగే వేడుకల్లో మత్తు పదార్థాల వినియోగించడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, ప్రధానంగా ఈ వేడుకల వేళ యువకలు మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కితే జరిమానతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని అన్నారు. అలాగే వేగంగా వాహనాలు నడపడం, రోడ్లపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురిచేసే వ్యవహరిస్తే సదరు వాహనదారులకు చట్టపరమైన తిప్పలు తప్పవని, సమస్యలు రాకుండా స్థానిక పోలీసుల అధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లోను ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని, అలాగే ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోబడతాయన్నారు.పై అంక్షలను ఎవరైన అతిక్రమించిన, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలని బోనకల్ ఎస్సై మండల ప్రజలకు సూచించారు.

## కూచిపూడి నృత్యకళలో జి. లక్ష్మీకీర్తనకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు




**భువనగిరి, డిసెంబర్ 30 (జనం సాక్షి) :** గచ్చిబౌలి స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య కళా వైభవంలో జరిగిన కార్యక్రమంలో కూచిపూడి నృత్య కళా కార్యక్రమంలో స్థానిక జీనియస్ పాఠశాలకు చెందిన జి లక్ష్మి కీర్తన 5వ తరగతి పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బి. స్వర్ణలత మాట్లాడుతూ పాఠశాల విద్యార్థిని కూచిపూడి నృత్యంలో అద్భుతమైన ప్రదర్శన ప్రదర్శించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థినికి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి. సూర్యనారాయణ రెడ్డి నిర్వాహకులు అందజేసిన జ్ఞాపికను మరియు ప్రశంస పత్రమును అందజేసి అభినందించారు. అదేవిధంగా చైర్మన్ పడాల శ్రీనివాస్ డైరెక్టర్ తోట శ్రీధర్ , వైస్ ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్, ఏవో జి. రవి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎంపీపీఎస్ మణికొండ పాఠశాలకు ఐడిబిఐ బ్యాంక్ సహకారం




**రాజేంద్రనగర్, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐడిబిఐ బ్యాంకు చేసిన సహకారం మరువలేనిదని మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీపీఎస్ మణికొండ వీకర్ సెక్షన్ గ్రూప్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడిబిఐ బ్యాంక్ వారు పాఠశాలకు రూ.1 లక్ష విలువైన కంప్యూటర్ టేబుల్స్, లైబ్రరీ ర్యాక్స్5, ఆఫీస్ టేబుల్స్ 6, ఆఫీస్ చెయర్స్ 3 అందజేశారు. ఈ సదుపాయాలతో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి తదితరులు హాజరై విద్యార్థులకు సూచనలు చేశారు. ఐడిబిఐ బ్యాంక్ ప్రాంతీయ కో-ఆర్డినేటర్ విశ్వనాథ్ ప్రభు, బ్యాంక్ మేనేజర్ జయకుమార్, అఖిలేష్, జై సింగ్ పాల్గొన్నారు.




# గ్రే మార్కెట్ ఉచ్చులో పడొద్దు

## 2025లో మదుపర్ల సంపద రూ.30 లక్షల కోట్లు పైకి

**ఢిల్లీ:** విదేశీ మదుపర్ల అమ్మకాలు, టారిఫ్‌ల ఒత్తిడులు, రూపాయి పతనం వంటి ప్రతికూలతల నడుమ దలాల్ స్ట్రీట్ మదుపర్ల నమ్మకాన్ని నిలబెట్టుకుంది. 2025 క్యాలెండర్ సంవత్సరంలో బీఎస్‌ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ 8 శాతం పెరిగి మదుపర్లకు రూ.30.20 లక్షల కోట్ల ప్రతిఫలాన్ని అందించింది. దేశీయ స్థూల ఆర్థిక పరిస్థితులు, దేశీయ మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో ఇది సాధ్యమైందని అనలిస్టులు పేర్కొంటున్నారు.2025లో డిసెంబర్ 29 వరకు బీఎస్‌ఈ సెన్సెక్స్ 8.39 శాతం వృద్ధితో 6,556.53 పాయింట్లు పెరిగింది. డిసెంబర్ 1న అత్యధికంగా 86,159.02 పాయింట్ల వద్ద ఆల్‌టైమ్ రికార్డు గరిష్ఠాలను అందుకుంది. డిసెంబర్ 29 వరకు బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ డిసెంబర్ 29 వరకు బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.30 లక్షల కోట్లు (రూ.30,20,376.68) పెరిగి రూ.472 లక్షల కోట్లకు చేరింది. గతేడాది ఏప్రిల్‌లో తొలిసారి బీఈఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.400 లక్షల కోట్ల మార్కును చేరుకుంది.2024లో సెన్సెక్స్ 8.16 శాతం వృద్ధితో 5,898.75 పాయింట్లు పెరిగింది. ఆ ఏడాది బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.77.66 లక్షల కోట్లు వృద్ధి చెందింది.2023లో బీఈఎస్‌ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.81.90 లక్షల కోట్లు వృద్ధి నమోదైంది.రైల్వే టైమ్ టేబుల్ ఏనీ క్రెడిట్ స్కోరు.. జనవరి నుంచి కీలక మార్పులు2025లో దేశీయ ఈక్విటీ మార్కెట్‌ల నుంచి సుమారు రూ.1.6 లక్షల కోట్లను విదేశీ మదుపర్లు తరలించారు.

## మార్కెట్‌లో లిస్ట్ కాకముందే కోటీశ్వరులు కావొచ్చా?

**అన్‌లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం అనేది ప్రస్తుతం ఇన్వెస్టర్లలో బాగా ప్రాచుర్యం పొందుతున్న అంశం. స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కాకముందే తక్కువ ధరకు ఈ కంపెనీల షేర్లు కొని, ఐపీఓ ద్వారా మార్కెట్‌లో లిస్ట్ అయిన తర్వాత అధిక లాభాలు సంపాదించవచ్చని చాలా మంది భావిస్తున్నారు. అయితే, మెరిసేదంతా బంగారం కాదని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల సెబీ సైతం అన్‌రెగ్యులేటెడ్ ప్లాట్‌ఫామ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తుండటంతో అన్‌లిస్టెడ్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేముందు కొన్ని కీలక విషయాలను తెలుసుకోవడం అత్యవసరం.అన్‌లిస్టెడ్ షేర్లు సాధారణంగా అధికారిక స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లభించవు. వీటిని 'గ్రే మార్కెట్' లేదా కొన్ని ప్రైవేట్ యాప్స్ ద్వారా విక్రయిస్తుంటారు. అయితే, వీటిలో ధరను పారదర్శకంగా నిర్ణయించరనే వాదనలున్నాయి. ఒక యాప్‌లో ఒక ధర ఉంటే, మరో చోట మరో ధర ఉండే అవకాశం ఉంది. సెబీ ఇప్పటికే ఇలాంటి అనధికారిక ప్లాట్‌ఫామ్‌ల పట్ల ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.**



**అయితే అన్‌లిస్టెడ్ కంపెనీల్లో ఎంత లాభం ఉందో అంతే రిస్క్ కూడా ఉందని గమనించాలి.**

**న్యూఢిల్లీ:**స్టాక్ ఎక్స్ఛేంజీలు లో నమోదు కాని కంపెనీలను అన్‌లిస్టెడ్ కంపెనీలు అంటారు. ఇవి సాధారణంగా స్టార్టప్‌లు కావచ్చు లేదా పబ్లిక్ ఇష్యూకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న పెద్ద కంపెనీలు కావచ్చు. వీటి షేర్లను 'ప్రీ-ఐపీఓ షేర్లు' అని కూడా అంటారు.

ఎలా పెట్టుబడి పెడుతారంటే..

అన్‌లిస్టెడ్ మార్కెట్‌లో షేర్లు కొనడానికి నేరుగా స్టాక్ ఎక్స్ఛేంజీలు ఉండవు. దీనికోసం కొన్ని మార్గాలను అనుసరిస్తారు. ప్రస్తుతం అన్‌లిస్టెడ్ షేర్ల ట్రేడింగ్ కోసం ఖతీవఞతిబవ, జనిశ్రీతిబబివటజినీనివ, ంశ్రీబితిబీబ ఎనిలవబబివఞష్ట్ర.. వంటి చాలా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులో ఉన్నాయి. కొంతమంది స్టాక్ బ్రోకర్లు పర్సనలైజ్డ్ సర్వీసుల ద్వారా అన్‌లిస్టెడ్ షేర్లను విక్రయిస్తుంటారు. ఇంకో మార్గం ఏమిటంటే..

కంపెనీ ఉద్యోగులు తమకు వచ్చిన షేర్లను బయటి వ్యక్తులకు విక్రయించినప్పుడు వాటిని కొనుగోలు చేయవచ్చు.

ఇన్వెస్ట్ చేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

లిస్టెడ్ షేర్లను మనం ఎప్పుడు కావాలంటే అప్పుడు ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకోవచ్చు. కానీ అన్‌లిస్టెడ్ షేర్లకు కొనుగోలుదారులు దొరకడం కష్టం. మీరు అత్యవసరంగా అమ్మాలనుకున్నప్పుడు అవి అమ్ముడుపోకపోవచ్చు.లిస్టెడ్ కంపెనీల వలె ఇవి ప్రతి త్రైమాసిక ఫలితాలను వెల్లడించాల్సిన అవసరం లేదు. కాబట్టి కంపెనీ ఫైనాన్షియల్ వివరాలు తెలుసుకోవడం కష్టమవుతుంది.సెబీ నిబంధనల ప్రకారం, ఒక కంపెనీ ఐపీఓకి వచ్చిన తర్వాత, అంతకుముందు కొన్న అన్‌లిస్టెడ్ షేర్లపై 6 నెలల వరకు లాక్-ఇన్ పీరియడ్ ఉంటుంది. అంటే లిస్ట్ అయిన వెంటనే మీరు వాటిని అమ్మలేరు.ఈ షేర్ల ధర డిమాండ్, సప్లై ఆధారంగా మారుతుంటుంది. అధికారిక ధర అంటూ ఏదీ ఉండదు కాబట్టి ఇతర ప్లాట్‌ఫామ్‌లతో ధరను సరిపోల్చుకోవాలి.

లిస్టింగ్ అయ్యే విధానం

అన్‌లిస్టెడ్ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ అవ్వాలంటే సుదీర్ఘ ప్రక్రియను అనుసరించాలి. కంపెనీ ముందుగా ఐపీఓ ప్రక్రియను పర్యవేక్షించడానికి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లను నియమించుకుంటుంది. కంపెనీ తన పూర్తి వివరాలతో కూడిన డీఆర్‌హెచ్‌పీను సెబీకి సమర్పిస్తుంది. సెబీ ఈ నివేదికను పరిశీలించి అన్నీ బాగున్నాయని భావిస్తే అనుమతి ఇస్తుంది. కంపెనీ తన షేర్ ధరను నిర్ణయించి పబ్లిక్ ఇష్యూ తేదీలను ప్రకటిస్తుంది. ఐపీఓ సక్సెస్ అయ్యాక షేర్లు ఎక్స్ఛేంజీల్లో ట్రేడింగ్‌కు అందుబాటులోకి వస్తాయి. దాంతో అన్‌లిస్టెడ్‌గా ఉన్న షేర్లు లిస్టెడ్ కేటగిరీలోకి మారతాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.50 | ₹ 6.52 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,24,850 (22 క్యారెట్లు) | ₹ 1,36,200 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,58,000

## మీరు బిజినెస్‌లో కింగ్ అవ్వాలంటే..



వ్యాపారం అంటే కేవలం పెట్టుబడి, అమ్మకాలు మాత్రమే అనుకుంటే పొరపాటే! ప్రస్తుత కాలంలో మారుతున్న అంతర్జాతీయ ఆర్థిక సమీకరణాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో బిజినెస్ రూపురేఖలే మారిపోయాయి.చాలా మంది పాత పద్ధతులతో నష్టపోతుంటే, కొందరు మాత్రం టెక్నాలజీని వాడుకుంటూ కోట్ల రూపాయల లాభాలు గడిస్తున్నారు. ఇంతకీ ఆ సక్సెస్ మంత్ర ఏమిటో తెలుసుకోవాలని అందరికీ కుతూహలంగా ఉంటుంది. వ్యాపారం చేసే ప్రతి వ్యక్తి కచ్చితంగా తెలుసుకోవాల్సిన ఐదు వ్యూహాలను కింద తెలియజేశాం.

ఆర్థిక నిర్వహణ

వ్యాపారానికి క్యాష్ ఫ్లో, ఆర్థిక నిర్వహణ చాలా కీలకం. 2025లో గ్లోబల్ ఇన్‌ఫ్లేషన్ 3% వద్ద స్థిరపడినప్పటికీ అంతర్జాతీయ టారిఫ్‌లు, సప్లై చైన్ సమస్యల వల్ల ముడిసరుకుల ధరలలో అనిశ్చితి కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం సేల్స్ పెంచుకోవడం మీద కాకుండా, ప్రాఫిట్ మార్జిన్లపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా 'ప్రాఫిట్ ఫస్ట్' పద్ధతిని అనుసరించడం ద్వారా ఆదాయం రాగానే లాభం, పన్నులు, వేతనాలను పక్కన పెట్టి, మిగిలిన మొత్తంతోనే ఖర్చులను నిర్వహించాలి. మార్కెట్‌లోని కొన్ని సాఫ్ట్‌వేర్‌లు ఇప్పుడు ఏఐ ఆధారిత అనలిటిక్స్‌ను అందిస్తున్నాయి. ఇవి భవిష్యత్తులో రాబోయే ఖర్చులను ముందే అంచనా వేసి, ఖర్చులను 20-30% తగ్గించడంలో సహాయపడుతున్నాయి.

కస్టమర్ ఫోకస్

కస్టమర్ అక్విజిషన్ కాస్ట్‌భారీగా పెరిగింది. అందుకే ఉన్న కస్టమర్లను నిలబెట్టుకోవడమే అత్యంత లాభదాయకమైన మార్గం. 80 శాతానికిపైగా చిన్న వ్యాపారాలు ఇప్పుడు జనరేటివ్ ఏఐను వాడుతూ కస్టమర్లకు ప్రత్యేక అనుభవాన్ని అందిస్తున్నాయి. వ్యాపారులు కస్టమర్ డేటాను విశ్లేషించి, వారి అవసరాలకు తగినట్లుగా లాయల్టీ ప్రోగ్రామ్‌లు రూపొందించడం వల్ల రిపీట్ సేల్స్ పెరుగుతాయి. తాజా సర్వేల ప్రకారం, కస్టమర్ రిటెన్షన్ రేటు(అధిక మార్జిన్లు వచ్చే వస్తువులను కొనేలా చేయడం) 5% పెరిగితే, ప్రాఫిట్ మార్జిన్లు 25% నుంచి 29% వరకు మెరుగుపడే అవకాశం ఉంది.

ఖర్చుల నియంత్రణ

ఖర్చు తగ్గించడం అంటే నాణ్యతను తగ్గించడం కాదు, వనరులను సమర్థవంతంగా వాడటం అని గుర్తుంచుకోవాలి. ఇంధన ధరలు, కార్మిక వ్యయాలు పెరిగిన తరుణంలో ఆటోమేషన్ ఒక వరంగా మారింది. క్లౌడ్ ఆధారిత టూల్స్, ఎనర్జీ-ఎఫిషియంట్ పరికరాలను వాడటం ద్వారా ఖర్చులను తగ్గించవచ్చు. టెక్నాలజీ సాయంతో తక్కువ సిబ్బందితో ఎక్కువ అవుట్‌పుట్ సాధించేలా ఆపరేషన్లను ఆప్టిమైజ్ చేయాలి. దీనివల్ల ఇన్‌ఫ్లేషన్, టారిఫ్‌ల ప్రభావం వ్యాపారంపై తక్కువగా ఉంటుంది.

డిజిటల్ పరివర్తన

'ఏఐ వ్యాపారాలను భర్తీ చేయదు కానీ, ఏఐని వాడే వ్యాపారస్తులు దాన్ని వాడని వారిని వెనక్కి నెట్టేస్తారు' అనేది నిజం. ప్రపంచవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయలపై 400 బిలియన్ డాలర్ల పెట్టుబడులు జరుగుతున్న తరుణంలో దీన్ని విస్మరించడం అసాధ్యం. ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్(వస్తు నిర్వహణ)లో ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వాడటం ద్వారా స్టాక్ వృధాను అరికట్టవచ్చు. ఆటోమేటెడ్ ఇన్వాయిసింగ్(ఆటోమేటెడ్ బిల్లింగ్ విధానం) ద్వారా పేమెంట్స్ త్వరగా వచ్చేలా చూడవచ్చు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సైతం ఏఐ బాట్‌లను వాడి 24/7 కస్టమర్ సపోర్ట్ అందించడం ద్వారా గ్లోబల్ మార్కెట్‌లో పోటీ పడుతున్నాయి.

మార్కెట్ ట్రెండ్స్

మార్కెట్ మారుతున్న వేగానికి అనుగుణంగా వ్యాపార సరళి మారకపోతే ఎంతటి పెద్ద బిజినెస్ అయినా కుప్పకూలుతుంది. పర్యావరణ హితమైన పద్ధతులు పాటిస్తున్న బిజినెస్‌ల పట్ల కస్టమర్లు మక్కువ చూపుతున్నారు.

# పొంచిఉన్న లేఆఫ్స్

## ఈ యేడాది టెక్ కంపెనీల ఉద్యోగుల్లో కలవరం
## ఏఐ రాకతో మారుతున్న ముఖచిత్రం

**న్యూఢిల్లీ:**భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ రంగంలో లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. ఒకవైపు కృత్రిమ మేధ(ఏఐ) కొత్త పుంతలు తొక్కుతుంటే, మరోవైపు అదే వేగంతో ఉద్యోగాల కోత పెరుగుతోంది.ప్రముఖ లేఆఫ్స్ ట్రాకర్ 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 551 టెక్ కంపెనీల నుంచి 1,22,549 మందికి పైగా ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయారు. గత కొన్ని వారాలుగా ఈ వేగం కొద్దిగా తగ్గినట్లు కనిపిస్తున్నా, ప్రభావం మాత్రం తీవ్రంగా ఉంది.


**ప్రముఖ కంపెనీలు ఇలా..**


అమెజాన్.. అక్టోబర్‌లో కంపెనీ చరిత్రలోనే ఎప్పుడూ లేనంతగా అత్యధికంగా ఉద్యోగాల కోత విధిస్తూ 14,000 కొలువులను తొలగించింది.మైక్రోసాఫ్ట్.. 2025 నాటికి మొత్తం 15,000 మందిని తొలగించే దిశగా అడుగులు వేసింది. జులైలోనే దాదాపు 9,000 మందిని పంపించివేసింది.ఇంటెల్.. చిప్ తయారీలో వెనుకబడటం, ఆర్థిక నష్టాల నేపథ్యంలో ఏకంగా మొత్తం సిబ్బందిలో 15% (సుమారు 25,000 మంది) తగ్గించుకోవాలని నిర్ణయించుకుంది.

సేల్స్ ఫోర్స్.. ఏఐ సహాయంతో 4,000 మంది కస్టమర్ సపోర్ట్ ఉద్యోగులను తగ్గించినట్లు సీఈఓ మార్క్ బెనియోఫ్ ధ్రువీకరించారు.టీసీఎస్.. భారత్‌లో దాదాపు 12,000 మందిని (మొత్తం ఉద్యోగుల్లో 2%) తొలగించి ఐటీ రంగంలో ఆందోళన కలిగించింది. అయితే ఇది ఏఐ వల్ల కాదని, నైపుణ్యాల అసమతుల్యత వల్లేనని సంస్థ స్పష్టం చేసింది. మెటా (600 మంది), గూగుల్ (100+), వెరిజోన్ (13,000), హెచ్‌పీ (4,000-6,000 మంది) వంటి సంస్థలు కూడా లేఆఫ్స్ ఇచ్చాయి.

**లేఆఫ్స్‌కు దారితీసిన కారణాలు**

చాలా కంపెనీలు ఇప్పుడు 'ఏఐ ఫస్ట్' విధానాన్ని అనుసరిస్తున్నాయి. గతంలో వందలాది మంది చేసే పనులను (డేటా ఎంట్రీ, కస్టమర్ సపోర్ట్, బేసిక్ కోడింగ్..) ఇప్పుడు ఏఐ టూల్స్ తక్కువ ఖర్చుతో వేగంగా చేస్తున్నాయి. కంపెనీలు తమ బడ్జెట్‌ను మానవ వనరుల నుంచి ఏఐ మౌలిక సదుపాయాల వైపు మళ్లిస్తున్నాయి.ద్రవ్యోల్బణం పెరగడం, సుంకాల భారం పెరగడంతో కంపెనీల నిర్వహణ ఖర్చులు పెరిగాయి. ఇన్వెస్టర్ల నుంచి ఒత్తిడి పెరగడంతో తక్కువ మంది ఉద్యోగులతో ఎక్కువ ఉత్పాదకత సాధించడంపై యాజమాన్యాలు దృష్టి పెట్టాయి.కరోనా సమయంలో డిజిటల్ సేవల కోసం డిమాండ్ పెరగడంతో టెక్ కంపెనీలు భారీగా నియామకాలు చేపట్టాయి. ఇప్పుడు డిమాండ్ సాధారణ స్థితికి రావడంతో అవసరానికి మించి ఉన్న సిబ్బందిని తొలగిస్తున్నాయి.పాత ప్రాజెక్టులను మూసివేసి కేవలం క్లౌడ్, సెక్యూరిటీ, జనరేటివ్ ఏఐ వంటి భవిష్యత్తు అవసరాల మీదనే కంపెనీలు పెట్టుబడి పెడుతున్నాయి. దీనివల్ల పాత నైపుణ్యాలు కలిగిన వారు ఉద్యోగాలు కోల్పోతున్నారు.టెక్ రంగం ప్రస్తుతం ఒక పరివర్తన దశలో ఉంది. ఉద్యోగాల కోత ఆందోళన కలిగించే విషయమే అయినా ఏఐ రంగంలో కొత్త రకమైన ఉద్యోగ అవకాశాలు కూడా పుట్టుకొస్తున్నాయి. సిబ్బంది తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవడమే ప్రస్తుత సంక్షోభం నుంచి గట్టెక్కే మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.





## యెమెన్‌లోని ముకల్లాపై సౌదీ వైమానిక దాడులు

సనా: యెమెన్‌లోని ఓడరేవు నగరం ముకల్లాపై సౌదీ అరేబియా వైమానిక దాడులు జరిపింది. మంగళవారం జరిపిన ఈ దాడులపై గల్ఫ్ వార్తాసంస్థలు కథనాలను ప్రచురించాయి.యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్(యూఏఈ)కి వ్యతిరేకంగా వేర్పాటువాద సమూహానికి ఆయుధాలు, సైనిక వాహనాలను అందజేస్తున్నారనే ఆరోపణలపై ఈ దాడులు జరిపినట్లు సౌదీ అరేబియా అధికారిక వార్తాసంస్థ స్పష్టం చేసింది.వేర్పాటు వాదుల చేతికి ఆయుధాలు చిక్కడం ఈ ప్రాంతంలో శాంతికి ముప్పుగా పేర్కొంది. అందుకే వైమానిక దళం నిర్ణీత లక్ష్యాలపై దాడులు జరిపిందని, పౌరులకు ఎలాంటి హాని జరగకుండా జాగ్రత్తలు తీసుకుందని వెల్లడించింది.ఈ దాడులపై అటు యెమెన్ సీరియస్‌గా స్పందించింది. యూఏఈతో ఉన్న రక్షణ ఒప్పందాన్ని తక్షణం రద్దు చేసింది. తమ సార్వభౌమాధికారం, దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు యెమెన్ కౌన్సిల్ అధిపతి రషాద్ అల్-అలీమి ప్రకటించారు. ఈ మేరకు ఆయన జాతినుద్దేశించి టీవీలో మాట్లాడారు. యెమెన్‌లో ఉన్న యూఏఈ దళాలు(అల్-అలీమా) తమ భూభాగాన్ని 24 గంటల్లో విడిచి వెళ్లాలని ఆదేశించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు మూడ్రోజులపాటు నోఫ్లై జోన్‌గా ప్రకటించారు. 90 రోజుల అత్యయిక స్థితిని ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆయుధంగా నదీ జలాలు!

### భారత్‌పై పాక్ సెనేటర్ వ్యాఖ్యలు

ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు నదీ జలాలను ఆయుధంగా మార్చుకోవడం వల్ల మరింతగా పెచ్చరిల్లు తాయని పాకిస్తాన్ సెనేటర్ షెర్రీ రెహ్మాన్ వ్యాఖ్యానించారు.పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ సెనేటర్ అయిన షెర్రీ రెహ్మాన్.. చీనాబ్ నదిపై జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిన వేళ పైవిధంగా వ్యాఖ్యా నించారు. భారత్ నిర్ణయం సింధూ జలాల ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు.వాతావరణ మార్పుల కారణంగా అత్యంత ప్రభావితమవుతున్న ఈ ప్రాంతంలో, నీటిని ఒక ఆయుధంగా మార్చుకోవడం ఏమాత్రం సమంధనీయం కాదు, ఆమోదయోగ్యం కాదు. ఇప్పటికే శత్రుత్వం, అపనమ్మకంతో నిండిపోయి ఉన్న రెండు దేశాల సంబంధాల్లో ఇది ఉద్రిక్తతలను మరింతగా పెంచుతుంది' అని షెర్రీ రెహ్మాన్ సోమవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల పైశాచిక దాడి నేపథ్యంలో సింధూ నదీ జలాల ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లు భారత ప్రభుత్వం ఏప్రిల్ 22న ప్రకటించడం తెల్సిందే. కశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో చీనాబ్ నదిపై 260 మెగావాట్ల దుల్హస్తి స్టేజీ-2 జల విద్యుత్ ప్రాజెక్టుకు భారత ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది.



## రోజుకు 25 గంటలు..ఎందుకో తెలుసా?

**న్యూఢిల్లీ:**రోజుకు ఎన్ని గంటలు అనగానే ఠక్కున వచ్చే సమాధానం 24 గంటలు. అయితే ఈ రోజుకు 24 గంటల రోజు నెమ్మదిగా మారుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ మార్పు నిజం.కచ్చితంగా.. ఇప్పటికే జరుగుతోంది. ఈ మార్పు చాలా క్రమంగా జరుగుతుందని పరిశోధకులు నొక్కి చెబుతున్నారు. భూమి భ్రమణం నెమ్మదిగా నెమ్మదిస్తోందని శాస్త్రవేత్తల మాట. అంటే రోజు ఎక్కువుతోంది. కాలం, జీవితం , గ్రహం నిశ్శబ్దంగా ఎలా పరిణామం చెందుతాయనే దానిపై ఆసక్తికరమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఆగండి ఆగండి..అయితే ఇప్పటికిప్పుడు దైనందిన జీవితానికి తక్షణ అంతరాయం లేదంటున్నారు. ఈ మార్పుకు మిలియన్ల సంవత్సరాలు పడుతుంది, అసలు ఏం జరుగుతోంది. దేని ఆధారంగా సైంటిస్టులు ఈ విషయాన్ని అంచనా వేస్తున్నారు.భూమి తన చుట్టూ తాను తిరగడానికి 24 గంటలు సమయం పడుతుంది. సాధారణంగా భూమి తన అక్షంపై తిరిగే వేగాన్ని ఆధారంగా చేసుకుని ఒక రోజు ఎంత సమయం అనేది నిర్ణయిస్తారు. ఇపుడు ఈ వేగం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా రోజులకు 24 గంటలకు బదులు 25 గంటలు పడుతుందంటున్నారు. ఇది ఆ రోజు రావడానికి ఇంకా చాలా సమయం ఉందని చెబుతున్నారు. దాదాపు 20 కోట్ల సంవత్సరాలు పట్టే అవకాశం ఉందట.భూమి భ్రమణం క్రమంగా వేగాన్ని తగ్గిస్తోందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఈ మందగమనంతో మానవులపై చాలా నెమ్మదిగా ఉంటుందనీ, ప్రస్తుత గడియారాలు , క్యాలెండర్‌లు పూర్తిగా ప్రభావితం కావు. ఈ ధోరణి వందల మిలియన్ల వరకు విస్తరించి ఉందని పరిశోధకులు అంటున్నారు.ఈ ప్రక్రియ ఇదే విధంగా కొనసాగితే, భవిష్యత్తులో ఒక రోజు వ్యవధి 25 గంటలకు చేరుకునే అవకాశం ఉందని జర్మనీలోని మ్యూనిక్ టెక్నికల్ యూనివర్సిటీతో పాటు అమెరికాలోని విస్కాన్సిన్-మాడిసన్ యూనివర్శిటీ పరిశోధకులువెల్లడించారు.



ఈ మార్పుకు ప్రధాన కారణం భూమికి సహజ ఉపగ్రహమైన చంద్రుడేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చంద్రుడు ప్రతి ఏడాది సుమారు 3.8 సెంటీమీటర్ల మేర భూమి నుంచి క్రమంగా దూరమవుతున్నాడుభూ భ్రమణం దాదాపు 1.7 మిల్లీసెకన్ల పాటు ఉంటుందని అధ్యయనాలు చూపిస్తున్నాయి. ఈ మార్పు దాదాపు ప్రతి వంద సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. చంద్రుడి వల్ల కలిగే టైడల్ ఘర్షణ. చంద్రుని గురుత్వాకర్షణ భూమి, మహాసముద్రాలను నిరంతరం ఆకర్షిస్తుంది. దీంతో చంద్రుడిని దూరంగా నెట్టివేస్తూ భూమి నెమ్మదిస్తుంది. కాలక్రమేణా, ఈ శక్తులు కొలవగల ప్రభావాలను కూడగట్టుకుంటాయి. అణు గడియారాలను ఉపయోగించి ఈ మార్పులను శాస్త్రవేత్తలు ట్రాక్ చేస్తారు.భూమి భ్రమణ స్థిరమైన వేగంతో నెమ్మదించదు. స్వల్పకాలిక మార్పులు భ్రమణాన్ని కొద్దిగా వేగవంతం చేస్తాయి లేదా నెమ్మదిస్తాయి. వాతావరణ పీడన మార్పులు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యరాశి పంపిణీని ప్రభావితం చేస్తాయి. కరిగే హిమానీనదాలు భూమి, మహాసముద్రాల మధ్య బరువును కదిలిస్తాయి. ఈ పునఃపంపిణీలు తాత్కాలికంగా భ్రమణ వేగాన్ని సూక్ష్మంగా ప్రభావితం చేస్తాయి.శాస్త్రవేత్తలు 25 గంటల రోజు సుదూరమని అంచనా వేస్తున్నారు. ఈ మార్పులను దాదాపు 200 మిలియన్ (20 కోట్ల )సంవత్సరాలు పట్టవచ్చు. అంతేకాదు సుమారు 140 కోట్ల సంవత్సరాల క్రితం చంద్రుడు భూమికి చాలా దగ్గరగా ఉన్న సమయంలో భూ భ్రమణ వేగంఎక్కువగా ఉండేదని, అప్పట్లో ఒక రోజు పూర్తవడానికి కేవలం 18 గంటలే పట్టేదట. డైనోసార్ కాలంలో, రోజులు దాదాపు 23 గంటలు ఉండేవి. భూమిపై జీవితం క్రమంగా ఆ మార్పులకు అనుగుణంగా మారింది. పరిణామం తరతరాలుగా జీవ లయలను నెమ్మదిగా సర్దుబాటు చేసుకుంటుంది.ప్రస్తుతానికి, భూమి మునుపటిలాగే తిరుగుతోంది. అయితే నెమ్మదించే భ్రమణం శాస్త్రీయంగా మనోహరంగా ఉంది. ఈ పరివర్తన నెమ్మదిగా ఉంటుంది, విపత్తు కాదు,ఎలాంటి ఆందోళన అవసరం శాస్త్రవేత్తలు నొక్కి చెప్పారు.తప్పుదారి పట్టించే వైరల్ వాదనలకు వ్యతిరేకంగా నిపుణులు జాగ్రత్త వహించాలని కోరుతున్నారు. సహస్రాబ్దాలలో కొలిచిన మార్పును శాస్త్రం సూచిస్తుంది.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కన్నుమూత

**ఢాకా(జనంసాక్షి):** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బీఎన్‌పీ అధినేత్రి ఖలీదా జియా(80) కన్నుమూశారు. గుండె, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ సోకడంతో నవంబర్ 23న ఢాకాలోని ఎవర్ కేర్ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు న్యుమోనియా సోకినట్లు డాక్టర్లు నిర్ధరించారు. ఆ తర్వాత వేగంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది. గుండె, కిడ్నీ, లివర్, డయాబెటిస్, ఊపిరితిత్తులు తదితర ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యాయి. దీంతో మంగళవారం ఉదయం 6 గంటలకు ఫజ్ర్ ప్రార్థనల తర్వాత ఆమె తుదిశ్వాస విడిచారు.ఖలీదా జియా బంగ్లాదేశ్ రాజకీయాలపై బలమైన ముద్ర వేశారు.ఇటీవల ఆమె కుమారుడు తారిక్ రెహమాన్ 17 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టారు. మరో కుమారుడు అరాఫత్ రెహమాన్ కోకో కొన్నేళ్ల క్రితం మలేసియాలో కన్నుమూశారు.1945లో వ్యాపారవేత్త సికందర్ కుటుంబంలో జన్మించిన ఖలీదాజియా.. 1960లో జియావుర్ రెహమాన్‌ను వివాహం చేసుకొన్నారు. బంగ్లా విమోచన యుద్ధంలో జియావుర్ పాక్‌పై తిరుగుబాటు చేసి యుద్ధంలో పాల్గొన్నారు. 1981లో ఆయన హత్య తర్వాత బీఎన్‌పీలో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. దీంతో ఖలిదా జియా పార్టీ పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత పదేళ్లకు తొలిసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు.

మాజీ ప్రధాని ఖలీదా అంత్యక్రియలు.. బంగ్లాదేశ్‌కు వెళ్లనున్న జైశంకర్

ఖలీదా జియా అంత్యక్రియలు డిసెంబర్ 31న జరగనున్నాయి. ఢాకాలోని జియా ఉద్యాన్‌లో తన భర్త జియావుర్ రెహమాన్ సమాధి పక్కనే ఖలీదాను ఖననం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ హాజరుకానున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం

### ఫిబ్రవరిలో నిర్వహించేందుకు కసరత్తు




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30 (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికలను 2026 ఫిబ్రవరిలో నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి కాగా రాగా మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెట్టుకుంటుండగా, ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరం చేసింది.అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల అమలు,మౌలిక వసతుల స్థితి, స్థానిక సమస్యలే ప్రధాన అజెండాగా మారనున్న క్రమం లో అధికార పార్టీ తన పాలనా విజయాల ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా, ప్రతిపక్షాలు ప్రభుత్వ లోపాలు ఎత్తిచూపేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ఎన్నికల నిర్వహ ణకు అవసరమైన ఏర్పాట్లను ఎన్నికల సంఘం వేగవంతం చేస్తుండటంతో,పట్టణ రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది.పట్టణ పాల నపై ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే ఈ పోరు, అధికార,ప్రతిపక్ష పార్టీలకు ప్రతిష్ఠాత్మకం గా మారనుంది.

**ఫిబ్రవరిలోనే...**

2026 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసిన ప్రభు- త్వం,ఇప్పుడు మున్సిపల్,కార్పొరేషన్లలో ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.ఫిబ్ర- వరి మొదటి వారంలోనే ఈ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి ఆ నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాష్ట్రంలోని మెజారిటీ మున్సిపాలిటీల గడువు 2025 జనవరి 26తో ముగిసింది.పాత పాలక వర్గాల గడువు ముగిసిన వెంటనే ప్రత్యేక అధికారుల పాలన విధించా- రు.ఇప్పటికే ఏడాది అవుతున్నందున సాధ్యమై- నంత త్వరగా ప్రజాస్వామ్య పద్ధతిలో కొత్త పాలక మండళ్లను ఎన్నుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన,వార్డుల వారీగా విభజన ప్రక్రియపై ఇప్పటికే దృష్టి సారించింది. మున్సిపల్ ఎన్నికలకు ప్రధాన అడ్డంకిగా మారిన బీసీ రిజ- ర్వేషన్ల అంశంపై ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేక- పోతోంది. కోర్టులో ఉన్నందున అధికారికంగా రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలను- కుంటున్నారు. జనవరిలో సంక్రాంతి పండగ ముగిసిన వెంటనే మున్సిపల్ ఎన్నికల నోటిఫికే- షన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఫిబ్రవరిలో మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించేలా ఎన్నికల సంఘం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మార్చిలో విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉంటాయన్న ఉద్దే- శంతో, ఫిబ్రవరి నెలాఖరుకల్లా ఎన్నికల ప్రక్రియ- ను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

**మూడు పార్టీల మధ్య తీవ్ర పోరు**

ఈ మున్సిపల్ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి అగ్నిపరీక్షగా మారనున్నాయి. గ్రామాల్లో తాము పట్టు నిరూపించుకున్నామని కాంగ్రెస్ భావిస్తున్న, పట్టణాల్లోనూ తమదే పట్టని అనుకుంటున్నారు. బీఆర్ఎస్,బీజేపీ తమ సత్తా చాటేందుకు సిద్ధమ- వుతున్నాయి. ఏమైనా మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య తీవ్ర పోటీ ఉండే అవకాశం ఉంది.

# రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు, వార్డు ఆఫీసర్లతో సమీక్షా

### నగర పాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్




**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 30 (జనంసాక్షి):** నగరపాలక సంస్థ 66 డివిజన్లకు సంబంధించి డివిజన్ వారిగా ఓటర్ల ఫిజికల్, ఈ మ్యాపింగ్ ప్రక్రియను ప్రారంభించాలని కమీ షనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశిం చారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశం మందిరంలో మంగళవారం రోజు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారు లు, వార్డు ఆఫీసర్లతో సమీక్షా సమావేశం జరిగిం ది. ఈ సమావేశం ఓటర్ల ఈ మ్యాపింగ్ ప్రక్రియ, నల్ల కనెక్షన్ సర్వే, ఎన్ పిడిసిఎల్ కమర్షియల్ మీటర్ సర్వే, ఆస్తి పన్నుల వసూళ్లు తో పాటు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చిం చారు. అధికారులు, వార్డు ఆఫీసర్లకు పలు సూచ నలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బ ంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... జనవ రి 10 లోగా డోర్ టూ డోర్ నల్లా కనెక్షన్ సర్వేను పూర్తి చేయాలన్నారు. అసెస్మెంట్ నెంబర్ ప్రకారం వార్డు ఆఫీసర్లు ఇంటింటికి తిరిగి నల్లా కనెక్షన్ సర్వే చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కలిగి ఉన్న నల్లా కనెక్షన్ కమర్షియల్ నల్లా నా... రెసిడెన్షియల్ నల్లానా... అక్రమ నల్లానా తనిఖీ చేయడంతో పాటు నల్లా కనెక్షన్ సైజ్, నల్లా ఏరియర్స్ పెండింగ్ లాంటి వివరాలను ఇచ్చిన 26 కాలమ్స్ ఫార్మాట్ ప్రకారం వివరాలను సేకరించాలని ఆదేశించారు. నల్లా కనెక్షన్ కు మ్యాన్వల్ బుక్ లేకున్నా...ఆన్ లైన్ ట్యాన్ నెంబర్ లేకున్నా అక్రమ నల్లాగా గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ నల్లా పొంది కమర్షియల్ గా వాడినా, ట్యాప్ సైజ్ ఎక్కువగా ఉన్నా, అలాంటి వాటికి నోటీసులు జారీ చేయాలని, నల్లా పన్ను ఏరియర్స్ పెండింగ్ ఉంటే అలాంటి నల్లా పన్నులు వసూలు చేయాల న్నారు. అంతే కాకుండా ఆస్తి పన్నుల వసూళ్ల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టార్గెట్ ప్రకారం ఆస్తి పన్నుల వసూళ్లు చేయాలని 100 శాతం ఆస్తి పన్నుల వసూళ్లు చేసేలా రెవెన్యూ అధికా రులు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. ఎన్ పిడిసిఎల్ కమర్షియల్ మీటర్ల సర్వేను కూడ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ డివిజన్ల ప్రకారం పోలింగ్ స్టేషన్ ప్రకారం ఓటర్ల ఫిజికల్ ఈ మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించా రు. ఇచ్చిన ఓటర్ లిస్టు, డిలిమిటేషన్ ప్రకారం ఓటర్ల ను గుర్తించి క్రమ పద్దతిలో మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమీషనర్లు, ఖాదర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, అసిస్టెంట్ కమీషనర్ దిలీప్, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30 (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మా ణాలను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వా న్ తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని వండ్రికల్ గ్రామంలో ఆయన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మొరం, ఇటుకలు వంటి నిర్మాణ సామగ్రి ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉందని, ఈ విషయంలో అధికా రులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఇంటి నిర్మాణాలు దశల వారీగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని, లబ్ధిదారులకు అవ సరమైన సాంకేతిక సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభు త్వం లక్ష్యంగా పెట్టుకున్న సమయానికి అన్ని గృహాలు పూర్తయ్యేలా చర్యలు తీసు కోవాలని ఆయన స్పష్టం చేశారు.వండ్రికల్ గ్రామంలో మొత్తం 10 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ప్రస్తుతం బేస్మెంట్ స్థాయి వరకు 2 ఇళ్లు, రూఫ్ లెవెల్ వరకు 1 ఇల్లు, స్లాబ్ లెవెల్ వరకు 4 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.ఈ కార్యక్రమంలో పీడీ విజయపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ సురేందర్, ఎంఆర్ఓ రేణుక చౌహాన్, ఎంపీడీఓ రాజేశ్వర్, మండల స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ డీఈఈ,ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30 (జనంసాక్షి):** ఫర్టిలైజర్ షాప్‌లను మంగళవారం ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం లోని మౌనిక ఫర్టిలైజర్ షాప్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాప్‌లోని ఎరువుల నిల్వ లు, అమ్మకాలు, రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికల ను కలెక్టర్ పరిశీలించారు.రైతులకు ప్రభుత్వం నిర్ణ యించిన ధరలకే ఎరువులు విక్రయిం చాలన్నారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, బిల్లులు ఇవ్వ కుండా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి రైతుకు అవసరమైన మేరకు ఎరువులు అందే లా చూడాలని, కృత్రిమ కొరత సృష్టిం చకుండా చర్యలు తీసుకోవాలని షాప్ నిర్వాహకులను ఆదేశించారు. అలాగే షాప్ ముందు ఎరువుల నిల్వల వివరా లు, రాష్ట్ర టోల్‌ఫ్రీ నంబ ర్లను స్పష్టం గా ప్రదర్శించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, తహసిల్దార్ రేణుక , ఏఈఓ రాజలింగం, సంబంధిత వ్యవ సాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి భౌతిక శాస్త్ర పరీక్షలో సత్తాచాటిన పారమిత విద్యార్థులు

### పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద రావు



**కరీంనగర్, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** ఇటీవల ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ నిర్వహించిన జాతీయ స్థాయి భౌతిక శాస్త్ర పరీక్ష (ఎన్.ఎస్.ఇ.పి) పోటీలలో స్థానిక నగరం లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో 10వ తరగతి చదువు తున్న చవట వెంకట మోక్షిత్ , గంప సహస్ర లు అత్యు త్తమ ప్రతిభ ను కనబరిచి హెూమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ వారు ఫిబ్రవరిలో నిర్వహించే ఐ.ఎన్.పి.హెచ్.ఒ 2026 (ఇండియన్ నేషనల్ ఫిజిక్స్ ఒలింపియాడ్) కు ఎంపికైనట్లు ప్రధానోపా ధ్యాయు లు గోపీకృష్ణ తెలిపారు. ఈ పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుంచి దాదాపు 12,000 మంది విద్యార్థులు పాల్గొనగా కేవలం 18 మంది విద్యార్థులు మాత్రమే ఐ.ఎన్.పి.హెచ్.ఒ 2026 కు అర్హత సాధిం చగా, అందులో ఇద్దరు పారమిత పాఠశాల విద్యార్థులు కావ డం గమనార్హం. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో అత్యు త్తమ ప్రతి భను కనబరిచి ఐ.ఎన్.పి.హెచ్. ఒ 2026 కు అర్హత సాధిం చిన విద్యార్థులను, గైడ్ టీచర్స్ చంద్రమౌళి శర్మ, శ్రీనివాస్‌లను పార మిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద రావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ , సమన్వ య కర్తలు నాగరాజు, రాములు ప్రత్యేకంగా అభినందించారు.

## అక్రిడిటేషన్ కార్డులు రెండు నెలలు పెంపు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర సమాచార ప్రజా సంబంధాల విభాగం పరిధిలోని వర్కిం గ్ జర్నలిస్టులకు జారీ చేసిన ప్రస్తుత రాష్ట్ర, జిల్లా అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటు వ్యవధిని రెండు నెలల పాటు పొడిగించినట్లు జిల్లా పౌర సంబంధాల అధికారిణి బి.తిరుమల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటు డిసెంబర్ 31 తో ముగియనున్న నేపథ్యంలో, వర్కింగ్ జర్నలిస్టులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, అక్రిడి టేషన్ కార్డుల చెల్లుబాటు వ్యవధిని 2026 జనవరి 1 నుండి 28. ఫిబ్రవరి. 2026 వరకు రెండు నెలలు పొడిగించినట్లు తెలిపారు.ఈ సందర్భ ంగా సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక మంగళవారం ఉత్తర్వు లు జారీ చేయడం జరిగిందని తెలిపారు.అర్హులైన జిల్లా మీడియా మిత్రులు రేపు బుధవారం తేది:31 12.2025 మధ్యాహ్నం 2.00 గంటలకు డిపిఆర్ఓ కార్యాలయం లో తమ అక్రెడిటేషన్ కార్డుల పై స్టిక్కర్లను వేయించుకోగలరని తెలియజేయనైనది.

# దేశంలో 10 కోట్ల మంది ప్రీ డయాబెటిక్ బాధితులు

- 60 శాతం మంది ఎన్సీడీలతో చనిపోతున్నారు
- బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాధి నిర్ధారణ శిబిరాలు
- విలేకరుల సమావేశంలో పాల్గొన్న ప్రముఖ డాక్టర్లు




**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 30 (జనంసాక్షి):** మన దేశంలో 10 కోట్ల మంది ప్రీ డయాబెటిక్ బాధితులు ఉన్నార ని బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.నరేందర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా డా.బి.నరేందర్ రావు మంగళవారం రోజు కరీంనగర్ లోని ఐఎంఏ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా డయాబెటిక్ హైపర్ టెన్షన్ల బాధితులు రోజురోజు కు పెరుగుతున్నారని, దేశంలో 10 కోట్ల జనాభా డయా బెటిక్తో బాధపడుతున్నారని తెలిపారు. ప్రీ డయాబెటిక్స్ వల్ల 60 శాతం పేషంట్లను డయాబెటిక్ బారిన పడకుండా చూడ వచ్చు అన్నారు. బీపీ, షుగర్‌ల వల్ల చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మారుతున్న జీవనశైలి ఆహారపు అలవాట్లు శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం వల్ల బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యూనికేబుల్ డిసీస్ బారిన పడుతు న్నారని ఈ సందర్భంగా తెలిపారు. డయాబెటిక్స్ హైపర్ టెన్షన్ ల వల్ల కిడ్నీ, గుండె, మెదడు లపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. సకాలంలో గుర్తించకపోయినా, డాక్టర్ సూచనల మేరకు మందులు వాడకపోయినా కూడా ప్రాణాపా య స్థితికి చేరుకుంటారని అన్నారు. మన దేశంలో 30 నుంచి 45 సంవత్సరాల వయసు గలవారు బీపీ షుగర్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో వ్యాధుల ను గుర్తించకపోవడం వల్ల చికిత్స ఆలస్యం కారణంగా చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ వ్యాధులను ముందస్తుగా గుర్తించి నివారణ లో భాగంగా డాక్టర్ బి.ఎన్. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యాధి నిర్ధారణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బోయిన్పల్లి, మానకొండూరు, కొత్తపల్లి, మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామని తెలిపారు. మండలాలతోపాటు కరీంనగర్ జిల్లా కేంద్రంలో కూడా ఈ నిర్ధారణ శిబిరాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు ఫిజీషియన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా శాఖ తోపాటు కరీంనగర్ తానా సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఫిజీషియన్ వైద్యులు మాట్లాడుతూ... షుగర్, బిపి వ్యాధుల పై చాలా మందికి అవగాహన లేదని, దానివల్ల వ్యాధి ముదిరి చికిత్స ఆలస్యం అవుతుందన్నారు. ఇలాంటి శిబిరాల వల్ల వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి వ్యాధులను అదుపులో ఉంచడంతోపాటు నివారణకు కృషి చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా ఐ.ఎం. ఎ. అధ్యక్షురాలు డాక్టర్ ఆకుల శైలజ, కార్యదర్శి డాక్టర్ మహేష్, కోశాధికారి డాక్టర్ నీలిమ, ఫిజీషియన్ అసోసి యేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ కల్బందే, తనా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ , డాక్టర్ డిసి తిరుపతి రావు, డాక్టర్ విజయ మోహన్ రెడ్డి, డాక్టర్ సాయిని నరేందర్, డాక్టర్ పలాస రామ్ చరణ్, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ తిరునాథర్, డాక్టర్ బండారి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి 91 దరఖాస్తులు

### జిల్లా కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30 (జనంసాక్షి):** ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి 91 దరఖాస్తులు వచ్చా యని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ మండలాల నుండి వచ్చి న అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించి ఆ యా శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమస్యల పరిష్కారానికి అధికారులకు అర్జీల ను ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరిం చాలని తెలిపారు.ఈ ప్రజావాణి లో అదనపు కలెక్టర్ విక్టర్, సంబంధిత ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి

- వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం
- మహా శివరాత్రి జాతర సమన్వయ సమావేశం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/ వేములవాడ డిసెంబర్ 30 (జనంసాక్షి):** మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేసి ఈ భక్తులకు ఇబ్బందులు కలకుండా చేయాలని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్,జాతర చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రానున్న ఫిబ్రవరి 14,15,16 తేదీల్లో మహా శివరాత్రి జాతర వస్తున్న క్రమంలో మంగళ వారం భీమేశ్వర సదన్ ఆవరణలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో జాతర సమన్వయ సమావేశాన్ని మంగళవారం జాతర ఛైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బీ గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జాతర ఛైర్మన్,ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ భక్తులు శ్రీ భీమేశ్వర ఆలయంలో స్వామి వారి దర్శనాన్ని వేగంగా,సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తిప్పాపూర్ బస్టాండ్ నుండి రాజన్న ఆలయం వరకు, వేములవాడ నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు మరమ్మత్తులు పక్కా ప్రణాళిక పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. తిప్పా పూర్ ఆర్టీసీ బస్ స్టాండ్ లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని,హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు.పారిశుధ్య పనుల నిర్వహణ వేములవాడ మున్సిపల్,జిల్లా పంచాయతి అధికారి సంయుక్తం గా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని,ఎక్కడ ఇబ్బంది రాకూడదన్నారు.భక్తుల సౌకర్యం కొరకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.ఈ కేంద్రాల్లోని వారికి ఆల యానికి సంబందించిన పూర్తి సమాచారం ఉండాలని ఆదేశిం చారు. జాతర విధుల్లో పాల్గొనే అన్ని శాఖల అధికారులు వారి సమగ్ర యాక్షన్ ప్లాన్ తో రావాలన్నారు. ఆలయంలోని క్యూలైన్ వద్ద,పార్కింగ్ స్థలాల వద్ద తాగు నీరు,మజ్జిగ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.జాతరకు వచ్చే భక్తులకు అల్పాహా రం ఉప్మా, పులిహోర,పెరుగు అన్నం, నీటి వసతి చక్కటి వాతావరణంలో కల్పించాలని సూచించారు. ప్రతి జాతర ప్రదేశాల్లో నాణ్యమైన తాగునీటిని అందుబాటులో పెట్టాలని ఆర్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు.త్వరలో మరో సమావేశం నిర్వహిస్తామని,అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు.ఆలయ ఆవరణలో 24 గంటల పాటు వైద్య బృందం,హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, ఫైర్ సేఫ్టీ అధికారులు ఆలయంలో పరిశీలించి కావాల్సిన పరికరాలు వివరాలు అందజేయాలని సూచించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని, సమ్మక్క సారాలమ్మ జాతర వస్తున్న క్రమంలో భక్తుల కోసం వైద్య బృందం అందుబాటులో ఉండాలన్నారు. వృద్ధులు, దివ్యా ంగులకు సహాయం కోసం వీల్ చైర్లు, వాలంటీర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి చోట సైన్ బోర్డ్‌లు ఉండాల న్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాలను తనిఖీ చేయాలని సూచించారు.ప్రతి శాఖ అధికారి తమ పూర్తి యాక్షన్ ప్లాన్ తో రావాలన్నారు.దర్శనం వెహికల్ ఇతర పాస్ లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేస్తామని విప్,ఇంచార్జి కలెక్టర్ స్పష్టం చేశారు.ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగ కుండా చర్యలు తీసుకుంటామన్నారు. జాతరకు వచ్చే వీఐపీల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. వేములవాడలో కావాల్సిన సైన్ బోర్డ్,సిసి కెమెరాలు ఉంచాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాలంటీర్ లను తమకు అప్పగించాలన్నారు.ఈ సమావేశంలో ఏఎస్పీ రుత్విక్ సాయి,ఆర్డీఓ రాధాబాయి,ఆలయ ఈఓ రమాదేవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత,జిల్లా లోని అన్ని శాఖల అధికారులు, ఆలయ అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పసుల రవికుమార్‌కు 'కవి రచయిత అవార్డు'

### వేములవాడ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, సామాజిక సేవకులు, కవి రచయిత రవి కుమార్‌కు అభినందన వెల్లువ



**కరీంనగర్, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** ఆదివారం రోజు హైదరాబాద్ హిమాయత్ నగర్ లో సరిగమ మ్యూజిక్ స్టూడియో ఆడిటోరియంలో నీరజ.. ఓరుగ ల్లు.. స్వరాల జల్లు అధ్యక్షురాలు నీరజ .. ఓరుగల్లు .. స్వర జల్లు కార్యక్రమం నిర్వహించి ఈ కార్యక్ర మంలో కరీంనగర్ పట్టణం కు చెందిన పసుల రవికు మార్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, సామాజిక సేవకులు, కవి రచయిత, లఘు చిత్రాల కథ రచయిత దర్శకుడు, నిర్మాత నటుడు, పసుల క్రియేషన్ యూట్యూబ్ ఛానల్ అధినేత పసుల రవి కుమార్ ను సినిమా నటుడు కమెడియన్ పృథ్వీరాజ్ అభినందించారు. సినిమా పాటల గేయ రచయితలు, గాయకులు ప్రణయ్ కుమా ర్ కొంచెం, కూర ఉంటే చైతన్య అర్జున్, మూడు రంగుల జెండా మ్యూజిక్ డైరెక్టర్ గంటాడి కృష్ణ దేవుడు వరమందిస్తే ప్రముఖుల పసుల రవి కుమార్ ను అభినందిస్తూ.. కవి రచయిత అవార్డును ప్రము ఖుల చేతుల మీదుగా రవికుమార్ కు బహుకరించా రు. ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ... పసుల క్రియే షన్ యూట్యూబ్ ఛానల్ ద్వారా రవికుమార్ ప్రతి ఒక్క లఘు చిత్రాలలో అంద రికీ ఉపయోగపడే ఇతివృత్తం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... యూట్యూబ్ అంటే వినోదం అందిస్తు ంది, సా మాజిక చైతన్యాన్ని కలిగిస్తుంది, అలాంటి సందేశాత్మ కమైన లఘు చిత్రాలు తీయడంలో నాకు తృప్తి ఉం టుం దన్నారు. నాలఘు చిత్రాల ద్వారా అందరూ మంచిని నేర్చుకోవాలని వారు కోరారు.

## దుర్గం చెరువులో హైడ్రా ఉక్కు పాదం...
# కబ్జాదారుల వెన్నులో వణుకు




- **ప్రస్తుతం దాదాపు 5 ఎకరాల స్థలంలోని కబ్జాల తొలగింపు**
- **160 ఎకరాలకు గాను మిగిలింది 116 ఎకరాలే...!?**
- **శాటిలైట్ చిత్రాలద్వారా నిజాలను నిగ్గు తేల్చనున్న హైడ్రా**
- **ఆక్రమణల తొలగింపులో రాజకీయాలకు లొంగొద్దు... ప్రజా సంఘాలు**

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) మెల్లిగా తన లక్ష్యంవైపు ఒక్కో అడుగు వేస్తూ ముందుకు సాగుతుంది. ప్రారంభంలో ఎంతో దూకుడుగా వ్యవహరించి నగరంలో సంచలనం సృష్టించడంతోపాటు అక్రమార్కులను ఓ దశలో 'వొంటి'కి పోయించిందంటే అతిశయోక్తి కాదు. తదనంతర క్రమంలో ఎన్నో వర్ధిల్లు, కోర్టుల తాఖీదులు ఎదురవడంతో కొంత స్తబ్దంగా ఉన్నట్లు కనిపించినా ఎదురవుతు న్న అనుభవాల నుండి పాఠాలను నేర్చుకుంటూ మరింత సమగ్రంగా లక్ష్యంవైపు దూసుకెల్లడానికి ఒక్కోఅడుగును కూడదీసుకుంటూ మరింత పదునుగా ముందుకు సాగుతోంది.

**దుర్గం చెరువులో హైడ్రా ఉక్కుపాదం...**
**కబ్జా దారుల వెన్నులో వణుకు**

హైదరాబాద్ మహానగరంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం గురించి పెద్దగా చెప్పుకోనక్కర్లేదు. ఇక్కడ అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలతోపాటు ఐటి కారిడార్, బయోడైవర్సిటీ పార్క్, ముంబై జాతీయ రహదారి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డులాంటి ఎన్నో ప్రత్యేకతలకు ఇది ఆలవాలమే. ఈ మధ్యకాలంలో దుర్గం చెరువు పై నిర్మించిన కేబుల్ బ్రిడ్జ్ నగరానికి మకుటాయమానంగా నిలిచి ఒక ప్రముఖ టూరిస్ట్ ప్రదేశంగా బాసిల్లుతోంది. దీనికితోడు మాదాపూర్, జూబ్లీహిల్స్ వంటి అత్యంత ఖరీదైనప్రాంతాలు దీనికి దగ్గరగా ఉండడంతో ఈ ప్రాంతం ధనవంతులకు, ప్రముఖులకు ఒక హాట్ స్పాట్ అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అయితే పూర్వ ఆధారాల ప్రకారం ఈ దుర్గం చెరువు దాదాపు 160 ఎకరాల వరకు విస్తరించి ఉండేదని, జనాభా పెరుగుదలకనుగుణంగా ఆవాస ప్రాంత విస్తరణ క్రమంలో దుర్గం చెరువు పరివాహక ప్రాంతం పూర్తిగా కబ్జా చెరలోకి వెళ్లి ప్రస్తుతం 116 ఎకరాల వరకు మాత్రమే చెరువు పరిధిలో ఉన్నట్లు పలు ధ్రువపత్రాలు నిరూపిస్తున్నాయి. దీంతో దుర్గం చెరువు కబ్జాలు, అంతరించి పోతున్న నీటి వనరుల గురించి ప్రసారమాధ్యమాలలో అనేక కథనాలు వెలువడిన నేపథ్యంలో ఎట్టకేలకు హైడ్రా అధికారు లు దుర్గం చెరువు కబ్జాలపై ప్రత్యేక దృష్టిని సారించినట్లు స్పష్టమవుతుంది. ఇందులో భాగంగానే గత కొంతకాలంగా దుర్గం చెరువు పరిధి, ప్రస్తుత స్థితిగతులపై హైడ్రాధికారులు సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నారని విశ్వసనీయ సమాచా రం. ఈ క్రమంలో మంగళవారం ఏకంగా ఉక్కుపాదంమోపి కబ్జాలపై తనదైన శైలిలో స్పందించడంతో వందల కోట్ల రూపాయల విలువచేసే దాదాపు 5 ఎకరాల భూమి ఆక్రమణ ఉదంతం వెలుగులోకి రావడం జరిగింది. ఓ ప్రజా ప్రతినిధి దుర్గం చెరువులో ఏకంగా 5 ఎకరాల స్థలంలో మట్టిని పూడ్చి వాహనాల పార్కింగ్ స్థలంగా దానిని మార్చి ప్రతి నెలా దాదాపు 50 లక్షల రూపాయల అద్దెను వసూలు చేస్తున్న విషయం తెలిసి శేరిలింగంపల్లి ప్రజలతోపాటు హైడ్రా అధికారులుసైతం విస్తుపోయారంటే స్థానికంగా పరిస్థితులు ఎంత దుర్భరంగా మారాయో ఊహించవచ్చు..



**ఉపగ్రహ చిత్రాలను సేకరిస్తున్నాం... కబ్జారాయుళ్ల తాటతీస్తాం - హైడ్రా**

నగరంలో భూ కబ్జాల సంస్కృతి దారుణంగా పెరిగి ఒక భూమాఫియాగా ఎదిగి హైదరాబాద్ విశ్వ నగరాన్ని శాసిస్తుందనలో ఎలాంటి సందేహం లేదు. శేరిలిం గంపల్లిలో ఎకరం భూమి 190 నుండి 200 కోట్లు పలుకుతున్న నేపథ్యంలో గజం ప్రభుత్వ భూమి కనిపించినా, వాగులు, వంకలు, చివరకు చెరువు శిఖం భూములను సైతం రాబందుల్లా మెక్కేస్తున్న కబ్జాదారులు వేలకోట్ల రూపాయలను వెనకేసుకొని పెద్ద మనిషిల్లా చలామణి అవుతుండడం ఇక్కడ అందరికీ తెలిసిన విషయమే. దశాబ్దాలుగా ఈ విషయంలో సామాజికవేత్తలు, ప్రజా సంఘాలు, మీడియా తమ వంతు పాత్రను చురుకుగా నిర్వహిస్తూనే కబ్జాల పర్వాన్ని నిరోధించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఓవైపు రాజకీయ ఒత్తిళ్లు, మరోవైపు అధికారుల అవినీతి జాడ్యం శేరిలింగంపల్లి పరిధిలోని వేల ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని హారతి కర్పూరం చేసిం దని సామాజిక స్పృహ ఉన్న ప్రతి ఒక్కరు అంగీకరిస్తున్న నగ్నస త్యం. ఈ క్రమంలో హైడ్రా సంస్థ ఆవిష్కృతమైన తర్వాత శేరిలింగంపల్లి ప్రాంతం నుండి స్పష్టమైన ఆధారాలతో కూడిన అనేక ఫిర్యాదులు హైడ్రాను ఆశ్చర్యపరిచేలా చేయడంతో ఇక తమ నాంది అడుగును శేరిలింగంపల్లి తోనే మొదలు పెట్టాలని నిర్ణయించుకున్న హైడ్రా ఇప్పటికే శేర్లింగంపల్లి పరిధిలోని మియాపూర్, అమీన్పూర్, గచ్చిబౌలి, మాదాపూర్ తదితర డివిజన్లలోని పలు ప్రాంతాలపై తమదైన ముద్ర వేసి ఎన్నో ఎకరాల ప్రభుత్వ భూమిని వెనుకకు తీసుకురావడంలో సఫలీకృ తమైందనే చెప్పవచ్చు. తాజాగా దుర్గం చెరువు అనుపాదులపై దృష్టి సారించిన హైడ్రా తొలి అడుగుగా ఇనార్బిట్ మాల్ వైపు చెరువులో 10 నుండి 15 మీటర్ల ఎత్తువరకు మట్టిని నింపి పార్కింగ్ ప్రదేశంగా ఐదు ఎకరాలను ప్రభుత్వ పరం చేయడంతో ఇక మిగిలిన ప్రాంతంలో మిగిలిపోయిన కబ్జా రాబందుల వెన్నులో వణుకు పుడుతుంది అంటే నమ్మి తీరాల్సిన అంశం. గతంలో చెరువు యొక్క పూర్వాపరాలను నిర్ధారించుకోవడానికి హైడ్రా ఉపగ్రహ చిత్రాలను సేకరిస్తుందంటే ఏ మేరకు దుర్గం చెరువు పై తమ దృష్టిని సారించిందో చెప్పకనే చెప్పవచ్చని పలువురు సామాజిక వేత్తలు స్పష్టం చేస్తున్నారు. హైడ్రా మీద ఎన్ని రాజకీయ వత్తిళ్ళు ఏర్పడినా... ఆక్రమణదారుల నుండి ఏ రకమైన సిఫార్సులు అందినా సామాన్యుడి కోణంలో భవిష్యత్తు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని శేర్లింగంపల్లి పరిధిలోని ప్రతి అంగుళం భూమిని స్వాధీనపరచుకొని ప్రభుత్వ పరం చేయాల్సిన అవసరం ఉందని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## మల్కాజిగిరి కమిషనరేగా అవినాష్ మహంతి



**మల్కాజిగిరి డిసెంబర్ 30 (జనంసాక్షి):** కొత్తగా ఏర్పాటైన మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌కు తొలి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అవినాష్ మహంతి. అనంతరం నేరడ్ మెట్ లోని మల్కాజిగిరి కమిషనర్ ర్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ పనితీరు, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారిస్తామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో నేరాలను నియంత్రించడం, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడం, మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అలాగే ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, సమస్యలను వేగంగా పరిష్కరించేలా పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉండేలా అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుని పని చేస్తామని ఆయన తెలిపారు.

## డాక్టర్ రెడ్డీస్ ఎన్ క్లేవ్ కాలనీ సమస్యలను పరిష్కరించండి



**కార్పొరేటర్‌కు కాలనీవాసుల వినతి**

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ మియాపూర్ డివిజన్ పరిధి డాక్టర్ రెడ్డిస్ ఎన్ క్లేవ్ కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి కార్యక్రమాలనుగూర్చి కాలనీవాసులు మంగళవారం డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కు నివేదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ పరిధిలోని డాక్టర్ రెడ్డీస్ ఎన్ క్లేవ్ కాలనీ పరిధిలోని సమస్యలను తాను స్థానిక ప్రజల నుంచి తెలుసుకుంటానని, ఇందుకోసం త్వరలోనే కాలనీ పరిధిలో పర్యటించి పాదయాత్రను చేపడతానని కాలనీవాసులకు హామీనిచ్చారు. ప్రధానంగా మంచినీరు, రోడ్లు, విద్యుత్, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థల వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిని సారించి రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహాయ సహకారాల ద్వారా డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన భరోసాని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఎన్ క్లేవ్ కాలనీ అధ్యక్షులు గల్లా జ్ఞానశేఖర్, కార్యవర్గ సభ్యులు తిరుపతిరెడ్డి, నూతలపాటి రమేష్, వెంకటేష్, రాజు, శివయ్య, పూర్ణానందం, వీరభద్రరావు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిషేధం సామాజిక బాధ్యత గా గుర్తించాలి

**జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను**




**నారాయణపేట జిల్లా బ్యూరో డిసెంబర్ 30 (జనంసాక్షి):** మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించి, నారాయణపేట జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ లో మాదకద్ర వ్యాల నిషేధం(యాంటీ నార్కోటిక్)పై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం డ్రగ్స్ పై సీరియస్ గా ఉందని చెప్పారు. మన జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు చేసిన సంఘటనలు ఉన్నాయా అని డీ ఏ వో జాన్ సుధాకర్ ను ప్రశ్నించగా అలాంటి సంఘటనలు ఏమీ లేవని ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా కమిటీల నేతృత్వంలో మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మన జిల్లాలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ,జూనియర్ జూనియర్ కళాశాలలోనే కాకుండా పాఠశాలలలోనూ మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. సమావేశంలో డి.ఎస్.పి నల్లపు లింగయ్య మాట్లాడుతూ .. గత నవంబర్ నెలలో పట్టణంలో 12 కిలోల గంజాయి పట్టుకుని 17 మంది పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలలో బిజీగా ఉన్నా... పోలీస్ స్టేషన్ ల వారీగా విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అంతేకాకుండా టాస్క్ ఫోర్స్ పోలీసుల నిఘా పెట్టడం జరిగిందని, షీ టీమ్ నేతృత్వంలోనూ అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు, విస్తృతంగా వాహనాల తనిఖీలు, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ వివరించారు. ఇదే తరహాలో కొత్త సంవత్సరంలో కూడా యాంటీ డ్రగ్స్ పై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో సంబంధిత శాఖల వారీగా చేపడుతున్న కార్యక్రమాల ఫోటోలు, పత్రికల్లో వచ్చిన క్లిప్పింగ్స్ ను స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో నుంచి అడుగుతున్నారని, ఇకపై చేసే అవగాహన కార్యక్రమాలు, సదస్సుల వివరాలను నార్కోటిక్ బ్యూరో కు పంపించాల్సి ఉంటుందని అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. రికార్డులు మెంటేన్ చేయాలన్నారు. అలాగే పబ్లిక్ స్థలాల్లో, కల్లు దుకాణాల్లో, మద్యం, బార్ అండ్ రెస్టారెంట్‌ల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన అబ్కారీ శాఖ అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులే కాకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో మాదకద్రవ్యాల నిషేధాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని, ఇదో సామాజిక బాధ్యత గా ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. మెడికల్ దుకాణాల లోనూ తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో ప్రతీ ఆటో వెనక యాంటీ డ్రగ్స్ పోస్టర్లను ఏర్పాటు చేసిన విస్తృత ప్రచారం చేయాలని ఆర్టీవో మేఘా గాంధీ కి ఆయన సూచించారు. ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడి పోస్టర్లు ఏర్పాటు చేయించాలన్నారు. ఈ కార్యక్రమం లో అబ్కారీ శాఖ సీ.ఐ. అనంతయ్య, డీ.ఐ.ఈ. వో సుదర్శన్, వైద్య శాఖ నుంచి అశోక్ కుమార్, విద్యాశాఖ నుంచి రాజేందర్, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారిని రాణీ దేవి, డ్రగ్ ఇన్స్ పెక్టర్, ఎక్సైజ్ ఎస్.ఐ, పాల్గొన్నారు.

## సైబరాబాద్ సిపిగా డాక్టర్ ఎం.రమేష్



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ బాస్ గా డాక్టర్ ఎం. రమేష్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఐపిఎస్ 2005 బ్యాచ్ కు సంబంధించిన డాక్టర్ రమేష్ గతంలో ఇన్స్పెక్టర్ జర్నల్ ఆఫ్ పోలీస్(ఐజిపి), ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్ విభాగంలో సేవలు అందించడం జరిగింది. నగరంలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ప్రభుత్వం డాక్టర్ ఎం. రమేష్ ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ గా నియమించడం జరిగింది. ఈ మేరకు రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి నుండి ఉత్తర్వులను అందుకొని సైబరాబాద్ సిపి గా విధులలో చేరారు. ఇంతకుముందు ఈ స్థానంలో అవినాష్ మహంతి సిపి గా బాధ్యతలు నిర్వర్తించిన విషయం విద్యుతమే. ఈ నేపథ్యంలో సిపి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ సైబరాబాద్ పోలీసుల ప్రధాన బాధ్యత చట్ట పాలనను సమర్థించడం, పౌరులందరికీ నిష్పాక్షికమైన, న్యాయమైన సేవలను నిర్ధారించడం, వృత్తి నైపుణ్యం, పారదర్శకత మరియు ప్రజా కేంద్రీకృత పోలీసింగ్ ను నొక్కి చెప్పడమే లక్ష్యమన్నారు. ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడానికి అన్ని పోలీసు కార్యకలాపాలలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రధాన కేంద్రంగా ఉంటుందని ఆయన నొక్కి చెప్పారు. ట్రాఫిక్ నిర్వహణకు కీలక ప్రాధాన్యత ఇస్తూ, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. రాబోయే నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగనివ్వకుండా ప్రశాంత వేడుకలకు నాంది పలికేలా తమ చర్యలు ఉంటాయన్నారు.

## గణితంలో ప్రతిభ కనబరిస్తే భవిష్యత్తు ఉంటుంది
### హైదరాబాద్ ఆర్ జె డి సోమిరెడ్డి



**హయత్ నగర్, డిసెంబర్ 30 (జనంసాక్షి):** తెలంగాణ గణిత ఫోరమ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష - 2025 పోటీలను నక్క వెంకటమ్మ యాదవ్ నక్క యాదగిరి స్వామి యాదవ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హయత్ నగర్ లో గణిత ఫోరం జిల్లా అధ్యక్షులు యాదగిరి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ ఆర్ జె డి సోమిరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు గణితంలో మంచి ప్రతిభ కనబరిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి మంచి అవకాశం ఉంటుందని వారు సూచించారు. ప్రతిభ పరీక్షలో గెలుపొందిన విద్యార్థులను వారు ప్రశంసించారు. త్వరలోనే రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని వారు తెలిపారు. ఇవే కాకుండా సైన్స్, సోషల్ టాలెంట్ టెస్ట్ లు నిర్వహించడం ద్వారా తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు మరింత ముందుకు సాగుతున్నాయని వారు తెలియజేశారు. ఈ ప్రతిభ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులు నవ్య శ్రీ మైలర్ దేవ్ పల్లి, మురళి శేర్లింగంపల్లి, చరణ్ తొర్రూరు పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. గణిత ప్రతిభ విద్యార్థులకు నక్క ఫౌండేషన్ ద్వారా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి హయత్ నగర్ ఎంఈఓ శ్రీనివాస్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఇందిరా, తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా బాధ్యులు జగన్ రెడ్డి, కిరణ్, జంగయ్య, వెంకటయ్య, రవీందర్, కల్పన, విజయ్ కుమారి, గణిత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు న్యాయం జరిగేలా జీవో 252 సవరిస్తాం

- **అక్రిడిటేషన్, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదు**
- **త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం పెడ్తా**
- **టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్‌టీ రాష్ట్ర నేతలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**






**హైదరాబాద్, డిసెంబర్ 30 (జనంసాక్షి) :** అక్రిడిటేషన్ కార్డులకు, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అక్రిడిటేషన్ కార్డుదా రులకు వర్తించే ప్రతి ప్రయోజనం మీడియా కార్డు దారులకు కూడా వర్తిస్తుందని తెలిపారు. ఈ విషయంలో డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలకు గురికావద్దని జీవో 252లో మార్పులు చేసి లిఖితపూర్వకంగా ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే జర్నలిస్టు సంఘాల తో సమావేశం నిర్వహించి, తుది జీవోను రిలీజ్ చేస్తామని వెల్లడించా రు. మంగళవారం సచివాలయంలో టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్‌టీ ప్రతినిధులు మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రికి వివిధ అంశాలను వివరించారు. ఇటీవల రిలీజ్ చేసిన జీవో 252 ద్వారా రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డులు, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డులు ఇస్తామ నే ప్రకటన వారిలో విభజన తెచ్చేలా ఉందని చెప్పారు. ప్రస్తుతమున్న పరిస్థితులలో డెస్క్ జర్నలిస్టులు కూడా ఫీల్డ్ వర్క్ చేయాల్సి వస్తోందని తెలిపారు. ఈ జీవోతో జర్నలిస్టులకూ భారీగా అక్రిటేషన్లు తగ్గే అవకాశం ఉందని, మహిళా కోటాను పునరుద్దరించాలని మంత్రి దృష్టికి ఫెడరేషన్ నేతలు తీసుకుపోయారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి.. జీవోపై కొంతమంది అపోహలకు గురిచేలా ప్రయత్నం చేస్తున్నారనీ, వాటిని నమ్మొద్దని స్పష్టం చేశారు. డెస్క్ జర్నలిస్టులు ఎవ్వరూ ఆందోళన చెందొద్దని, తాను అండగా ఉంటానని చెప్పారు. ఇది జర్నలిస్టులను రెండు భాగాలుగా చూడాలన్న ఆలోచన కాదనీ, ప్రభుత్వ పరంగా అందరికీ సంక్షేమ పథకాలను వెల్లడించారు. అర్హులైన, నిజమైన జర్నలిస్టులకు మేలు చేయాలన్న సంకల్పంతో తీసుకున్న నిర్ణయమ న్నారు. తెలంగాణ రాష్ట్రంలో మిన హా దేశంలో ఇంత పెద్దమొత్తంలో అక్రిడిటేషన్ కార్డులు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదని వివరించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే అన్ని జర్నలిస్టుల సంఘాలతో సమావేశం నిర్వహి స్తామని, ఆ సమావేశా నికి డెస్కు జర్నలిస్టులనూ ఆహ్వానిస్తామని తెలిపారు. అందరి అభిప్రాయా లు, సలహాలు సూచనలు తీసుకొని జర్నలిస్టులకు మరింత ప్రయోజనం చేకూరే విధంగా జీవో 252లో మార్పులు, చేర్పులు చేస్తామని స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎ ఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, రాష్ట్ర కార్య దర్శి గంద్ర నవీన్, డీజేఎఫ్‌టీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధా న కార్యదర్శులు ఉపేందర్, ఎస్‌కే మస్తాన్, ట్రెజరర్ నిస్సార్, ఉపాధ్యక్షుడు రాజారామ్, జాయింట్ సెక్రెటరీ విజయ, స్పోర్ట్స్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, శ్రీనివాస్, జర్నలిస్టుల ప్రతినిధులు శేఖర్, సురేష్, వెంకటరమణ, నరేష్ పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే తాటతీస్తా

## న్యూ ఇయర్ వేడుకల్లో మారకద్రవ్యాలు అందజేస్తే క్రిమినల్ కేసులు

- **వాహనాల తనిఖీ డ్రంక్ అండ్ డ్రైవ్**
- **వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రు**




**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 30 (జనంసాక్షి):** జిల్లాలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రు ఒక ప్రకటనలో తెలియజేశారు. నూతన సంవత్సర వేడుకల్లో డీజే లకు అనుమతి లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుబీ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు వాహన తనిఖీలు ఉంటాయనిజిల్లా ఎస్పీ స్నేహ మెహ్రు తెలిపారు.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలను కాపాడేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా తెలిపారు. పోలీస్ నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్న ఫామ్‌హౌస్‌లు, రిసార్టులు మరియు పర్యాటక ప్రాంతాల యజమానులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం సూచించిన సమయ పాలనను ఖచ్చితంగా పాటించాలని ఎస్పీ ఆదేశించారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో జిల్లాలో ఎక్కడా డీజే సిస్టమ్‌లకు అనుమతి లేదని ఆమె స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్పీ ప్రజలను హెచ్చరించారు. వేడుకల పేరుతో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ మద్యం సరఫరా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. ముఖ్యంగా మైనర్లకు మద్యం సరఫరా చేస్తే నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.అతి ఉత్సాహంతో అర్ధ రాత్రి వేళ ద్విచక్ర వాహనాలపై అతివేగంగా వెళ్లడం, పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించడం లేదా ఈవ్ టీజింగ్‌కు పాల్పడటం వంటి పనులు చేయవద్దని యువతను ఎస్పీ కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పూర్తిగా నిషేధించబడింది.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్ హెచ్ ఓ లు ప్రత్యేక బృందాలతో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృత వాహన తనిఖీలు నిర్వహిస్తారని ఎస్పీ తెలిపారు. వేడుకల ముసుగులో ఎక్కడైనా ఈవ్ టీజింగ్ సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, వీటిని షీ టీమ్ అధికారులు నిశితంగా గమనిస్తారని పేర్కొన్నారు.ం

అదనంగా, వేడు కలను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించారు. వికారాబాద్ జిల్లా ప్రజలు పోలీసు లకు సహకరించి, నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపినారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
31 డిసెంబర్ 2025

# మంత్రి దామోదర్ రాజనర్సింహకు నిమ్స్ ఉద్యోగుల కృతజ్ఞతలు

- **జీవో 230 జారీ పట్ల హర్షం**



హైదరాబాద్ (జనంసాక్షి) : నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఉద్యోగుల చిరకాల స్వప్నమైన 'ఆర్జిత సెలవుల నగదు మార్పిడి'కి ప్రభుత్వం పచ్చజెండా ఊపడం పట్ల నిమ్స్ ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. తమ విజ్ఞప్తిని మన్నించి, ఇచ్చిన మాట ప్రకారం సమస్యను పరిష్కరించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిని ఈరోజు (మంగళవారం) నిమ్స్ ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి, ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎయిమ్స్ పే స్కేల్స్ పొందుతున్న నిమ్స్ రెగ్యులర్ ఉద్యోగులకు ఇప్పటి వరకు ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం లేదు. ఇటీవల హాస్పిటల్ నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి తమ ఆవేదనను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, అధికారులతో చర్చించి తగు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి చొరవతో ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు (జీవో నం. 230) జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న 'తెలంగాణ లీవ్ రూల్స్-1933' నిబంధనల ప్రకారమే, ఇకపై నిమ్స్ ఉద్యోగులు కూడా తమ ఆర్జిత సెలవులను సరెండర్ చేసి నగదు పొందవచ్చునని జీవోలో పేర్కొన్నారు. మంత్రిని కలిసిన సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. తమ కష్టాన్ని గుర్తించి, ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరదించినందుకు మంత్రికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల వేలాది మంది నిమ్స్ ఉద్యోగులకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పేషెంట్ల పట్ల చిర్రుబుర్రులు ఆడొద్దని, సహనంతో సానుభూతితో వ్యవహరించాలన్నారు.



# సీఎం ప్రజావాణి చొరవ

- **గ్రూప్ - 3, ల్యాబ్ టెక్నీషియన్ లకు ఉద్యోగాలు**
- **సీఎం ప్రజావాణి ఇన్చార్జి చిన్నారెడ్డిని శాలువాతో సన్మానించిన అభ్యర్థులు**

హైదరాబాద్ (జనంసాక్షి) : సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ చొరవతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ - 3, ల్యాబ్ టెక్నీషియన్ అభ్యర్థుల పరీక్షా ఫలితాలు త్వరితగతిన వెలువడి ఉద్యోగాలు లభించాయి. దీంతో సంతోషం వ్యక్తం చేస్తూ ఆ అభ్యర్థులు మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన సీఎం ప్రజావాణి కి పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రజావాణి ఇన్చార్జి చిన్నారెడ్డిని శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. తమకు అండగా నిలిచి పరీక్షల ఫలితాలు తొందరగా వెలువడి ఉద్యోగాలు లభించేలా కృషిచేసిన సీఎం ప్రజావాణి బృందానికి ఆ అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.



### సీఎం ప్రజావాణిలో 407 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 407 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 126, రెవెన్యూ శాఖకు సంబంధించి 57, ఇందిరమ్మ ఇండ్ల కోసం 194, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 30 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# జీవో 252లో కొన్ని సవరణలు చేయండి

- **మంత్రి పొంగులేటికి టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందం అభ్యర్థన**



హైదరాబాద్ (జనంసాక్షి) : జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో, కొత్త మార్గదర్శకాలతో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 252లో కొన్ని సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కోరింది. మంగళవారం నాడు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జీవో పై చర్చించడంతో పాటు వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన తమ సంఘం ముఖ్యుల సమావేశం, 252జీవో ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, జర్నలిస్టుల నుండి వ్యక్తం అవుతున్న అభ్యంతరాలు, జీవో లో లోటుపాట్లపై చర్చించి, కొన్ని సవరణలు అవసరమనే అభిప్రాయానికి వచ్చినట్లు మంత్రితో తెలిపారు. గతంలో అక్రెడిటేషన్ కార్డులతో డెస్క్ జర్నలిస్టులందరికీ కాకుండా కొందరికి మాత్రమే న్యాయం జరిగేదని, ప్రస్తుతం అలా కాకుండా బస్ పాస్ లతో సహా ప్రభుత్వం కల్పించే ప్రతి సంక్షేమ పథకం రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులనే తేడా లేకుండా, ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి డెస్క్ జర్నలిస్టుకు వర్తింపజేసేలా జీవో లో సవరించాలని ఆయన కోరారు. కేబుల్ టీవీ ఛానెల్స్ కు సంబంధించి, జీవో లో పేర్కొన్న అస్పష్టతను సరిచేయాలన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు మండలానికి ఒకటి కాకుండా, సదరు మండలంలో ప్రధాన డేట్ లైన్ లను గుర్తించి, వాటి ప్రకారం అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసేందుకు జీవో ను సవరించాలని కోరారు. చిన్న పత్రికలకు సర్క్యులేషన్ ఆధారంగా జిల్లాల్లో కూడా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలన్నారు.

ప్రధాన పత్రికలు, శాటిలైట్ న్యూస్ ఛానెల్స్ కు కార్డుల కుదింపు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు, వీడియో జర్నలిస్టులకు, కెమెరా జర్నలిస్టులకు వారి కార్యాలయాల సిఫారసుల మేరకు అందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్రంలో ఉర్దూ అధికార భాషా కనక, ఇతర భాషల సర్క్యులేషన్ లతో, గ్రేడింగ్ లతో వాటిని పోల్చకుండా, ఉర్దూ పత్రికలు సర్క్యులేట్ అవుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక కేటగిరి క్రింద జిల్లా, మండల స్థాయిల్లో ఉర్దూ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేలా జీవో లో పొందుపర్చాలని కోరారు. వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులు పొందడానికి, జీవో లో పేర్కొన్న వృత్తి అనుభవాన్ని కొంత తగ్గిస్తూ సవరించాలని మంత్రిని ఆయన కోరారు. టీయూడబ్ల్యూజే అభ్యర్థనపై మంత్రి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, త్వరలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి, ఏమైనా లోటుపాట్లుంటే సరిచేసుకుందామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వి.యాదగిరి, రాష్ట్ర కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, ఎం.డి.గౌస్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శంకర్ గౌడ్, రాష్ట్ర చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ తదితరులు ఉన్నారు.

### టీయూడబ్ల్యూజే సూచనలను పరిశీలిస్తాం

జీవో 252పై తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం లిఖిత పూర్వకంగా చేసిన సూచనలను పరిశీలిస్తామని, మంగళవారం నాడు సచివాలయంలో తనను కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత సమావేశాన్ని నిర్వహించి జర్నలిస్టు సంఘాల అభిప్రాయాలు స్వీకరిస్తామన్నారు.

# జీవో 252తో జర్నలిస్టులకు అన్యాయం

- **మంత్రి పొంగులేటిని కలిసిన యూనియన్ నేతలు**
- **అక్రిడిటేషన్ల గడువు మరో 2నెలలు పొడిగింపు**


హైదరాబాద్, డిసెంబర్30 (జనంసాక్షి) : అక్రిడిటేషన్‌ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ.. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రిపోర్టర్లతోపాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే నోటిఫజకేషన్ త్వరాలో వెలువడనున్న తరుణంలో ఆలస్యం కాకుండా ప్రస్తుతం ఉన్న అక్రిడేషన్ల గడవును మరో రెండు నెలలు పెంచారు. ఈ మేరకు సమాచారశాఖ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగిస్తూ సమాచారశాఖ కమిషనర్ ప్రియాంక ప్రకటన విడుదల చేశారు.

# 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ (జనంసాక్షి) : ఉద్యోగాల భర్తీలో మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్పీడ్ పెంచింది. ఇటీవలే 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన బోర్డు, తాజాగా స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టుల ఫస్ట్ ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అందరి వివరాలను మంగళవారం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. అభ్యర్థి అకాడమిక్ క్వాలిఫికేషన్‌లో సాధించిన మార్కులు, వెయిటేజీ ద్వారా సాధించిన మార్కులు, వారి స్థానికతకు సంబంధించిన అంశాలు సహా అన్ని వివరాలను వెబ్‌సైట్‌లో http://mhsrb.telangana.gov.inఅందుబాటులో ఉంచామని, వీటిపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని బోర్డు కోరింది. అభ్యంతరాలను జనవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల నమోదు చేయాలని సూచించింది. అభ్యంతరాలను అభ్యర్థి లాగిన్ ద్వారా మాత్రమే నమోదు చేయాలని, ఆఫ్‌లైన్‌లో పంపించిన అభ్యంతరా లను పరిగణలోకి తీసుకోబోమని బోర్డు స్పష్టం చేసింది. మల్టీ జోన్-1పరిధిలో ఎటువంటి పోస్టులు నోటిఫై చేయనందున, ఆ జోన్‌కు చెందిన అభ్యర్థులను పోస్టుల కోసం పరిగణ లోకి తీసుకోవడం లేదని బోర్డు స్పష్టం చేసింది.

# ఏప్రిల్ నెలాఖరులోగా నల్గొండ 'ఎక్స్' రోడ్స్

- **ఓవైసీ జంక్షన్ కారిడార్ ను ప్రారంభానికి సిద్ధం చేయాలి : కమిషనర్**



హైదరాబాద్, డిసెంబరు 30 (జనంసాక్షి) : ఏప్రిల్ నెలాఖరులోగా నల్గొండ 'ఎక్స్' రోడ్స్ ఓవైసీ జంక్షన్ కారిడార్‌ను ప్రారంభానికి సిద్ధ చేయాలనీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దక్షిణ హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ సమస్యలను తగ్గించేందుకు చేపట్టిన నల్గొండ 'ఎక్స్' రోడ్స్ సైదాబాద్ ఐఎస్ సదన్ ఓవైసీ జంక్షన్ సమగ్ర అభివృద్ధి కారిడార్ పనుల పురోగతిని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మంగళవారం క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ఈ కారిడార్‌ను ట్రాఫిక్ అడ్డంకులు లేని కారిడార్గా అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 2,530 మీటర్ల పొడవు గల ప్రధాన ఫ్లైఓవర్‌ను రూ.620 కోట్ల అంచనా వ్యయంతో విధానంలో నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు కమిషనర్‌కు వివరించారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా కమిషనర్, మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ఏప్రిల్ నాటికి కారిడార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ముఖ్యంగా సైదాబాద్ నుంచి ధోబీఘాట్ జంక్షన్ వరకు కీలక ప్రాంతంలో ట్రాఫిక్ డైవర్షన్‌కు అవసరమైన అనుమతులు తీసుకుని పనులు వేగంగా కొనసాగించాలని సూచించారు. కారిడార్ ప్రారంభానంతరం ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, సర్వీస్ రోడ్ల నిర్మాణా నికి అవసరమైన భూసేకరణను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. క్షేత్ర పరిశీలనలో కమిషనర్ వెంట చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ బి. గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాల వారీగా యూరియా నిలవల వివరాలు

| క్ర.సం | జిల్లా | మొత్తం | అందుబాటులో ఉన్న సంచులు |
|---|---|---|---|
| 1 | ఆదిలాబాద్ | 2,610 | 57,998 |
| 2 | కొమరంభీం ఆసిఫాబాద్ | 4,333 | 96,297 |
| 3 | మంచిర్యాల | 3,911 | 86,917 |
| 4 | నిర్మల్ | 7,622 | 1,69,367 |
| 5 | నిజామాబాద్ | 13,131 | 2,91,808 |
| 6 | కామారెడ్డి | 9,799 | 2,17,765 |
| 7 | కరీంనగర్ | 8,387 | 1,86,374 |
| 8 | పెద్దపల్లి | 9,996 | 2,22,135 |
| 9 | జగిత్యాల | 7,296 | 1,62,141 |
| 10 | రాజన్న సిరిసిల్ల | 2,903 | 64,517 |
| 11 | మెదక్ | 5,508 | 1,22,402 |
| 12 | సంగారెడ్డి | 4,766 | 1,05,901 |
| 13 | సిద్దిపేట | 10,980 | 2,44,008 |
| 14 | వరంగల్ | 9,375 | 2,08,337 |
| 15 | హనుమకొండ | 6,826 | 1,51,694 |
| 16 | మహబూబాబాద్ | 7,043 | 1,56,510 |
| 17 | ములుగు | 3,218 | 71,505 |
| 18 | జయశంకర్ భూపాలపల్లి | 4,137 | 91,931 |
| 19 | జనగామ | 2,881 | 64,026 |
| 20 | ఖమ్మం | 13,936 | 3,09,681 |
| 21 | భద్రాద్రి కొత్తగూడెం | 6,390 | 1,42,005 |
| 22 | రంగారెడ్డి | 4,761 | 1,05,810 |
| 23 | వికారాబాద్ | 4,063 | 90,284 |
| 24 | మేడ్చల్-మల్కాజిగిరి | 3,278 | 72,837 |
| 25 | మహబూబ్‌నగర్ | 5,908 | 1,31,280 |
| 26 | నారాయణపేట | 3,895 | 86,552 |
| 27 | నాగర్‌కర్నూల్ | 3,216 | 71,458 |
| 28 | వనపర్తి | 5,399 | 1,19,987 |
| 29 | జోగులాంబ గద్వాల | 8,125 | 1,80,553 |
| 30 | నల్గొండ | 13,936 | 3,09,679 |
| 31 | సూర్యాపేట | 10,557 | 2,34,608 |
| 32 | యాదాద్రి భువనగిరి | 6,375 | 1,41,663 |
| | మొత్తం | 2,14,561 | 47,68,029 |

# అందుబాటులోనే యూరియా!

- **రైతులు ఆందోళన చెందవద్దు**
- **47.68 లక్షల సంచుల యూరియా నిల్వలు**
- **కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా**



హైదరాబాద్, డిసెంబర్ 30 (జనంసాక్షి) : రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇచ్చిన ఆదేశాలనుసారం అన్ని జిల్లాలలో ఆయా కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా చేపట్టారు. అదేవిధంగా మంత్రి సూచన మేరకు జెడి,ఎడిఎలను జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన వ్యవసాయశాఖ డైరెక్టర్, వారు వారికి కేటాయించిన జిల్లాలలో పర్యటించి ప్రత్యక్షంగా యూరియా సరఫరాలను పర్యవేక్షించనున్నారు. రబీ సీజన్‌కు గాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వివిధ రకాల ఎరువులుగా మొత్తం 20.10 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుండి అక్టోబర్ నెల నుండి ఇప్పటివరకు రాష్ట్రానికి 5.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటికే 5.84 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు పేర్కొన్నారు. కేటాయించిన పరిమాణం కంటే 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అధికంగా జరిగిందని తెలిపారు. రబీ సీజన్‌లో ఇప్పటివరకు రైతులు 3.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేశారని, ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అంటే 47.68 లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. రబీ సీజన్‌కు అవసరమైనంత యూరియా రాష్ట్రంలో పూర్తిగా అందుబాటులో ఉంది. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించిన మేరకు యూరియా సమయానుకూలంగా రాష్ట్రానికి చేరుతోందన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు విని, భయాందోళనకు గురయి అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, అవసరమైన మేరకే రైతులు వినియోగించుకోవాలి అని మంత్రి కోరారు. యూరియా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా యూరియా నిల్వల వివరాలను వ్యవసాయ శాఖ విడుదల చేసిందని, అన్ని జిల్లాల్లో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులకు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఎరువుల సరఫరా వ్యవస్థను క్రమబద్ధంగా నిర్వహిస్తోందని, రబీ సీజన్ మొత్తం యూరియా కొరత తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు, రైతులకు అవసరం ఉన్నంత మేరకు యూరియా సరఫరా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# తిరుపతి ఆలయాల్లో భక్తుల రద్దీ

తిరుపతి, డిసెంబరు 30 (జనంసాక్షి) : తిరుమలలోనూ గత అర్ధరాత్రి నుంచే వైకుంఠ ద్వారాలు తెరుచుకోగా.. ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇక తిరుపతిలోని శ్రీనివాస మంగాపురం శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభమైంది. అర్ధరాత్రి 1:35 గంటలకు ఉత్తర ద్వారాలు తెరుచుకున్నాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. దీంతో క్యూలైన్లు అన్ని వైపులా భక్తులతో కిక్కిరిసిపోయాయి.






Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370